బుధవారం
13-11-2024
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 52
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Hyderabad,Vijayawada, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

జుహై ఎయిర్‌షోలో చైనా జెడ్-20 ఆధునిక హెలికాప్టర్లు

హాంగ్‌కాంగ్: కోస్తా నగరం జుహైలో అతిపెద్ద ఎయిర్‌షో అట్టహాసంగా ప్రారంభమైంది. ఈనెల 17వ తేదీ వరకు కోస్తా నగరంలో ఇది జరుగుతుంది. ఈ ఎయిర్‌షోలో చైనాకు చెందిన అత్యాధునిక జెడ్-20 సైనిక హెలికాప్టర్లను ప్రదర్శించారు. యూఎస్ యూహెచ్ 60 బ్లాక్ హాక్‌ను ఇవి పోలివున్నాయి. యుద్ధ విమానాలు, డ్రోన్లు, అత్యాధునిక వాహనాలు, క్షిపణులు, ఇతరత్రాలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. కాగా, జె-35ఎ స్టెయిత్ ఫైటర్‌లను చైనా మొట్టమొదటిసారి ఎయిర్‌షోలో ప్రదర్శించింది.

వికారాబాద్‌లో ఉద్రిక్తత

- కలెక్టర్‌పై దాడి కేసులో అరెస్టులు
- ఇంటర్నెట్ సేవలు నిలిపివేత

విశాలాంధ్ర-హైదరాబాద్: ఫార్మా కంపెనీ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం వికారాబాద్‌లో ఉద్రిక్తతకు దారితీసింది. వికారాబాద్ కలెక్టర్ ప్రతీక జైన్‌పై దాడిని ఐఏఎస్‌లు తీవ్రంగా ఖండించారు. దాడికి పాల్పడ్డారన్న ఆరోపణపై 52 మందిని అరెస్టు చేసి... పరిగి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. 40 మందిని తర్వాత విడుదల చేశారు. అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా లగచర్ల, రోటిబండ, పులిచర్ల సహా ఆరు గ్రామాల్లో ఇంటర్నెట్ సేవలు నిలిపివేశారు. ఉద్రిక్తత దృష్ట్యా గ్రామాల్లో పోలీసులు మోహరించారు. ఐజీ నారాయణ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కలెక్టర్, అధికారులపై దాడి వెనుక కుట్ర కోణం ఉందన్నారు. బోగమోని సురేష్ అనే వ్యక్తి అధికారులు, కలెక్టర్‌ను పక్కకు తీసుకెళ్లి వారిపై గ్రామస్తులతో దాడి చేయించారని ఆరోపించారు. సురేష్‌ను బీఆర్ఎస్ కార్యకర్తగా గుర్తించినట్లు ఐజీ తెలిపారు. అతను హైదరాబాద్‌లోని మణికొండ వాసి అని అన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా గ్రామానికి వెళ్లిన సురేష్ అక్కడి వారిని రెచ్చగొట్టినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని ఆయనన్నారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉందని, వదంతులను నమ్మొద్దని సూచించారు. సమగ్ర దర్యాప్తు తర్వాత దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. సురేష్ కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని నారాయణ రెడ్డి తెలిపారు. ఇదిలావుంటే కలెక్టర్ ప్రతీక్‌జైన్, కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డిపై సోమవారం దాడి జరిగింది. వారి వాహనాలు ధ్వంసమయ్యాయి. ఈ ఘటనపై రాష్ట్ర ఐఏఎస్ అధికారులు ఆగ్రహం వ్యక్తంచేశారు. వికారాబాద్ కలెక్టర్‌ను పరామర్శించారు.

బీఆర్ఎస్ నేతల అరెస్టు

గ్రామానికి వెళ్లేందుకు ప్రయత్నించిన బీఆర్ఎస్ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు అయిన నేతల్లో శాసనమండలి పక్ష నేత మధుసూదనచారి, మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి, ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

పథకం ప్రకారమే కలెక్టర్‌పై దాడి

విచారణ జరిపిస్తాం: మంత్రి శ్రీధర్ బాబు

విశాలాంధ్ర-హైదరాబాద్: వికారాబాద్ జిల్లా లగచర్లలో కలెక్టర్‌పై పథకం ప్రకారమే దాడి చేశారని రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరుపించి... దీని వెనుక ఎవరున్నదీ తేలుస్తామని చెప్పారు. ప్రభుత్వ కార్యక్రమాలను అడ్డుతగిలే వారిని ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. మంగళవారం సీఎల్పీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వికారాబాద్ జిల్లా లగచర్లలో కలెక్టర్, ఇతర ఉన్నతాధికారుల పైన దాడి ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందన్నారు. లగచర్ల కు కలెక్టర్ ను పథకం ప్రకారం రమ్మని చెప్పింది ఎవరు? దాడి చేసింది ఎవరు? దీని వెనుక ఉన్న కుట్రదారులపై విచారణ జరుపుతామన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో అభిప్రాయాలను తెలపడానికి వేదిక ఉంటుందన్నారు. మా ప్రభుత్వం ప్రజాస్వామ్య స్ఫూర్తి తో ఉందని, రౌడీయిజం చేసి ప్రభుత్వ అధికారులను బెదిరిస్తే ఉపేక్షించమని స్పష్టం చేశారు. ప్రధాన ప్రతిపక్షం ప్రభుత్వ కార్యక్రమాలను అడ్డుకుంటోందని ధ్వజమెత్తారు. రాష్ట్రానికి పరిశ్రమలు రాకుండా ఎవరు కుట్రలు చేస్తున్నారో బయటపెడతామని తెలిపారు. పోలీస్, ఇంటెలిజెన్స్ ,ప్రభుత్వ అధికారుల్లో ఎవరి వైఫల్యం ఉందో కూడా విచారణ జరిపిస్తామన్నారు. ప్రజాస్వామ్యయుతంగా ప్రజాభిప్రాయ సేకరణ జరపాలని కలెక్టర్ భావించారని తెలిపారు. శాంతి భద్రతల విషయంలో ప్రభుత్వం స్పష్టంగా ఉందని, శాంతిభద్రతలకు విఘాతం కలగరాదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టంగా ఆదేశాలు ఇచ్చారని చెప్పారు. మరో సారి రాష్ట్రంలో ఎక్కడా ఇలాంటి

- మిగతా 2 లో

వయనాడ్ ఉప ఎన్నిక పోలింగ్ నేడే

వయనాడ్: కేరళలోని వయనాడ్ పార్లమెంట్ స్థానానికి బుధవారం పోలింగ్ జరగనుంది. వయనాడ్ నియోజకవర్గంలో ఉపఎన్నికల ప్రచారం చివరి రోజు సోమవారం మూడు ప్రధాన రాజకీయ కూటములు రోడ్‌షోలు నిర్వహించాయి. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ... సోదరి ప్రియాంకా గాంధీ ప్రచారం చేశారు. 14 లక్షల మంది ఓటర్ల మద్దతు కోసం కాంగ్రెస్ పార్టీ నుంచి ప్రియాంక గాంధీ వాద్రా, సీపీఐ నేత సత్యన్ మొకేరి, బీజేఏ అభ్యర్థి నవ్య హరిదాస్ సహా మొత్తం 16 మంది అభ్యర్థులు

- మిగతా 2 లో

జిరిబమ్‌లో ఉద్రిక్తత ఆరుగురి గల్లంతు

ఇంఫాల్: మణిపూర్ శాంతించడం లేదు. ఈశాన్య రాష్ట్రం నిత్యం ఏదో ఒక కారణంతో రగిలిపోతూనే ఉంది. తాజాగా జిరిబమ్‌లో ఉద్రిక్తత నెలకొంది. అక్కడ భద్రతా దళాలకు, కుకీ చొరబాటుదారులకు మధ్య సోమవారం జరిగిన ఎదురు కాల్పుల్లో 10 మంది చనిపోయారు. ఎన్‌కౌంటర్ తర్వాత పరిస్థితులు గందరగోళానికి దారితీశాయి. ఆరుగురు గల్లంతయ్యారు. వీరిలో ముగ్గురు పిల్లలు, మరో ముగ్గురు మహిళలు ఉన్నారు. తాజా పరిణామాలతో మణిపూర్ పోలీసులు మంగళవారం విలేకరుల

- మిగతా 2 లో

ఏపీ అసెంబ్లీ చీఫ్ విప్ ఆంజనేయులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర శాసనసభ, శాసనమండలిలో చీఫ్ విప్, విప్‌లను ప్రభుత్వం నియమించింది. శాసనసభలో ముగ్గురు జనసేన, ఒక బీజేపీ ఎమ్మెల్యేకు విప్‌లుగా అవకాశం లభించింది. శాసనసభ చీఫ్ విప్‌గా వినుకొండ టీడీపీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, శాసన మండలిలో చీఫ్ విప్‌గా ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ నియమితులయ్యారు. వీరుగాక శాసనసభలో మరో 15 మందికి, మండలిలో ముగ్గురిని విప్‌లుగా

- మిగతా 2 లో

గ్రూప్-2 మెయిన్స్ వాయిదా

జనవరి 5 నుంచి ఫిబ్రవరి 23వ తేదీకి మార్పు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలను వచ్చే ఏడాది ఫిబ్రవరి 23వ తేదీకి వాయిదా వేశారు. షెడ్యూల్ ప్రకారం జనవరి 5న ఈ పరీక్షలు జరగాల్సి ఉండగా ఫిబ్రవరి 23కు

- మిగతా 2 లో

విద్యార్థులకు సాంకేతికత అవశ్యం

మంత్రి పొన్నం ప్రభాకర్

విశాలాంధ్ర-హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మారుతున్న కాలానికి అనుగుణంగా శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. హుస్నాబాద్ ప్రభుత్వ పాఠశాలలో స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఏర్పాటు చేసిన రోబోటిక్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, ఇంగ్లీష్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్, పాఠశాల మొబైల్ యాప్ లను సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరి తో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. రోబోటిక్ ల్యాబ్‌లో మిని రోబోలు ,సెన్సార్ లతో తయారు చేసిన పరికరాలను మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ మను చౌదరి పరిశీలించారు. సైన్స్ ల్యాబ్ లో పెరిస్కోప్ , డిజిటల్ మైక్రో స్కోప్, డ్రోన్, టెలిస్కోప్ , న్యూటన్ క్రడల్, మానవ శరీరంలో ఉండే అవయవాలు , హైడ్రో టర్బన్స్ తదితర 75 రకాల యాక్టివిటీస్‌ను పరిశీలించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ పెరుగుతున్న సాంకేతికత నేపథ్యంలో సైన్స్ ల్యాబ్, రోబోటిక్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్ ను ఉపయోగించుకోవాలని, చదువులతో పాటు అన్ని

- మిగతా 2 లో

మత్స్య సంపద దోపిడీ

అక్రమార్కులకు రాజకీయనేతలు, అధికారుల అండదండలు

ముడుపుల కక్కుర్తితో గిరిజనుల పొట్టకొడుతున్న వైనం

విశాలాంధ్ర-దేవీపట్నం (అల్లూరి జిల్లా): రాజకీయనేతలు, అధికారుల అండదండలతో గోదావరిలో గిరిజనులకు ఉపాధిగా ఉన్న మత్స్య సంపద దోపిడీకి గురవుతోంది. పోలవరం సాగునీటి ప్రాజెక్టు పరిధిలో కాఫర్ డ్యామ్ ఎగువన గోదావరిలో అపార మత్స్య సంపద ఉంది. కాసులకు కక్కుర్తి పడి కొంతమంది రాజకీయ నాయకులు, అధికారులు నువ్వునాది పరివాహక ప్రాంతంలోని గిరిజనుల ఉపాధికి గండి కొడుతున్నారు. పోలవరం ప్రాజెక్టు లో ఆరు పంచాయితీలు, 44 గిరిజన ఆవాసాలలో గిరిజనులు పూర్తిగా ఉపాధిని కోల్పోయారు. గోదావరి నదిపై ఆధారపడ్డ గిరిజనులకు ఉపాధి కల్పించటంలో రంపచోడవరం మత్స్య శాఖ అధికారులు గానీ , గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) గానీ పూర్తిగా విఫలమైంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీకి చెందిన స్థానిక నాయకులకు భారీగా ముడుపులు ముట్టజెప్పి... ఐలు (శీరమీను)వలలు ఉపయోగించి పెద్ద ఎత్తున చేపల్ని వేటాడేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనూ తుని నియోజకవర్గం నుండి వచ్చిన ఒక చేపల వ్యాపారి ... స్థానిక తెలుగు తమ్ముళ్లకు రూ.లక్షల్లో ముడుపులు ముట్టజెప్పి గోదావరి నదిలోని 'చీడు ఫీడు' (చేప జాతి రకం)ను దోచుకు పోయి ఇతర రాష్ట్రాలకు రవాణా చేసి కోట్లాది రూపాయలు దండుకుంటున్నారు. గిరిజనులు, స్థానిక మత్స్యకారులు సంప్రదాయ పద్ధతుల్లో చేపల వేట సాగిస్తూ ఇబ్బందికరమైన జీవనం గడుపుతుంటే... మైదాన ప్రాంత చేపల వేట గాళ్లు ఆయిల్ వలలతో నదీ గర్భంలోకి వెళ్లి మరీ మత్స్యసంపదనంతటినీ దోచుకుంటున్నారు. దీనిపై రంపచోడవరం మత్స్యశాఖ అధికారులు గత సంవత్సర కాలంగా ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదు. మరో పక్క ముంపు ప్రాంత బాధితులకు నది ద్వారా ఉపాధి కల్పించకుండా మైదాన ప్రాంత చేపల వ్యాపారులతో కుమ్మక్కై దోపిడీకి సహకరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలా ఉంటే దళారులకు మత్స్య శాఖ అధికారుల నుంచి చేపల దోపిడీకి సంపూర్ణ సహకారం లభిస్తోందని చేపల వేటపై ఆధార పడ్డ గిరిజనులు మండిపడుతున్నారు. మత్స్య శాఖ ద్వారా చేపల వేటకు లైసెన్స్ లు తీసుకున్న గిరిజనులు వేటకు ఉపయోగ పడే పరికరాలు లేక ఇబ్బందులు పడుతుండగా... దళారుల ద్వారా ఈ ప్రాంతానికి వచ్చిన అక్రమార్కులు దోపిడీకి పాల్పడుతున్నారు. మత్స్య శాఖ, గిరిజనాభివృద్ధి సంస్థ గిరిజనులకు చేపల వేటకు అవసరమైన పరికరాలు అందజేసి... పోలవరం ప్రాజెక్టు నదీ జలాల్లో వేటాడుకోవటానికి అవకాశాలు కల్పించాలని, ఇప్పటికైనా మత్స్యసంపద దోపిడీ ని నివారించాలని గిరిజనులు, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు కోరుతున్నారు. ఈ వ్యవహారంపై గతంలో రంపచోడవరం డీఎస్పీ, ఏఎస్పీ లకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని గిరిజన మత్స్యకారులు వాపోతున్నారు. దోపిడీదారులపై అధికారులు చర్యలు తీసుకోక పోవడం శోచనీయమని, ఈ విషయంపై ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని తమకు న్యాయం చేయాల్సిందిగా నదీ పరివాహక ప్రాంత గిరిజనులు కోరుతున్నారు.

ఇంటితోనే పేదలకు ఆత్మగౌరవం

సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-అనంతపురం: పేదలు ఆత్మగౌరవంతో జీవించడానికి సొంతింటి కల నెరవేరాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ అన్నారు. నాగిరెడ్డిపల్లి దగ్గర ఉన్న నవయుగ సీపీఐ కాలనీలో ఇంటి పట్టాల కోసం దరఖాస్తులు రాసే కార్యక్రమాన్ని రామకృష్ణ మంగళవారం ప్రారంభించారు. సీపీఐ నగర కార్యదర్శి ఎన్.శ్రీరాములు అధ్యక్షత వహించగా రామకృష్ణతోపాటు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డి.జగదీశ్, జిల్లా కార్యదర్శి సి.జాఫర్, జిల్లా సహాయ కార్యదర్శి పి.నారాయణస్వామి పాల్గొన్నారు. రామకృష్ణ మాట్లాడుతూ పట్టణాలలో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల చొప్పున పేదలకు స్థలాలు ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఆ హామీ తప్పకుండా అమలు చేయాలని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని కోరుతున్నామన్నారు. దీనిపై చంద్రబాబును, గృహ నిర్మాణశాఖ మంత్రి పార్థసారథిని కలిశామని, గృహ నిర్మాణానికి ఏప్రిల్ నుంచి నిధులు విడుదల చేస్తామని మంత్రి చెప్పారన్నారు. నవయుగ కాలనీవాసులకు ఐదున్నర ఎకరాల్లో 180 కుటుంబాలకు పట్టాలిప్పించి... ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు వచ్చేలా ఇక్కడి నుంచే దరఖాస్తు కార్యక్రమం చేపట్టామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సచివాలయాల్లో ఇచ్చిన అర్జీలను ముఖ్యమంత్రి, గృహ నిర్మాణశాఖ మంత్రికి అందజేస్తామన్నారు. డి.జగదీశ్ మాట్లాడుతూ అనంతపురం పట్టణం అభివృద్ధికి సీపీఐ కారణమన్నారు. పేదలకు ఇంటి పట్టాలిప్పించడమే కాకుండా గృహ నిర్మాణానికి మౌలిక వసతులు సాధించామన్నారు. బుక్కరాయసముద్రం, అనంత రూరల్ ప్రాంతాల్లో పేదల కాలనీ ఏర్పడటంతోనే అభివృద్ధికి బీజం పడిందన్నారు. జాఫర్ మాట్లాడుతూ రామకృష్ణ నాయకత్వంలో అనంతపురం నగరంలో 13 వేల మందికి ఇంటి స్థలాలు ఇప్పించిన ఘనత సీపీఐదని చెప్పారు. నారాయణస్వామి మాట్లాడుతూ దరఖాస్తులు పూర్తి చేసే కార్యక్రమాన్ని నవయుగ కాలనీలో మొట్టమొదటిసారిగా రామకృష్ణ ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. సీపీఐ నేతలు సి.లింగమయ్య, జి.సంతోశ్ కుమార్, కృష్ణుడు, అలీపీరా, రమణయ్య, జయంతి, ఖాజా హుస్సేన్, మున్నా, దాదు, చాంద్, నవయుగ కాలనీ కార్యదర్శి రాజు, మల్లికార్జున, కాలనీవాసులు పాల్గొన్నారు.

20 నుంచి విద్యుత్ చార్జీలపై ఆందోళనలు

విద్యుత్ చార్జీలు పెంచబోమన్న హామీని రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందని రామకృష్ణ ఆరోపించారు. విద్యుత్ వినియోగదారులపై రూ.18 వేల కోట్ల భారం మోపడం సరికాదని హితవు పలికారు. విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా ఈ నెల 20 నుంచి 30వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఇక్కడి సీపీఐ కార్యాలయంలో మంగళవారం రామకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌ను రూ.2,94,427 కోట్లతో ప్రతిపాదించిందని, ఈ బడ్జెట్ వల్ల ఆశించిన ఫలితాలు ఉంటాయో...లేదో చూడాలన్నారు. కేంద్రం నుంచి నిధులు సాధించకుండా ప్రజలపై భారాలు మోపడం సరికాదన్నారు. ముందు రూ.6 వేలకు పైగా విద్యుత్ భారం మోపిన ప్రభుత్వం... మళ్లీ రూ.11 వేలకు పైగా పెంచడానికి ప్రయత్నించడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. ఈనెల 19 లోపు

- మిగతా 2 లో

ఇప్పటికైనా మాట నిలబెట్టుకో

రేవంత్‌కు హరీశ్‌రావు హితవు

విశాలాంధ్ర-హైదరాబాద్: పంద్రాగస్టులోపు సంపూర్ణ రుణమాఫీ చేస్తానని ప్రయాణాలు చేసి మాట తప్పారని సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. వేములవాడ రాజరాజేశ్వరస్వామి మీద ఓట్టు పెట్టి మాట తప్పడం ఏమిటని నిలదీశారు. వేములవాడ రాజన్న దర్శనం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాలకుడే పాపం చేస్తే ఆ రాష్ట్రానికి అరిష్టమన్నారు. రేవంత్ పాపం ప్రజలకు శాపం కావద్దని మొక్కుకున్నానని తెలిపారు. మద్దతు ధర రాకపోవడంతో రైతులు తమ పంటను దళారులకు అమ్ముకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పౌరసరఫరాల శాఖ మంత్రిగా గంగుల కమలాకర్ ఉన్నప్పుడు, బీఆర్ఎస్ ప్రభుత్వం చివరి గింజ దాకా కొనుగోలు చేసిందని హరీశ్‌రావు గుర్తు చేశారు. వడ్లకు బోనస్ ఇచ్చామన్నారు. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో రేవంత్ అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. రైతుబంధు ఎగ్గొట్టిన రేవంత్... యాసంగి పంటకైనా

- మిగతా 2 లో

కేసుల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

విశాలాంధ్ర-కొత్తగూడెం: ఎస్సీ ఎస్టీ కేసుల విషయంలో నిర్లక్ష్యం వహించకుండా సత్వర పరిష్కారం కోసం అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బిక్కీ వెంకటయ్య ఆదేశించారు. మంగళవారం ఆయన భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావుతో కలిసి కొత్తగూడెంలోని ఐడీఓసీ కార్యాలయంలో భూ, అట్రాసిటీ సమస్యలపై రెవెన్యూ, పోలీస్, సాంఘిక సంక్షేమ, ఇతర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిధిలో నమోదైన అట్రాసిటీ కేసులు, వాటి పురోగతి వివరాలను డీఎస్పీలు రెహమాన్, సతీష్ లు చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎస్సీ ఎస్టీలకు సంబంధించిన

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ప్రభుత్వాన్ని విమర్శిస్తూ రాస్తే పెయింటర్‌నైన నన్నుకూడా లోపలేస్తారు సార్!

వాతావరణ సంక్షోభాన్ని పరిష్కరించుకోకపోతే

మానవతా విపత్తు తప్పదు

కాప్ 29 సదస్సులో ప్రపంచ దేశాలకు ఐరాస హెచ్చరిక



బకు: వాతావరణ సంక్షోభాన్ని యుద్ధప్రాతిపదికన పరిష్కరించుకోనిపక్షంలో మానవతా విపత్తును ఎదుర్కోక తప్పబోదని ప్రపంచ దేశాలకు ఐక్యరాజ్య సమితి (ఐరాస) హెచ్చరించింది. మూల్యం చెల్లించండి లేదంటే వాతావరణంలో మార్పుల ద్వారా సంభవించే మానవతా విపత్తును ఎదుర్కోండి అంటూ ఐక్యరాజ్య సమితి జనరల్ సెక్రటరీ ఆంటోనియో గుటెర్రస్ స్పష్టంచేశారు. తక్షణమే స్పందించకపోతే మున్ముందు పరిస్థితులు భరించలేనివిగా మారిపోతాయన్నారు. ప్రపంచ ఉష్ణోగ్రతలు ప్రమాదకర స్థాయికి పెరగకుండా చర్యలు తీసుకునేందుకు ఇప్పటికే ఎక్కువ సమయం లేదని అన్నారు. అజర్బైజన్‌లోని బకులో జరిగిన కాప్ 29 సదస్సుకు దాదాపు 200 దేశాల ప్రతినిధులు హాజరయ్యారు. అమెరికా ఎన్నికల పరిణామాలతో ఆ దేశాధ్యక్షుడు జోబైడెన్ రాలేదు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు బదులు ఆయన డిప్యూటీ హాజరయ్యారు. బ్రస్సెల్ రాజకీయ పరిణామాల కారణంగా యూరోపియన్ కమిషనర్ అధ్యక్షురాలు ఉర్సులా వండెర్ లెయన్ గైర్హాజరయ్యారు. కాప్ సదస్సు ప్రారంభం రోజు ఐదు గంటలు ఆలస్యంగా మొదలైంది. ఈయూ, ఇతర దేశాల మధ్య మక్కుబడిగా రాజీ కుదిర్చింది. పర్యావరణానికి నష్టం కలిగించే కర్బన ఉద్గారాలు తగ్గించడం, స్వచ్ఛ ఇంధన వనరుల ప్రపంచ పరివర్తం కోసం వందల బిలియన్ల డాలర్లు సేకరించడం ఉద్దేశంతో ఈ సదస్సు నిర్వహించారు. కాప్ 29 అధికారులు మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సదస్సు ప్రాథమిక లక్ష్యసాధనకు ప్రపంచ దేశాలకు కట్టుబడాలని కోరారు. అభివృద్ధి చెందుతున్న దేశాలకు వార్షిక వాతావరణ సాయంగా ట్రిలియన్ డాలర్ల వరకు సమకూర్చే ఒప్పందం జరిగిందన్నారు. ప్రతి దేశం పర్యావరణ పరిరక్షణ చర్యలకు నూటికి నూరుశాతం కట్టుబడినప్పుడే అన్ని దేశాలకు ప్రయోజనమని యూఎన్ఎఫ్‌సీసీ వాతావరణ సంస్థ అధిపతి సైమన్ స్టియిల్ అన్నారు. ఆర్థిక వ్యవస్థను చంపే శక్తిగా వాతావరణ విపత్తు వేగంగా మారుతోందని హెచ్చరించారు. ఉద్గారాల కట్టడికి ప్రతి దేశం పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. లేనిపక్షంలో ప్రతి దేశం, ప్రతి ఇల్లు తీవ్ర పరిణామాలు ఎదుర్కొవాలని, ప్రతి దినం ఓ కాళరాత్రిని తలపిస్తుందని హెచ్చరించారు.

లెబనాన్‌లో కాల్పులు విరమించం

బీరుట్‌పై వైమానిక దాడులు తీవ్రతరం: ఇజ్రాయిల్ రక్షణమంత్రి

బీరుట్: గాజా, లెబనాన్‌పై ఇజ్రాయిల్ దళాలు విరుచుకుపడుతున్నాయి. భూతల, వైమానిక దాడులను భీకరంగా సాగిస్తున్నాయి. లెబనాన్ రాజధాని బీరుట్‌లో మంగళవారం హెజ్బుల్లాకు పట్టున్న దక్షిణ శివారు ప్రాంతాల్లో ఐడీఎఫ్ ఐదుసార్లు వైమానిక దాడులు జరిపింది. నిత్యం జరుగుతున్న దాడుల్లో భారీగా ప్రాణ నష్టం సంభవిస్తోంది. అయితే లెబనాన్‌లో కాల్పులను విరమించే ప్రసక్తే లేదని ఇజ్రాయిల్ రక్షణ మంత్రి ఇజ్రాయిల్ కట్జ్ తేల్చిచెప్పారు. హెజ్బుల్లా లక్ష్యంగా దాడులను మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సైన్యాధికారులతో సమావేశం అనంతరం కట్జ్ ఈ మేరకు ఎక్స్‌లో పేర్కొన్నారు.

సిరియాలో అమెరికా దాడులు

సిరియాలోని ఇరాన్ సంబంధిత లక్ష్యాలపై అమెరికా సైన్యం దాడులకు తెగబడింది. ఇరాన్ సంఘాలతో ముడిపడ్డ సిరియాలోని తొమ్మిది లక్ష్యాలపై వైమానిక దాడులు నిర్వహించినట్లు అమెరికా సైన్యం ప్రకటించింది.

ఇజ్రాయిల్‌పై 75 క్షిపణులతో హెజ్బుల్లా దాడి

లెబనాన్ వైపు నుంచి 75 క్షిపణులు తమ భూభాగంలోకి దూసుకొచ్చినట్లు ఇజ్రాయిల్ రక్షణ దళాలు (ఐడీఎఫ్) ప్రకటించింది. ఈ దాడి చేసినది హెజ్బుల్లా అని పేర్కొంది. హెజ్బుల్లా ముప్పు నుంచి ఇజ్రాయిల్ దేశాన్ని, పౌరులను రక్షించేందుకు ఐడీఎఫ్ అంకితమైందని వెల్లడించింది. ఇప్పటివరకు లెబనాన్‌లో ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో 3,243 మంది చనిపోగా, 13,134 మంది గాయపడ్డారని లెబనాన్ ఆరోగ్యశాఖ తెలిపింది. 24గంటల్లో 54 మంది మరణించారని, మరో 56 మందికి గాయాలయ్యాయని పేర్కొంది.

ట్రంప్ ప్రభుత్వ చర్యల కోసం ప్రపంచ నిరీక్ష: ఇరాన్

అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం ఏర్పాటు అయి... హమాస్, హెజ్బుల్లాతో ఇజ్రాయిల్ పోరును ఆపుతుందని ప్రపంచం మొత్తం ఎదురుచూస్తోందని ఇరాన్ మొదటి ఉపాధ్యక్షుడు మహమ్మద్ రెజా ఆరిఫ్ అన్నారు. ఇజ్రాయిల్‌కు వెన్నుదన్నుగా ఉన్న దేశంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు ఆసక్తికరంగా మారిందన్నారు. గాజా, లెబనాన్‌లోని అమాయక ప్రజలపై సాగుతున్న పోరుకు ట్రంప్ నాయకత్వం వెంటనే ముగింపు పలుకుతుందని యావత్ ప్రపంచం ఆశిస్తోందని, ఆ దిశగా తీసుకునే చర్యల కోసం ఎదురుచూస్తోందని ఆయనన్నారు. కాగా, ఇరాన్ సార్వభౌమత్వాన్ని గౌరవించాలని, ఆ దేశంపై దాడులు చేయొద్దని ఇజ్రాయిల్‌కు సౌదీ హితవు పలికింది.

గాజాలోని మనవతా క్షేత్రాలపై ఇజ్రాయిల్ దాడులు

గాజాలో ఇజ్రాయిల్ స్వయంగా ప్రకటించిన రక్షిత ప్రాంతాలు, మానవతా క్షేత్రాలపైనా భీకర దాడులు సాగిస్తోంది. తాజాగా శరణార్థి శిబిరంపై చేసిన దాడిలో 14 మంది చనిపోయారు. మంగళవారం తెల్లవారుజామున సెంట్రల్ గాజాలోని నుసీరత్ శరణార్థి శిబిరంలోని ఇంటిపై ఇజ్రాయిల్ దాడి చేయగా ముగ్గురు చనిపోయారు. మరో 11 మందికి గాయాలయ్యాయి. అలాగే సోమవారం అర్ధరాత్రి మువాసీ శిబిరంపై చేసిన దాడిలో ఇద్దరు పిల్లలతో సహా 11 మంది ప్రాణాలు కోల్పోయారు. రక్తపు మడుగులో శిథిలాల కింద చిక్కుకున్న మృతదేహాలను స్థానికులు, సహాయక సిబ్బంది వెలికితీసినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

గ్రూప్-2 మెయిన్స్ వాయిదా

(మొదటిపేజీ తరువాయి)

వాయిదా వేసినట్లు ఏపీపీఎస్సీ కార్యదర్శి జె.ప్రదీప్‌కుమార్ మంగళవారం తెలిపారు. పరీక్షల కోసం గడువు కోరుతూ ఏపీపీఎస్సీ చైర్మన్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి పట్టభద్రుల ఎమ్మెల్సీలు విజ్ఞప్తి చేశారు. వైసీపీ హయాంలో 2023లో డిసెంబరులో గ్రూప్-2 మెయిన్స్‌కు (నోటిఫికేషన్ నంబరు 11/2023) జారీజేశారు. మొత్తం 899 పోస్టులకుగాను ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రిలిమ్స్ నిర్వహించగా, 92,250 మంది మెయిన్స్‌కు అర్హత సాధించారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఏపీపీఎస్సీ మాజీ చైర్మన్ గౌతమ్ సవాంగ్ రాజీనామా చేశారు. ఆపై నాలుగు నెలలు నియామకం లేక మెయిన్స్ పరీక్షలకు అంతరాయం కలిగింది. డీఎస్సీ పరీక్షలకు ఈనెల 5న నోటిఫికేషన్ వస్తే, జనవరిలో పరీక్షలకు అవకాశముంది. డీఎస్సీ, ఏపీపీఎస్సీ గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు ఏకకాలంలో నిర్వహిస్తే అభ్యర్థులకు అసౌకర్యం కలుగుతుంది. ఇప్పుడు గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలను ఫిబ్రవరి 23కు వాయిదాతో... ఈలోగా డీఎస్సీ నోటిఫికేషన్ వస్తే జనవరిలో పరీక్షలు ఉంటాయి. మరోవైపు గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు పదేపదే వాయిదా పడటంతో దీనిపై పూర్తిగా దృష్టి పెట్టిన అభ్యర్థులకు నష్టపోయే అవకాశముంది.

19, 20 తేదీల్లో ఆయుర్వేద ధ్రువీకరణ పత్రాల పరిశీలన

ఆయుర్వేద విభాగంలోని వైద్యాధికారుల పోస్టుల భర్తీకి నిర్వహించిన పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలను ఈనెల 19, 20 తేదీల్లో పరిశీలించనున్నట్లు ఏపీపీఎస్సీ వెల్లడించింది. వైద్యాధికారుల పోస్టులకు 1:3 నిష్పత్తిలో ప్రతిభా ప్రాతిపదికన అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. ఎంపికైన వారి ధ్రువీకరణ పత్రాలను విజయవాడ బందరు రోడ్డులోని ఏపీపీఎస్సీ కార్యాలయంలో పరిశీలిస్తారు. అన్ని వివరాలు ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌లో ఉన్నాయి.

స్వతంత్ర పలస్తీనాకు మద్దతివ్వండి

- ప్రపంచ దేశాలకు అరబ్, ముస్లిం నేతల పిలుపు
- ఇజ్రాయిల్ దురాక్రమణ ఆపాలని డిమాండ్

రియాద్: పశ్చిమాసియాలో ఇజ్రాయిల్ దురాక్రమణను ఆపడం తక్షణావశ్యమని, స్వతంత్ర పలస్తీనా ఏర్పాటుకు మద్దతివ్వాలని ప్రపంచ దేశాలకు అరబ్, ముస్లిం నేతలు పిలుపునిచ్చారు. ఆక్రమిత పలస్తీనా భూభాగాల నుంచి ఇజ్రాయిల్ సేనల ఉపసంహరణకు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. ప్రాదేశిక శాంతి సాధనకు తక్షణమే చర్యలు చేపట్టడం అవసరమన్నారు. అరబ్ లీగ్, ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కోఆపరేషన్ అధ్వర్యంలో సౌదీ రాజధాని రియాద్‌లో చారిత్రక సదస్సు జరిగింది. ఇజ్రాయిల్-హమాస్ పోరు క్రమంలో 57దేశాల సంఘీభావంగా ఈ సదస్సు సాగింది. తూర్పు జెరూసలేం రాజధానిగా స్వతంత్ర పలస్తీనా ఏర్పాటుకు రియాద్ సదస్సు సంకల్పించింది. ఈ దిశగా కచ్చితమైన కార్యాచరణతో కూడిన అంతర్జాతీయ తోడ్పాటుతో ప్రణాళిక కావాలని కోరింది. ఈ లక్ష్య సాధనకు కాల పరిమితి ఉండాలని పేర్కొంది. 1967కు ముందు నిర్దేశించిన సరిహద్దులతో పలస్తీనా దేశాన్ని గుర్తించాలని ప్రపంచ దేశాలకు విజ్ఞప్తి చేసింది. ఐక్యరాజ్య సమితి నాటి తీర్మానం, 2002 అరబ్ శాంతి ఒప్పందానికి కట్టుబడి ఇదంతా జరగాలని డిమాండ్ చేసింది. గాజా, లెబనాన్‌లో ఇజ్రాయిల్ దౌర్జన్యాలను తీవ్రంగా ఖండించింది. ఇజ్రాయిల్ మారణహోమం సృష్టిస్తోందని దుయ్యబట్టింది. ప్రాదేశిక శాంతి స్థాపన, పలస్తీనా సమస్యకు సమగ్ర-న్యాయమైన పరిష్కారం కోసం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఇజ్రాయిల్ దురాక్రమణ-హింసను తక్షణమే ఆపాలని అరబ్, ముస్లింల నేతలు ఐక్యంగా డిమాండ్ చేశారు. ఇజ్రాయిల్ హింస విషయంలో ప్రపంచం గుడ్డిగా వ్యవహరించ లేదన్నారు. ఇజ్రాయిల్ దాష్టీకాల కట్టడి ద్వారానే పలస్తీనాకు న్యాయం జరుగుతుందని, ఇందుకోసం ప్రపంచ మద్దతును కోరారు. పలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తించాలని ప్రపంచ దేశాలకు అరబ్, ముస్లిం నాయకులు పిలుపునిచ్చారు.

రిలయన్స్ భారీ బొనాంజా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్ర ప్రదేశ్‌కు మరో భారీ పెట్టుబడి వచ్చింది. రూ.65 వేల కోట్ల పెట్టుబడి పెట్టేందుకు రిలయన్స్ ఎనర్జీ ముందుకు వచ్చింది. ఈ మేరకు సీఎం చంద్రబాబు సమక్షంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ, రిలయన్స్ ఇండస్ట్రీస్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఇందులో భాగంగా రాష్ట్రంలో 500 ఆధునిక బయోగ్యాస్ ప్లాంట్‌లను రిలయన్స్ ఏర్పాటు చేయనుంది. రిలయన్స్ పెట్టుబడులతో రాష్ట్రంలో 2.5 లక్షల మందికి ఉపాధి కలిగే అవకాశం ఉంది. గత నెలలో రిలయన్స్ చైర్మన్ ముకేశ్ అంబానీ, రిలయన్స్ క్లీన్ ఎనర్జీకి నేతృత్వం వహిస్తోన్న అనంత్ అంబానీని లోకేశ్ ముంబైలో కలిశారు. గ్రీన్ ఎనర్జీ, క్లీన్ ఎనర్జీ రంగాలకు ఏపీ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను మంత్రి వారికి వివరించారు. ఏపీలో పెట్టుబడులకు పూర్తిస్థాయి రోడ్ మ్యాప్‌తో మంగళవారం సీఎం చంద్రబాబు సమక్షంలో అవగాహనా ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రిలయన్స్ సంస్థతో ఒప్పందం కుదరడంపై హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రాభివృద్ధిలో ఇవాళ చాలా ముఖ్యమైన రోజుగా పేర్కొన్నారు. ప్రాజెక్టు మూడేళ్లలో పూర్తి కావాలని, ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి అన్ని రకాలుగా సహకారం అందిస్తామన్నారు. ఒక్కో బయోగ్యాస్ ప్లాంట్‌ను రూ.131 కోట్లతో నిర్మిస్తారని, 500 బయోగ్యాస్ ప్లాంట్లకుగాను రూ.65 వేల కోట్ల పెట్టుబడులు రానున్నాయని సీఎం చెప్పారు. దీనిద్వారా రాష్ట్రానికి ఆదాయం రావడంతో పాటు పర్యావరణానికి మేలు జరుగుతుందన్నారు. ఎన్నికల హామీ ప్రకారం 20 లక్షల ఉద్యోగాల కల్పనకు సబ్ కమిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న మంత్రి నారా లోకేశ్ ఆ బాధ్యతను నెరవేర్చే క్రమంలో నేటి ఒప్పందం కీలక ముందడుగుగా అభివర్ణించారు. మంత్రులు టీజీ భరత్, గొట్టిపాటి రవికుమార్ కూడా వేగంగా నిర్ణయాలు తీసుకుని ప్రాజెక్టు ఒప్పందం జరగడానికి దోహదపడ్డారని సీఎం వారిద్దరినీ ప్రశంసించారు.

ఫలించిన లోకేశ్ కృషి

అమెరికా పర్యటనకు ముందు మంత్రి లోకేశ్ ముంబైలో రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించే అంశంపై ప్రముఖ పారిశ్రామిక వేత్తలను కలిశారు. ఆ సమయంలో రిలయన్స్ చైర్మన్ ముకేశ్ అంబానీని, రిలయన్స్ క్లీన్ ఎనర్జీకి నేతృత్వం వహిస్తున్న అనంత్ అంబానీని కూడా కలిశారు. లోకేశ్ కృషితో ఇప్పటికే ఏపీలో సౌర, పవన విద్యుత్ రంగంలో రూ.40 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు టాటా పవర్ ముందుకు వచ్చింది. స్టీల్ దిగ్గజం ఆదిత్య మిట్టల్‌తో రూ.1.4 లక్షల కోట్ల పెట్టుబడిని కూడా ఖరారు చేశారు. ముంబైలో చర్చల తర్వాత కేవలం 30 రోజుల వ్యవధిలోనే పెట్టుబడులు కార్యరూపం దాల్చడం విశేషంగా అధికార పార్టీ నేతలు పేర్కొంటున్నారు.

ఇంటితోనే పేదలకు ఆత్మగౌరవం

(మొదటిపేజీ తరువాయి)

అభ్యంతరాలు తెలియజేయాలని కోరడంతో సీపీఐ తరపున లేఖ రాశామన్నారు. విద్యుత్ చార్జీలకు నిరసనగా ఈనెల 19న విజయవాడలో భారీ ఎత్తున వామపక్ష పార్టీల అధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపడుతున్నామన్నారు. 20 నుంచి 30వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజాచైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యుత్ చార్జీలు తగ్గించేంతవరకు ఉద్యమిస్తామన్నారు. సోషల్ మీడియాలో రాజకీయాలకు సంబంధం లేని కుటుంబ సభ్యులపై బూతులు మాట్లాడటం నీచమైన చర్య అన్నారు. రాజకీయ విమర్శలు చేసిన మాజీమంత్రిని పోలీసులు అదుపులోకి తీసుకోవడం సరైంది కాదన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీశ్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం 41,421 పట్టాలు ఇచ్చిందని, కానీ చాలానన్ని నిధులు ఇవ్వకపోవడంతో 60 శాతం మంది ఇంటి నిర్మాణానికి దూరమయ్యారన్నారు.

కాలుష్య కోరల్లో పాక్

ఆసుపత్రుల్లో చేరిన లక్షల మంది

ఇస్లామాబాద్: పాకిస్థాన్ కాలుష్య కోరల్లో చిక్కుకుంది. లాహోర్‌తోపాటు పంజాబ్ ప్రావిన్సులోని 17 జిల్లాల్లో కాలుష్యం ఎక్కువగా ఉంది. దీని వల్ల నెల రోజుల్లో దాదాపు 18లక్షల మంది ఆసుపత్రులల్లో చేరినట్లు ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. కాలుష్య స్థాయి రోజురోజుకు పెరుగుతున్నందున మరో ఐదు రోజులు పాఠశాలలకు సెలవు ఇచ్చారు. పార్కులు, మ్యూజియాలను మూసివేశారు. రోగుల్లో ఎక్కువ మంది శ్వాసకోశ సంబంధిత వ్యాధులు, కళ్లమంట వంటి లక్షణాలతో బాధపడుతున్నారని అధికా రులు తెలిపారు. అత్యవసరమైతేనే గడప దాటాలని ప్రజలకు సూచిస్తున్నారు.

క్రూయిజ్ క్షిపణి పరీక్ష విజయవంతం

భువనేశ్వర్: దూర లక్ష్యాలు ఛేదించగల క్రూయిజ్ క్షిపణి తొలి ఫ్లయిట్ పరీక్ష విజయవంతమైంది. ఒడిశా తీరం చాందీపూర్ ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్‌లో మొబైల్ ఆర్టిక్యులేటెడ్ లాంచర్ నుంచి ఈ పరీక్ష నిర్వహించినట్లు డీఆర్‌డీఓ వెల్లడించింది. రాడార్, ఎలక్ట్రో-ఆప్టికల్ ట్రాకింగ్ సిస్టమ్, టెలిమెట్రీ వంటి బహుళ శ్రేణి సెన్సార్‌ల ద్వారా క్షిపణి పనితీరును శాస్త్రవేత్తలు పర్యవేక్షించారు. మెరుగైన పనితీరు కోసం అధునాతన ఏవియానిక్స్, సాఫ్ట్‌వేర్‌లను అమర్చారు. ఎల్ఆర్ఎల్ ఏసీఎం అనేది డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్, యాక్సెప్టెన్స్ రిక్వైర్‌మెంట్ ఆమోదించబడిన మిషన్ మోడ్ ప్రాజెక్ట్. డీఆర్‌డీవో ప్రయోగ శాలలు, భారతీయ పరిశ్రమల సహకా రంతో బెంగళూరులోని ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ ద్వారా ఎల్ఆర్ఎల్‌సీఎం అభివృద్ధి చేసింది.

జగన్ బెయిల్‌రద్దుపై

విచారణ వాయిదా

మరో ధర్మాసనానికి పిటిషన్లు బదిలీ చేస్తూ సీజే ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసు వ్యవహారంపై మంగళవారం సుప్రీం కోర్టులో కీలక పరిణామం చోటుచేసు కుంది. అక్రమాస్తుల కేసులో జగన్ బెయిల్ రద్దు చేయాలని నాటి వైసీపీ మాజీ ఎంపీ రఘురామకృష్ణరాజు పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు విచారణను హైదరాబాద్ నుంచి మరో రాష్ట్రానికి మార్చాలని పిటిషన్ వేశారు. ఈ మేరకు రఘురామ వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. రఘురామ పిటిషన్లపై సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా ధర్మాసనం విచారణ జరిపింది. జస్టిస్ సంజీవ్ ఖన్నాతో పాటు ధర్మాసనంలో సభ్యుడిగా జస్టిస్ సంజయ్‌కుమార్ ఉన్నారు. విచారణ ప్రారంభం కాగానే పిటిషన్ ఆంధ్ర ప్రదేశ్‌కు చెందినదని జగన్ తరపు న్యాయవాది బెంచ్‌కి వివరించారు. దీంతో వెంటనే న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కుమార్ 'నాట్ బిఫోర్ మీ' అనడంతో పిటిషన్లు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా మరో ధర్మాసనానికి బదిలీ చేశారు. న్యాయమూర్తి మారిన పరిస్థితుల్లో కౌంటర్ దాఖలుకు తమకు కొంత సమయం కావాలని సీబీఐ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోరారు. ఈ మేరకు జస్టిస్ అభయ్ ఎస్ ఓకా నేతృత్వం వహించే ధర్మాసనం ముందుకు డిసెంబరు 2న విచారణకు పంపాలని సీజే రిజిస్ట్రీని ఆదేశించారు.

పోలింగ్ నేడే

(మొదటిపేజీ తరువాయి)

పోటీ పడుతున్నారు. రాహుల్‌గాంధీ రాజీనామాతో వయనాడ్‌కు ఉప ఎన్నిక జరుగుతుంది. ఆయన స్థానంలో కాంగ్రెస్ పార్టీ ప్రియాంకను బరిలో నిలిపింది. రాహుల్ సోదరిని పోటీకి దింపడం ద్వారా యూడీఎఫ్ కంచుకోటగా భావించే సీటును నిలుపుకోవాలని కాంగ్రెస్ యోచిస్తోంది. మరోవైపు.. సీపీఐ, బీజేపీ సైతం ఈ నియోజకవర్గాన్ని కాంగ్రెస్ పార్టీ నుంచి కైవసం చేసుకోవాలని భావిస్తున్నాయి. వయనాడ్ ప్రజల్లో రాహుల్‌కు ఉన్న ఆదరణపై కాంగ్రెస్ దృష్టి సారించింది. మరోవైపు ప్రజాభిప్రాయాన్ని తమకు అనుకూలంగా మలుచుకోవడం కోసం రాహుల్ గాంధీ వయనాడ్ నియోజకవర్గాన్ని వదులుకున్నారని ఎల్‌డీఎఫ్, బీజేపీ ఆరోపణలు గుప్పిస్తున్నాయి. ప్రియాంకా గాంధీ గెలిస్తే... ఆమె కూడా తన సోదరుడిలాగా నియోజకవర్గంలో అందుబాటులో లేకుండా పోతారని బీజేపీ విమర్శలు గుప్పించింది. బీజేపీ విమర్శలను తిప్పికొడుతూ ప్రియాంకా గాంధీ... తను క్రమం తప్పకుండా వయనాడ్‌కు వస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గంలో మొత్తం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఎన్నికల విధుల కోసం సీఆర్‌పీఎఫ్, సాయుధ పోలీసు బెటాలియన్‌కు చెందిన సిబ్బందితో భద్రతా ఏర్పాట్లు చేవారు. బుధవారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమవుతుంది. నవంబర్ 23న ఓట్ల లెక్కింపు జరగనుంది.

సత్యన్ మొకేరి నేపథ్యం

సీపీఐ ప్రముఖ నాయకుడు సత్యన్ మొకేరి. కోజికోడ్ జిల్లాలోని నాదపురం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే. 2014లో వయనాడ్ లోక్‌సభ స్థానంలో పోటీ చేసి ఓడిపోయారు. మొకేరి 1987 నుంచి 2001 వరకు కేరళ శాసనసభలో నాదాపురం నుంచి ప్రాతినిధ్యం వహించారు. 2015లో ఆయన సీపీఐ కేరళ రాష్ట్ర కమిటీకి సహాయ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. రైతు సంఘాలతో మొకేరికి మంచి అనుబంధం ఉంది. ఆయన సుదీర్ఘ అనుభవం, వ్యవసాయ సమస్యల పట్ల నిబద్ధత వయనాడ్ ఓటర్లకు ప్రతిధ్వనిస్తుందని ఎల్‌డీఎఫ్ భావిస్తోంది.

కేసుల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

(మొదటిపేజీ తరువాయి)

భూ సమస్యలు, అట్రాసిటీ కేసుల గురించి వివరించారు. భూ వివాదాలు, అట్రాసిటీ కేసుల పరిష్కారం ఎన్ని రోజుల్లో జరుగుతుందని కలెక్టర్, పోలీస్ అధికారులను చైర్మన్ ప్రశ్నించారు. ఎస్సీ ఎస్టీ కేసుల్లో ఎంతమంది బాధితులకు పరిహారం అందిందని జిల్లా సాంఘిక సంక్షేమ అధికారిని అడిగారు. ఇతర సంక్షేమ పథకాలు ఆయా వర్గాలకు అందుతున్నాయా లేదా అని సంబంధిత అధికారులను ప్రశ్నించారు. సమస్యలతో ఇబ్బంది పడుతున్న బాధితులకు కమిషన్ అండగా నిలుస్తుందన్నారు. ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీలు జిల్లాలో అధికంగా ఉన్నారని, వారి సమస్యలు, భూ తగాదాలు త్వరితగతిన పరిష్కరించడానికి అధికారులు తగిన చర్యలు చేపట్టాలని కోరారు. ప్రైవేటు సంస్థలలో కూడా ఎస్సీ ఎస్టీలకు ఉపాధి కల్పనలో రిజర్వేషన్ కల్పించాలని దీనికోసం కమిషనర్ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, రాష్ట్ర ఎస్టీ ఎస్సీ కమిటీ సభ్యులు రాంబాబు నాయక్, నారాయణ, ప్రవీణ్, ఆర్టీవోలు మధు, దామోదర్ రావు, షెడ్యూల్ తెగల అభివృద్ధి శాఖ అధికారి అనసూయ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ అసెంబ్లీ చీఫ్ విప్ ఆంజనేయులు

(మొదటిపేజీ తరువాయి)

నియమించింది. శాసనసభలో టీడీపీ నుంచి బెందాళం అశోక్, బొండా ఉమామహేశ్వరరావు, దాట్ల సుబ్బరాజు, దివ్య యనమల, వి.ఎం.థామస్, జగదీశ్వరి తోయక, కాలవ శ్రీనివాసులు, మాధవి రెడ్డప్పగారి, పీజీవీఆర్ నాయుడు, తంగిరాల సౌమ్య, యార్లగడ్డ వెంకట్రావు, ఆదినారాయణరెడ్డి (బీజేపీ), జనసేన నుంచి అరవ శ్రీధర్, బొలిశెట్టి శ్రీనివాస్, బొమ్మిడి నారాయణ నాయకర్, శాసన మండలిలో టీడీపీకి చెందిన వేపాడ చిరంజీవిరావు, కంచర్ల శ్రీకాంత్, జనసేన నుంచి పి.హరిప్రసాద్‌కు విప్ పదవులు లభించాయి.

జిరిబమ్‌లో ఉద్రిక్తత... ఆరుగురి గల్లంతు

(మొదటిపేజీ తరువాయి)

సమావేశంలో మాట్లాడుతూ ఆచూకీ లేని వారి గాలింపు చర్యలను భద్రతా బలగాలు చేపట్టినట్లు తెలిపారు. ఎన్‌కౌంటర్ ఉద్రిక్తతకు దారితీసిందని చెప్పారు. గల్లంతైన వారి కోసం అసోం రైఫిల్స్, బీఎస్ఎఫ్, కేంద్ర రిజర్వు భద్రతా దళం సంయుక్త అధ్వర్యంలో గాలింపులు కొనసాగుతున్నట్లు సీనియర్ పోలీసు అధికారి వెల్లడించారు. ఆపరేషన్ సమయంలో దాడి జరిగితే తగు విధంగా ప్రతిఘటిస్తామన్నారు. తొలుత జిరిబమ్‌కు చెందిన 13 మంది కనిపించడంలేదని సమాచారం అందిందని అధికారి చెప్పారు. వారిలో ఐదుగురి జాడ తెలిసిందని, ఇద్దరు చనిపోయారన్నారు. చనిపోయిన ఇద్దరు మయితే వర్గానికి చెందిన వృద్ధులని అన్నారు. ముష్కరులు నిప్పు పెట్టిన కట్టడంలో చిక్కుకొని వీరు ప్రాణాలు కోల్పోయినట్లు అధికారి తెలిపారు. మరో ఆరుగురి ఆచూకి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని ఆయనన్నారు.

విద్యార్థులకు సాంకేతికత అవశ్యం

(మొదటిపేజీ తరువాయి)

రంగాల్లో రాణించాలని సూచించారు. పాఠశాలలో కొటక్ మహీంద్ర వారి సహకారంతో రూ.25లక్షలతో త్వరలోనే ఆడిటోరియం నిర్మిస్తామని ప్రభాకర్ తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని అన్ని స్కూళ్లలో సైన్స్, కంప్యూటర్, రోబోటిక్ ల్యాబ్ లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ కొత్తగా ప్రారంభించిన ల్యాబ్ లను ఉపయోగించుకుని భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కలెక్టర్ మను చౌదరి చొరవతో పాఠశాలలో రోబోటిక్ ల్యాబ్‌ను సోహం అకాడమి, కంప్యూటర్ ల్యాబ్‌ను నిర్మాన్ సంస్థ, సైన్స్ ల్యాబ్‌ను ఇన్ఫినిటీ వైద్య ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత వెంకన్న, కౌన్సిలర్లు, ఆర్డీవో, ఎంఈవో, మున్సిపల్ కమిషనర్, ఎమ్మార్వో, నిర్మన్ సంస్థ ప్రతినిధి ఉషకర్, ఇన్ఫినిటీ వైద్య ఫౌండేషన్ ప్రతినిధి కృష్ణా రెడ్డి, సోహం అకాడమీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఇప్పటికైనా మాట నిలబెట్టుకో

(మొదటిపేజీ తరువాయి)

రైతుబంధు ఇవ్వాలని దేవుణ్ని కోరుకున్నానన్నారు. రేవంత్ రెడ్డికి భయం లేదు.. భక్తి లేదని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలు, 420 హామీలన్నారు కానీ అధికారంలోకి వచ్చాక మాట తప్పారని విమర్శించారు. రూ.2లక్షలకు పైగా రుణం ఉన్న వాళ్లు ఆ డబ్బు చెల్లిస్తేనే రుణమాఫీ చేస్తానన్న నిబంధన ఏమిటని ప్రశ్నించారు. 31 రకాల కారణాలు చెప్పి సగానికిపైగా రుణమాఫీ చేయలేదన్నారు. కేసీఆర్ గురించి మాట్లాడే నైతిక హక్కు రేవంత్ రెడ్డికి లేదని హరీశ్‌రావు అన్నారు. 'కేసీఆర్ లేకుంటే తెలంగాణ ఉద్యమం లేదు... ప్రత్యేక రాష్ట్రం లేదు... నువ్వు సీఎం అయ్యేవాడివి కాదు. మీ పాలనలో ప్రజలకు ఏం మేలు జరిగిందని కేసీఆర్ ప్రశ్నించారు. ఇందులో తప్పేముంది. 11 నెలల పాలనలో తెలంగాణ ప్రజలు ఏం కోల్పోయారో చెప్పడానికి నేను సిద్ధం.. వారేం పొందారో చెప్పడానికి నువ్వు సిద్ధమా అని రేవంత్ రెడ్డికి హరీశ్ రావు సవాలు విసిరారు. అప్పులు, రైతుల సమస్యలు, ఆస్పత్రులు, తాగు నీరు, సాగు నీరు, కరెంటు, విద్య, వైద్యం.. ఇలా అన్ని అంశాల్లో చర్చ చేసేందుకు సిద్ధమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో 36 మంది గురుకుల విద్యార్థులు చనిపోయారని హరీశ్‌రావు తెలిపారు. నిరుద్యోగ యువతను కొట్టారని, దళిత బంధు, రైతుబంధు వంటివి ప్రజలు కోల్పోయారని, గొర్రెలు, చేప పిల్లల పంపిణీ నిలిచిపోయిందని, ఉద్యోగాలు లేవని, ప్రభుత్వ ఉద్యోగులు డీఏ లేదని, జర్నలిస్టులు ప్రశ్నించే హక్కు కోల్పోయారని, తెలంగాణ ప్రజలు ప్రశాంతతను కోల్పోయారని హరీశ్‌రావు దుయ్యబట్టారు. ఇప్పటికైనా పగ, ప్రతీకారాలు మాని సీనియర్లు చెప్పేది వినాలని రేవంత్‌కు హితవు పలికారు. రాష్ట్రం మీద, పరిపాలన మీద దృష్టి పెట్టాలని సూచించారు. రైతులందరికీ రుణమాఫీ, రైతుబంధు ఇచ్చి మాట నిలబెట్టుకోవాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

పథకం ప్రకారమే కలెక్టర్‌పై దాడి

(మొదటిపేజీ తరువాయి)

సంఘటనలు జరిగితే ఉరుకోబోమని హెచ్చరించారు. రాజకీయ ఇబ్బందులను అధిగమించడానికే కేటీఆర్ ఢిల్లీ టూర్ చేస్తున్నారన్నారు. బట్ట కాల్చి మీద వేసే పనిలో బీఆర్ఎస్ నాయకత్వం ఉందని, ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు కాకముందే కేటీఆర్, హరీష్ రావు విమర్శలు చేస్తునే ఉన్నారని మంత్రి శ్రీధర్‌బాబు మండిపడ్డారు. మహారాష్ట్ర, జార్ఖండ్ లో కాంగ్రెస్ గెలవబోతోందని జోస్యం చెప్పారు. బీజేపీ, బీఆర్ఎస్ నేతలు కూడబలుక్కుని పొద్దు నొకరు, సాయంత్రం ఒకరు మాట్లాడుతున్నారని... కాంగ్రెస్ పైన పోరాటం కోసం బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటయ్యాయన్నారు. మహారాష్ట్ర లో తమ కార్యక్రమాలు చెప్పుకోలేక బీజేపీ నేతలు తెలంగాణ పై విమర్శలు చేస్తు ఓట్లు అడుగుతున్నారని మండిపడ్డారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు.

ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల లైసన్ సెల్ ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : సింగరేణిలో పనిచేసే ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కొత్తగూడెంలోని ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక లైసన్ సెల్ ఆఫీస్ ప్రారంభించారు. రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బిక్కి వెంకటయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని ఇక్కడ ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని మంగళవారం ఆవిష్కరించి ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థలో పని చేసే ఎస్సీ, ఎస్టీ ఉదోగస్తుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు వీలుగా ప్రధాన కార్యాలయంలో ఈ లైసన్ సెల్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గత నెలలో సింగరేణి భవన్‌లో యూనియన్ నాయకుల సమావేశం సంస్థ ఎన్.బలరామ్ తో ఈ సెల్ గురించి మాట్లాడటం జరిగిందన్నారు. స్పందించిన ఆయన ఇంత త్వరగా కార్యాలయ ఆఫీస్ కేటాయించి అన్ని ఏర్పాట్లు చేపించారని కృతజ్ఞతలు చెప్పారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న డైరక్టర్ పా జి.వేంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ సింగరేణి సంస్థ ఎస్సీ, ఎస్టీ ఉదోగస్తుల చిరకాల కోరికైన లైసన్ సెల్ ఈరోజు ఏర్పాటు చేసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర కమిషన్ సభ్యులు కే.నీలా దేవి, రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మీనారాయణ, శంకర్, రేణికుంట్ల ప్రవీణ్, జీఎం ఐఆర్ అండ్ పిఎం కవితా నాయుడు, ఎస్సీ చీఫ్ లైసన్ ఆఫీసర్ దుర్గం రామ్ చందర్, ఓఎస్‌డి జీఎం ఎస్టీ చీఫ్ లైసన్ ఆఫీసర్ వీసం కృష్ణయ్య, ఉద్యోగస్తుల వెల్ఫేర్ సంఘం ప్రెసిడెంట్ డాక్టర్ రాజేశ్వర్, జనరల్ సెక్రటరీ అంతోటి నాగేశ్వర రావు, సంఘం ప్రెసిడెంట్ ఏ. భాస్కర్ రావు, జనరల్ సెక్రటరీ నాగేశ్వర రావు, టి.లక్ష్మీ పతి గౌడ్, డిజిఎం అజయ్ కుమార్, గుర్తింపు సంఘం ఏఐటీయూసి బ్రాంచ్ సెక్రటరీ రమణ మూర్తి, ఐఎన్‌టీయూసి జనరల్ సెక్రటరీ త్యాగరాజన్ యూనియన్ నాయకులు, అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆత్మహత్యలపై విచారణ జరిపించాలి

ఏఐఎస్ఎఫ్ డిమాండ్

విశాలాంధ్ర - ఖమ్మం : బాసర ట్రిపుల్ ఐటిలో విద్యార్థుల వరుస ఆత్మహత్యలపై సమగ్రమైన విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరం నుండి బాసర ట్రిపుల్ ఐటిలో విద్యార్థులు వరుసగా ఆత్మహత్యలు చేసుకుని చనిపోతున్నారు. ఈ సమస్యలను ప్రభుత్వం పరిష్కారం చేయకుండా, పూర్తిస్థాయి వైస్ ఛాన్సలర్ ని నియమించకుండా ద్వంద వైఖరిని అవలంబిస్తుందని ఆరోపించారు. నాణ్యమైన భోజనం అందించకుండా, కాంట్రాక్టర్లు ఏది ఇస్తే అదే తినేలాగా, చదువులలోనూ వసతులు కల్పించకుండా, నిధులు ఇస్తామని చెప్పి ఇవ్వకుండా విద్యార్థులు ఆందోళన బాట పట్టిన ప్రభుత్వాలు స్పందించడం లేదన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న సందర్భంలో విద్యార్థులు ఆందోళన దగ్గరకు గోడ దూకి మరి లోపలికి వెళ్ళి మేం అధికారంలోకి వస్తే సమస్యలు పరిష్కారం చేస్తామని చెప్పారు. కానీ ఇప్పటి వరకు ఈ సమస్యలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం పరిష్కారం చేయలేదని పేర్కొన్నారు. తక్షణమే రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేసి, నిధులు ఇచ్చి బాసర ట్రిపుల్ ఐటిని అభివృద్ధి చేయాలని ఏఐఎస్ఎఫ్ కోరుతుంది. ఆర్మూర్ విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని, వారి కుటుంబానికి న్యాయం చేసి బాసర ట్రిపుల్ ఐటీలో పూర్తిస్థాయి వైస్ ఛాన్సలర్‌ను నియమించి, తక్షణమే సమస్యలు పరిష్కారం చేయాలని. ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేస్తుంది అన్నారు.

అధికారులపై దాడి అమానుషం

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : వికారాబాద్ జిల్లాలో సోమవారం జిల్లా కలెక్టర్, అధికారులపై కొంతమంది వ్యక్తులు దాడి చేయడం అమానుషమని, దాడి చేసిన వారిని గుర్తించి, కఠినంగా శిక్షించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సి.హెచ్. మహేందర్ జి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు భూములను సేకరించడానికి రైతుల అభిప్రాయాలను తెలుసుకోవడం కోసం కలెక్టర్, మరికొందరు అధికారులు వెళ్లిన క్రమంలో, కొంతమంది వ్యక్తులు ముందుగానే వేసుకున్న ప్లాన్ ప్రకారం దాడి చేయడం హేయమైన చర్య అని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. దాడిని ఖండిస్తూ జిల్లాలోని రెవెన్యూ సిబ్బంది మంగళవారం నల్ల బ్యాడ్జిలను ధరించి నిరసన తెలుపుతూ విధులు నిర్వహించడం జరిగిందని, అధికారులపై అరాచకారంగా ఎక్కడ దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. అధికారులపై దాడి చేయడమే కాకుండా వాహనాలను ధ్వంసం చేయడం బాధాకరమని, ఏకంగా కలెక్టర్ పైన దాడి చేయడం తాను ఎన్నడూ చూడలేదని మహేందర్ జి ఆవేదన వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే కృషితో అందుబాటులోకి రానున్న పబ్లిక్ టాయిలెట్స్

విశాలాంధ్ర - కారేపల్లి : మండల కేంద్రమైన కారేపల్లి బస్టాండ్ సెంటర్లలో ఇటీవల మాదారం డోలమైట్ సిఎస్ నిధులతో నిర్మించిన పబ్లిక్ టాయిలెట్లను ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు స్థానిక మండల అధికారులతో కలిసి డోలమైట్ అధికారులు మంగళవారం పరిశీలించారు. గత వారంలో సింగరేణి గ్రామంలో పర్యటించిన వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ దృష్టికి బస్టాండ్ సెంటర్లో మాదారం స్టీల్ ప్లాంట్ వారిచే నిర్మించబడిన పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణ పనుల గురించి స్థానిక కాంగ్రెస్ నాయకుడు మేదరి టోనీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఎమ్మెల్యే అధికారులకు ఆదేశాలిచ్చారు. స్పందించిన అధికారులు పెండింగ్లో ఉన్న పనులన్నీ పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో తలారి చంద్రప్రకాష్, మేదరి టోనీ, ఎండి హనీఫ్, షేక్ షఫీ, బిజెపి నేత తురక నారాయణ, ఎంపీడీవో సురేందర్, డోలమైట్ అధికారులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి సన్నాహాలు

విశాలాంధ్ర - ఖమ్మం అర్బన్ : ఖమ్మం జిల్లా ఎస్ఎఫ్ఐ విద్యార్థి ఉద్యమంలో గతంలో పనిచేసిన నాయకులు, సభ్యులు, సానుభూతిపరులతో నవంబర్ 24 వ తేదీన ఆత్మీయ సమ్మేళనం నిర్వహించేందుకు సన్నాహక కమిటీ సమావేశమైంది. సన్నాహక సమావేశం ఖమ్మం నగరంలో మంగళవారం సాయంత్రం గొరిల్లా పార్క్ లో జరిగింది. దీనికి అనేక మంది ప్రముఖులు హాజరై ఆత్మీయ సమ్మేళనానికి తమ వంతుగా తగు సలహాలు, సూచనలు, సహాయ సహకారాలను అందిస్తామని తెలిపారు. దాదాపు ఐదున్నర దశాబ్దాల ప్రస్థానంలో ఎస్ఎఫ్ఐ విద్యార్థి ఉద్యమం ఆణిముత్యాల్లాంటి ఎందరినో మన పౌర సమాజానికి అందించింది. ఎందరో కవులు, రచయితలు, మేధావులు, ఉద్యోగస్తులు, వ్యాపారస్తులు, వివిధ వృత్తులలో నిష్ణాతులుగా ఉన్నతమైన స్థానాలను పొందారని నాయకులు పేర్కొన్నారు. విద్యార్థి ఉద్యమ స్ఫూర్తితో అనేకమంది ప్రజా ఉద్యమాల్లో ఇప్పటివరకు కొనసాగుతున్నారని వారు అన్నారు. ఖమ్మం జిల్లా ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల వేదిక ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. ఈ సన్నాహక సమావేశానికి వెల్లంపల్లి శ్రీనివాస రావు అధ్యక్షత వహించారు. ఎస్ ఎఫ్ ఐ పూర్వ నాయకులు ధూళిపాళ నాగేశ్వర రావు, కళ్యాణం వేంకటేశ్వర రావు, ఖయ్యూం, బోడపట్ల రవి, ఎల్వీ రావు, బయ్యా రాజేశ్వర రావు, ప్రదీప్, అంకిత రవి, విప్లవ కుమార్, కర్నాటి కృష్ణ, రాము, నరేంద్ర, వంజాకు లక్ష్మీ నారాయణ, చింతల రమేష్, తుడుం ప్రవీణ్, జావేద్ తదితరులు పాల్గొన్నారు

రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - ఖమ్మం : రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవని, పత్తి పంటకు మద్దతు ధర కంటే తక్కువ చెల్లించే చర్యలను సహించేది లేదని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ యార్డును ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా పత్తిని రైతుల వద్ద నుండి మద్దతు ధర కంటే తక్కువగా చెల్లించి కొనుగోలు చేసినట్లు తెలిసి సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి పంటకు లభిస్తున్న ధర మొదలగు వివరాలను కలెక్టర్ రైతుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మార్కెట్ లో పత్తి పంట తేమ శాతం పరిశీలించకుండా కొనుగోలు చేయరాదని, ఇది నిబంధనలకు విరుద్ధమని తెలిపారు. పత్తి పంట తేమ శాతం పరిశీలించి 12 శాతం వరకు ఉంటే మద్దతు ధర చెల్లించాలని తెలిపారు. తేమ శాతం పరిశీలించకుండా రైతుల వద్ద నుంచి తక్కువ ధరకు పత్తి పంట కొనుగోలు చేయడం దారుణమని, దీనిని అరికట్టేందుకు మార్కెటింగ్ శాఖ అప్రమత్తంగా ఉండాలని, మద్దతు ధర కంటే తక్కువకు పంట కొనుగోలు చేసేందుకు వీలులేదని కలెక్టర్ స్పష్టం చేశారు. నిబంధనలను పరిశీలించకుండా రైతులను మోసం చేస్తూ కొనుగోలు చేయడాన్ని కలెక్టర్ తీవ్రంగా తప్పుపట్టారు. రైతులను మోసం చేస్తూ తక్కువ ధరకు పంట కొనుగోలు చేసిన ప్రైవేట్ వ్యాపారులకు నోటీసులు జారీ చేయాలని, తేమ శాతం ప్రకారం రైతులకు ధర చెల్లించని పక్షంలో లైసెన్స్ రద్దు చేయాలని కలెక్టర్ మార్కెటింగ్ అధికారిని ఆదేశించారు. మార్కెట్ యార్డులో అవసరమైతే అదనంగా పది మంది సిబ్బందిని తేమ శాతం పరిశీలనకు విధులలో చేర్చుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ ఆకస్మిక తనిఖీలో జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.ఏ. అలీం, మార్కెట్ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు పండించిన ప్రతి గింజా కొంటాం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - పినపాక : ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వం రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండలంలోని భూపాలపట్నం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతన్నలకు మద్దతు ధరను ప్రకటిస్తూ క్వింటాకు రూ. 500 బోనస్ ఇస్తుందన్నారు. గిట్టుబాటు ధర వచ్చేలా రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలన్నారు.ఏ గ్రేడ్ తేమశాతం వచ్చేలా చూసుకొవాలని సూచించారు. రైతులు దళారులను నమ్మకుండా నేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలని కోరారు. క్వింటాలుకు ఏ గ్రేడ్ ధాన్యం రూ. 2320, సాధారణ ధాన్యం రూ.2300 రేటును నిర్ణయించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు రామనాథం, జిల్లా అదనపు వ్యవసాయ అధికారి తాతారావు, తహసీల్దార్ అద్దంకి నరేష్, ఎంపీడీఓ రామకృష్ణ, ఎంపీవో వెంకటేశ్వర్లు, ఐకేపీ ఏపీవో జ్యోతి, కాంగ్రెస్ నాయకులు కంది సుబ్బారెడ్డి, గంగిరెడ్డి వెంకట్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కలెక్టర్‌పై దాడికి తహసీల్దార్ ఖండన

విశాలాంధ్ర - పినపాక : వికారాబాద్ జిల్లా దుద్యాల మండలంలోని లగచర్ల గ్రామంలో ఔషద పరిశ్రమల ఏర్పాటుకు స్థలసేకరణ నిమిత్తం వెళ్ళిన ఆ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పై ఉద్దేశ్య పూర్వకంగా గ్రామస్తుల్లో కొందరు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తహసిల్దార్ అద్దంకి నరేష్ చెప్పారు. కలెక్టర్ స్థాయి అధికారులకి రక్షణ లేకుంటే తాము ఎలా పని చేయాలని ఆవేదన వ్యక్తం చేసారు. కలెక్టర్ పై జరిగిన దాడికి నిరసనగా మంగళవారం పినపాక తహశీల్దార్ కార్యాలయం అధికారులు, సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. దోషులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. విధుల్లో కూడా నల్ల బ్యాడ్జీలతోనే పాల్గొన్నారు. ఈ నిరసనలో తహశీల్దార్ అద్దంకి నరేష్, డిప్యూటీ తహశీల్దార్ సమ్మయ్య, రెవిన్యూ ఇన్స్పెక్టర్ రమేష్, సీనియర్ అసిస్టెంట్ రమేష్, సర్వేయర్ నరేష్, సురేష్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వికారాబాద్ ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర బ్యూరో - పెద్దపల్లి: రెవెన్యూ సిబ్బందికి ఆత్మస్థైర్యాన్ని కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవా లని ట్రెస్సా జిల్లా అధ్యక్షులు డి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా రెవెన్యూ సిబ్బంది వికారాబాద్ జిల్లాలో రెవెన్యూ సిబ్బంది, కలెక్టర్‌పై జరిగిన దాడికి నిరసనగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డి వేణు రెవెన్యూ సిబ్బంది నిరసన కార్యక్రమంలో పాల్గొని వారికి సంఘీభావం ప్రకటించారు.ట్రెస్సా జిల్లా అధ్యక్షులు డి.శ్రీనివాస్ మాట్లాడుతూ వికారాబాద్ ఘటన చాలా దురదృష్టకరమని అధికారులపై దాడులు చేయడం, ప్రజలకు రెవెన్యూ సిబ్బంది అనేక రకాలుగా అందించే సేవలను విస్మరిస్తూ, పూర్తి అవగాహన రాహిత్యంతో భౌతిక దాడులు దిగడం దుర్మార్గమని అన్నారు. ల్లా కలెక్టర్ రెవెన్యూ అధికారులపై దాడులు చేసిన వారిని గుర్తించి వెంటనే అరెస్ట్ చేయాలని, వారిపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్ష పడేలా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో భూసేకరణ కోసం వెళ్లే రెవెన్యూ సిబ్బందికి భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. అనంతరం ట్రెస్సా జిల్లా కమిటీ తరపున రెవెన్యూ సిబ్బంది డిమాండ్లను వివరిస్తూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. జగిత్యాల ట్రెస్సా అధ్యక్షులు వకీల్, పెద్దపల్లి జనరల్ సెక్రెటరీ మహేష్, పెద్ద ఎత్తున రెవెన్యూ సిబ్బంది సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి : సీపీఐ



విశాలాంధ్ర - వనపర్తి : జిల్లాలో ధాన్యం కొనుగోలు నత్త నడకన సాగుతున్నాయని వేగం పెంచాలని సిపిఐ పట్టణ కార్యదర్శి జె.రమేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏఐటీయుసి జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ ఆఫీసులో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో సన్న దొడ్డు రకం కొనుగోలుకు 319 కేంద్రాలను తెరవాలని జిల్లా అధికారులు నిర్ణయించారన్నారు. నవంబర్ 11వ తేదీ వరకు 235 కొనుగోలు కేంద్రాలను తెరిచారని ఇంకా 84 కేంద్రాలు తెరవాల్సి ఉందన్నారు. 235 కేంద్రాలను తెరిచినప్పటికీ కేవలం ఎనిమిది కేంద్రాల్లో మాత్రమే ధాన్యం కొనుగోళ్ళు ప్రారంభించటం, నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు. ఖాళీ సంచులు, టార్పలిండ్లు, పాడీ క్లీనర్లు, సన్నవడ్లు గుర్తించే మిషన్లు, కేంద్రాలకు రాలేదని రైతులు చెబుతున్నారన్నారు. గ్రామాల్లో ఆరబెట్టినందుకు రైతులకు కల్లాలు లేక రోడ్లపై ఆరబోస్తే కేసులు పెడుతున్నారని, కేంద్రాల్లో ఆరబెడదామంటే స్థలాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తేమ శాతం పేరుతో కేంద్రాల్లో ధాన్యం కొనకపోవటంతో రైతులు సన్నధాన్యానికి ప్రభుత్వం క్వింటాల్కు రూ.2320, ధర 500 బోనస్ ఇస్తామని చెప్పినప్పటికీ రూ.2100, 2200 లకే మిల్లర్లకు అమ్ముకొని నష్టపోతున్నారన్నారు. ధాన్యం పూర్తిస్థాయిలో కొనుగోలు చేయని పక్షంలో కొనుగోలు కేంద్రాల వద్ద రైతులను సమీకరించి ధర్నాలు, రాస్తారోకోలు చేస్తామని హెచ్చరించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు కళావతమ్మ, గోపాలకృష్ణ, జయమ్మ, చిన్న కుర్మయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలి

విశాలాంధ్ర - కారేపల్లి : ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని వెంటనే అమలు చేయాలని అమలు చేయని పక్షంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ప్రజా పోరాటాలు చేస్తామని వైరా డివిజన్ సిపిఐ కార్యదర్శి ఎర్రబాబు, మహిళా సంఘం రాష్ట్ర నాయకురాలు ఏపూరి లతాదేవి అన్నారు. మంగళవారం కారేపల్లి మండల పరిధిలోని విశ్వనాథపల్లి గ్రామపంచాయతీలో సిపిఐ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఐ పార్టీ ప్రజల పక్షాన నిలబడి పోరాటాలు చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.సీఎం రేవంత్ రెడ్డి సారధ్యంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేసి ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు. జిల్లావ్యాప్తంగా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు వడ్డే వెంకటయ్య, పుచ్చకాయల శ్రీనివాసరావు, ఎస్.కె రంజాన్, బొచ్చు ధనమ్మ, బొమ్మల కృష్ణ, కిన్నెర ముత్తమ్మ పురం వెంకన్న పాల్గొన్నారు.

సమాజంలో స్త్రీకి సమాన హక్కులు ఉండాలి

విశాలాంధ్ర - జిల్లా బ్యూరో మహబూబాబాద్ : ప్రకృతిలో మానవ సమాజంలో స్త్రీ సగభాగం కనుక ఆమెకు సమాజంలో సగభాగం హక్కులు బాధ్యతలు పురుషునితో సమానంగా ఉండాలని మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి అన్నారు. మంగళవారం జిల్లాలోని కొరివి మండలంలోని పార్టీ కార్యాలయములో పద్మ అధ్యక్షతన సమావేశములో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ఏపూరి లతదేవితో కలిసి వారు మాట్లాడుతూ మాతృస్వామ్య వ్యవస్థ నిర్మాణం కొరకు, స్త్రీ విముక్తి పోరాటాలు విజయవంతం కావాలని, అందుకు మహిళ క్రియాశీల పోరాటాలలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. స్త్రీలను లక్షాధికారి చేస్తానని చెప్తున్న పాలకులు ముందుగా మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేస్తూ, మహిళా సాధికారికత వైపు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మామిండ్ల సాంబ లక్ష్మి, కొరివి మండల కార్యదర్శి కరణం రాజన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ ఫాతిమా, యకమ్మ, పద్మ, లక్ష్మి, రాణి, మాలి, హలిమ మాధవి, భాగ్యమ్మ, రాజన్న, ఉపేంద్ర, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల వాహనాలపై దాడికి నిరసనగా

నల్ల బ్యాడ్జిలతో విధులకు హాజరు

విశాలాంధ్ర - నేరేడుచర్ల : నేరేడుచర్ల తాసిల్దార్ కార్యాలయంలో మంగళవారం తహసిల్దార్ సైదులు గౌడ్, సిబ్బంది ఫార్మా విలేజ్ భూసేకరణపై చర్చించేందుకు వెళ్లిన కలెక్టర్ అధికారుల వాహనాలపై రాళ్లతో కర్రలతో దాడి చేసి కాడ ప్రత్యేక అధికారి వెంకటరెడ్డిని తీవ్రంగా గాయపరిచినందుకు నిరసనగా నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అనంతరం తహసిల్దార్ సైదులు గౌడ్ మాట్లాడుతూ దాడికి పాల్పడ్డ వారిపై చట్టపరంగా కఠిన చర్యలు చేపట్టాలన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ మౌనిక సీనియర్ అసిస్టెంట్ చంద్రమ్మ ఆర్ఐ చిలక రాజు నరసయ్య జూనియర్ అసిస్టెంట్ అబ్బాస్, సిబ్బంది పాల్గొన్నారు.

మెర్క్యురీ ఈవీ టెక్ ఈక్విటీ షేర్ వారెంట్ కేటాయింపు

విశాలాంధ్ర - హైదరాబాద్: మెర్క్యురీ ఈవీ టెక్ లిమిటెడ్, కంపెనీ వాటాదారుల ఆమోదం మేరకు, 1 కేటాయింపును ఆమోదించినట్లు సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. హైటెక్‌లో మెర్క్యురీ 70 శాతం వాటాను కొనుగోలు చేయడం పశ్చిమ బెంగాల్‌లోని 3 వీలర్ (త్రీ-వీలర్) మార్కెట్‌లో దాని స్థానాన్ని బలోపేతం చేయడానికి ఒక వ్యూహాత్మక చర్య అన్నారు. ఈ ప్రాంతం పెరుగుతున్న డిమాండ్ స్కేల్‌కు సంభావ్యతకు ప్రసిద్ధి చెందిందన్నారు. ఇది ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచి ఖర్చులను తగ్గిస్తుందన్నారు. మెజారిటీ వాటాను కొనుగోలు చేయడం ద్వారా, మెర్క్యురీ హైటెక్ ప్రస్తుత కార్యకలాపాలు, పంపిణీ నెట్‌వర్క్‌లు కస్టమర్ బేస్‌లను ప్రభావితం చేయగలదన్నారు. ఇది మార్కెట్ వాటాను పెంచడానికి, మెరుగైన లాభదాయకతకు దారి తీస్తుందన్నారు. ఇటీవల, కంపెనీ బీ ఎస్ ఈ స్మాల్‌క్యాప్ ఇండెక్స్‌లో చేర్చబడిందన్నారు. ఈ మైలురాయి పరిశ్రమలో వృద్ధి ఆవిష్కరణలకు కంపెనీ నిరంతర నిబద్ధతను ప్రతిబింబిస్తుందన్నారు.

మరో రెండు నూతన శాఖలను ప్రారంభించిన కేవీబీ

హైదరాబాద్: కరూర్ వైశ్యా బ్యాంక్ (కేవీబీ) తన 850వ శాఖను చెన్నైలో ప్రారంభించినట్లు ప్రకటించింది. అదేవిధంగా మరో 5 కొత్త శాఖలను ప్రారంభించిందని, తద్వారా కేవీబీ కరూర్ వైశ్యా బ్యాంక్ తన మొత్తం బ్రాంచ్ నెట్‌వర్క్‌ను 854కి చేరుకోవడంలో ముఖ్యమైన మైలురాయిని చేరుకుందని ఆ బ్యాంకు డైరెక్టర్ రమేష్ కుమార్ చెప్పారు. బ్యాంక్ తన 2 కొత్త శాఖలను ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభించిందని, నెల్లూరులో విజయవాడలో అందుబాటులోకి తీసుకువచ్చింది అన్నారు. వీటితో ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో మొత్తం శాఖల సంఖ్య 205కి పెరిగిందన్నారు. 1916లో స్థాపించబడిన కరూర్ వైశ్యా బ్యాంక్ ఇప్పుడు లక్షలాది మంది వినియోగదారులకు సమగ్రమైన ఆర్థిక సేవలను అందిస్తోందని, 56 శాతం శాఖలు గ్రామీణ, సెమీ-అర్బన్ ప్రాంతాలలో ఉన్నందున, భారతదేశం అంతటా ఆర్థిక చేరికను ప్రోత్సహించడంలో దాని బలమైన నిబద్ధతను ప్రదర్శిస్తుందని చెప్పారు. సెప్టెంబర్ 30, 2024 నాటికి, కరూర్ వైశ్యా బ్యాంక్ మొత్తం వ్యాపారం రూ.1,76,138 కోట్లకు చేరుకుందని, ఇందులో రూ.95,839 కోట్ల డిపాజిట్లు, రూ. 80,299 కోట్ల అడ్వాన్స్‌లు ఉన్నాయన్నారు.

అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీలో పీజీ, యూజీ కోర్సుల భర్తీకి దరఖాస్తులు

బెంగళూరు-భోపాల్: అజీమ్ ప్రేమ్జీ యూనివర్సిటీ రెండేళ్ల పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్స్ - ఎంఏ ఎడ్యుకేషన్, ఎంఏ డెవలప్మెంట్, మాస్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ (ఎంపీహెచ్), ఎంఏ ఎకనామిక్స్, ఎంఏ ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్, నాలుగేళ్ల ఫుల్‌టైమ్ రెసిడెన్షియల్ అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్స్- బీఏ ఆనర్స్, బీఎస్సీ ఆనర్స్ భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. విశ్వవిద్యాలయం బెంగళూరు, భోపాల్ క్యాంపస్‌లలో ఈ ప్రోగ్రామ్‌లు అందించబడతాయి. విద్యార్థులలో నైపుణ్యం, సామాజిక నిబద్ధతను పెంపొందించే కఠినమైన విద్యను అందించడం, అర్థవంతమైన కెరీర్ అవకాశాలు, ఉన్నత విద్యా మార్గాలకు దారితీస్తుంది. విద్యార్థులు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. డిసెంబర్ 2024లో నేషనల్ ఎంట్రన్స్ టెస్ట్‌పై ఆసక్తి ఉన్నవారికి, నవంబర్ 14, 2024లోపు దరఖాస్తులు చెల్లించాల్సి ఉంటుంది. విశ్వవిద్యాలయం సమ్మిళిత మరియు వైవిధ్యమైన విద్యార్థి సంఘాన్ని నిర్మించడానికి కట్టుబడి ఉంది. ట్యూషన్ ఫీజులు, వసతి ఖర్చులను కవర్ చేస్తూ అవసర ఆధారిత ఆర్థిక సహాయాన్ని (పూర్తి మరియు పాక్షికంగా) అందిస్తుంది.

గ్లోబల్‌లాజిక్ నూతన హైదరాబాద్ డెలివరీ సెంటర్ ప్రారంభం

హైదరాబాద్: హిటాచీ గ్రూప్ కంపెనీ, డిజిటల్ ఇంజనీరింగ్‌లో అగ్రగామిగా ఉన్న గ్లోబల్‌లాజిక్ తాజాగా హైదరాబాద్‌లో తమ నూతన డెలివరీ సెంటర్‌ను ప్రారంభించినట్లు వెల్లడించింది. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో కంపెనీ వృద్ధి, విస్తరణ వ్యూహంలో భాగంగా, ఈ కేంద్రం గత 9 నెలల్లో 4వ కేంద్ర ప్రారంభాన్ని సూచిస్తుంది. కంటెంట్ ఇంజనీరింగ్ వ్యాపారంపై నిరంతర దృష్టిని కొనసాగిస్తూనే, టెక్నాలజీ, హెల్త్‌కేర్, ఆటోమోటివ్, బ్యాంకింగ్, ప్రొఫెషనల్ సర్వీసెస్, మరిన్నింటితో సహా పలు రంగాల వ్యాప్తంగా అధునాతన డిజిటల్ ఇంజనీరింగ్ పరిష్కారాలను అందించడానికి, కంపెనీ ప్రధాన ఇంజనీరింగ్ సామర్థ్యాలను మెరుగుపరచడానికి ఈ విస్తరణ చేయబడింది. తెలంగాణ రాష్ట్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, పరిశ్రమలు, వాణిజ్యం, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు చేతుల మీదుగా కొత్త కార్యాలయ ప్రారంభోత్సవం జరిగింది.

14 శాతం వృద్ధి సాధించిన లెక్సస్ ఇండియా

బెంగళూరు: లెక్సస్ ఇండియాకు ఈ పండుగ సీజన్ కలిసొచ్చింది. గతేడాది అక్టోబర్‌తో పోలిస్తే, 2024 అక్టోబర్ నెలలో అమ్మకాలలో 43% వృద్ధిని నమోదు చేసింది. లెక్సస్ లగ్జరీ లైనప్‌లో అధిక డిమాండ్, బలమైన కస్టమర్ ఎంగేజ్‌మెంట్ ఉండడం, అలాగే పండుగ సీజన్ కూడా కలిసి రావడంతో అమ్మకాలు ఊపందుకున్నాయి. అంతేకాకుండా, గతేడాదిలో ఇదే సమయంతో పోలిస్తే అక్టోబర్ 2024 వరకు ఈ ఏడాదిలో 14% వృద్ధిని నమోదు చేసింది లెక్సస్ ఇండియా. ఇక అమ్మకాల విషయానికి వస్తే.. లెక్సస్ ఈఎస్ మోడల్ ఈ పండుగ సీజన్‌లో కూడా అద్భుతమైన అమ్మకాలను చవిచూసింది. అక్టోబర్ 2024లో లెక్సస్ ఇండియా మొత్తం అమ్మకాలలో 58% అమ్మకాలు ఈ కారు నుంచే వచ్చాయి. మోడల్ విలాసవంతమైన డిజైన్, నైపుణ్యం భారతీయ వినియోగదారులకు ఎంతగానో నచ్చింది. అన్నింటికి మించి డెలివరీ చేయడానికి అన్ని విధాల అద్భుతంగా ఉన్న 'మేడ్ ఇన్ ఇండియా' ఉత్పత్తి ఇది. లెక్సస్ ఇండియా ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ తన్మయ్ భట్టాచార్య మాట్లాడుతూ, ఈ పండుగ సీజన్‌లో తమకు అద్భుతమైన స్పందన వచ్చిందని తెలిపారు.

హృదయం ఆకారంలో అల్పిన్ లిబే జస్ట్ జెల్లీ విడుదల

ముంబయి: అల్పిన్ లిబే జస్ట్ జెల్లీ పర్ఫెట్టి వాన్ మెల్లీ సంస్థ నుండి దిగ్గజపు బ్రాండ్ అల్పిన్ లిబే జస్ట్ జెల్లీ, భారతదేశపు మొదటి హృదయం ఆకారపు, డ్యూయల్-లేయర్ జెల్లీని పరిచయం చేసింది. అందుబాటులో ఉండే విధంగా కేవలం రూ.2కి ఒక విలక్షణమైన అనుభూతి ప్రయాణాన్ని అందించడానికి అందచేయబడింది. ఈ వినూత్నమైన జెల్లీ రెండు విలక్షణమైన లేయర్స్‌ను కలిగి ఉంది- మృదువైన-ఫోమీ (నురగ) పొర, జెల్లీ పొర, ఇది మృదువైన, నమిలే అనుభవానికి దారితీస్తుంది. మొత్తం వినియోగ అనుభవాన్ని మెరుగుపరిచే ఆనందకరమైన కలయికను సృష్టిస్తుంది. అల్పిన్ లిబే జస్ట్ జెల్లీ జెల్లీ శ్రేణిలో వినూత్నతను కొనసాగిస్తోంది. మెరుగుపరచబడిన మిఠాయి అనుభవం కోసం ప్రతి బైట్‌లో వినోదం, రుచి, ఆకృతి ఆనందకరమైన మిశ్రమాన్ని అందిస్తోందని పర్ఫెట్టి వాన్ మిల్లే ఇండియా చీఫ్ మార్కెటింగ్ అధికారి గుంజన్ ఖేతన్ తెలిపారు.

కామిక్ కాన్ ఇండియాతో యమహా భాగస్వామ్యం

ముంబయి: ఇండియా యమహా మోటార్ ప్రైవేట్ లిమిటెడ్ దేశంలోనే అతిపెద్ద పాప్ కల్చర్ ఈవెంట్ అయిన కామిక్ కాన్ ఇండియాతో భాగస్వామ్యాన్ని ప్రకటించినందుకు ఆనందంగా ఉంది. ఈ మొట్టమొదటి భాగస్వామ్యం దేశవ్యాప్తంగా ఉన్న హాస్య ప్రియులు, అనిమే అభిమానులు, మోటార్‌సైకిల్ అభిమానులను ఆకర్షించడం లక్ష్యంగా పెట్టుకుంది. జెన్ జెడ్ యువ ప్రేక్షకులకు బ్రాండ్‌తో కనెక్ట్ అవ్వడానికి అసోసియేషన్ విభిన్న అవకాశాలను సృష్టించడం దిశగా పనిచేస్తుంది. యమహా యువత, పట్టణ జనాభాతో పరస్పర చర్చకు కొత్త మార్గాలను అన్వేషించడంపై దృష్టి సారిస్తున్నందున, ఈ భాగస్వామ్యం దాని మార్కెట్టును విస్తరించడానికి, సముచిత ప్రేక్షకులను ఆకర్షించడానికి ఒక అద్భుతమైన అవకాశంగా ఉపయోగపడుతుంది. నవంబర్ 15 నుండి 17, 2024 వరకు హైదరాబాద్‌లో ఈ ఏడాది ఎడిషన్‌ను ప్రారంభించి కామిక్ కాన్ ఇండియా దేశవ్యాప్తంగా అనేక ప్రముఖ నగరాల్లో జరగనుంది.

ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ ఫస్ట్ వింగ్స్ స్టార్ట్-అప్ లాంజ్ ప్రారంభం

హైదరాబాద్: ఐడిఎఫ్సి ఫస్ట్ బ్యాంక్ మంగళవారం స్టార్టప్ లాంజ్‌ను ప్రారంభించినట్లు ప్రకటించింది, ఇది భారతదేశంలో వ్యవస్థాపకులకు మద్దతు ఇవ్వడానికి మరియు ప్రారంభ-దశ స్టార్టప్‌లకు సాధికారత కల్పించడానికి రూపొందించబడిన ప్రత్యేక ప్రాంగణం. బెంగుళూరులోని కోరమంగళలో ఉన్న ఈ వినూత్న ప్రాంగణం, తమ వ్యాపారాలను విస్తరింప చేయాలనుకునే వ్యవస్థాపకులకు అవసరమైన వనరులు, మార్గదర్శకత్వం, నెట్‌వర్కింగ్ అవకాశాలను అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. హెడ్ స్టార్టప్ బ్యాంకింగ్ భవేష్ జటానియా మాట్లాడుతూ, భారతదేశంలో ఒక బ్యాంకు ద్వారా ప్రారంభించబడిన మొట్టమొదటి, వినూత్న కార్యక్రమం, ఐడిఎఫ్సి ఫస్ట్ బ్యాంక్ స్టార్టప్ లాంజ్‌ని ప్రారంభించినందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ స్టార్టప్ లాంజ్ సమావేశ, సహకార కేంద్రంగా పనిచేస్తుంది. వ్యవస్థాపకులకు ఆవిష్కరణలు, అభివృద్ధి చెందడానికి అనుకూలమైన వాతావరణాన్ని అందిస్తుంది.

డియాజియో ఇండియా ఆధ్వర్యంలో పునరుత్పత్తి వ్యవసాయ కార్యక్రమం

హైదరాబాద్: దేశంలోని ప్రముఖ ఆల్కహాల్ పానీయాల కంపెనీలలో అగ్రగామిగా ఉన్న డియాజియో ఇండియా (యునైటెడ్ స్పిరిట్స్ లిమిటెడ్), కర్బన ఉద్గారాలు, నీటి వినియోగాన్ని తగ్గించే ప్రయత్నాలలో భాగంగా తెలంగాణలోని వరి రైతులతో పునరుత్పత్తి వ్యవసాయ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని ప్రకటించింది. దీని కోసం కంపెనీ తన సప్లయ్ చెయిన్‌ను వినియోగించుకోనుంది. సుస్థిర వ్యవసాయ కేంద్రం భాగస్వామ్యంతో జారీ చేస్తున్న ఈ కార్యక్రమం తెలంగాణలోని 15 గ్రామాలకు చెందిన 220 మంది రైతులతో కలిసి, మొదటి ఏడాదిలో 500 హెక్టార్ల భూమిలో సాగు చేయనుంది. రానున్న ఏడాదుల్లో ఈ చొరవ మరింత విస్తృతం చేయాలని కంపెనీ భావిస్తోంది. భారతదేశంలో వ్యవసాయ గ్రీన్‌హౌస్ గ్యాస్ ఉద్గారాలలో 17% బియ్యం ఉత్పత్తి సమయంలోనే వెలువడుతుందని పలు అధ్యయనాలు స్పష్టంగా చెబుతున్నాయి. కంపెనీ సప్లయ్ చెయిన్‌లో బియ్యం నూక కీలకమైన ముడిసరుకుగా ఉండటంతో, స్థిరమైన వరి వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడాన్ని డియాజియో ఇండియా తన పరిధిలో 3 ఉద్గారాలను తగ్గించడంలో మరింత సహాయపడుతుంది.

జేఎస్‌డబ్ల్యూ ఎంజి మోటార్ ఇండియా రెండు కొత్త 7-సీటర్ వేరియెంట్స్ విడుదల

గురుగ్రామ్: జేఎస్ డబ్ల్యూ ఎంజి మోటార్ రెండు కొత్త 7-సీటర్ వేరియెంట్స్ హెక్టర్ ప్లస్ 7-సీటర్ సెలక్ట్ ప్రో, స్మార్ట్ ప్రోను చేర్చి భారతదేశపు మొదటి ఇంటర్నెట్ ఎస్‌యువి ఎంజి హెక్టర్ శ్రేణి విస్తరణను ప్రకటించింది. ప్రీమియం ఎస్‌యువి అనుభవాన్ని కోరుకునే కస్టమర్ల కోసం విశాలమైన, విలక్షణమైన ఆప్షన్‌ను ఇది అందిస్తోంది. సివిటి ట్రాన్స్ మిషన్‌తో జత కలిసిన 1.5 టి ప్రెటోల్ ఇంజన్ ద్వారా ద సెలక్ట్ ప్రో మద్దతు చేయబడింది, సాఫీ, సమర్థవంతమైన డ్రైవింగ్ అనుభవాన్ని అందిస్తోంది. 2.0 లీ డీజిల్ ఇంజన్‌లో లభిస్తోంది. ద స్మార్ట్ ప్రో వేరియెంట్ 6 స్పీడ్ మేన్యువల్ ట్రాన్స్ మిషన్‌తో ఇంధన సామర్థ్యాన్ని, టార్క్‌ను అందిస్తోంది. హెక్టార్ ప్లస్ 7-సీటర్ సెలక్ట్ ప్రో, స్మార్ట్ ప్రోలు ఎస్‌యువి ఔత్సాహికుల అంచనాలకు అనుగుణంగా ఉంటాయని, అధిగమించడాన్ని కొనసాగిస్తాయని సతీందర్ సింగ్ బజ్వా తెలిపారు.

సంపాదకీయం

యోగీకి నిరుద్యోగుల మొహం పగిలే జవాబు

మోదీ హయాంలో ఉద్యోగాలు కల్పించడం కేవలం నీటి మూటగానే మిగిలిపోయి ఉండవచ్చు. కనీసం ఉద్యోగార్థులకు పరీక్షలు నిర్వహించడంలో కూడా ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. ఉత్తరప్రదేశ్ లో రాష్ట్ర స్థాయి సివిల్ సర్వీసు (పి.ఎస్.సి.) అధికారుల, సమీక్షా అధికారుల (ఆర్.ఓ.), సహాయ సమీక్షా అధికారుల (ఎ.ఆర్.ఓ.) నియామకానికి పరీక్షలను ఒకే రోజు ఒకే షిఫ్ట్ లో పరీక్షలు నిర్వహించాలని కోరుతూ అలహాబాద్‌లో (యోగీ పెట్టిన పేరు-ప్రయాగ్ రాజ్) ఆందోళనకు దిగిన అభ్యర్థులమీద లాఠీచార్జీ చేయడంలో మాత్రం ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ ప్రభుత్వం ఏ లోటూ చేయలేదు. అభ్యర్థులు చెప్పాపెట్టకుండా ఆందోళనకు దిగలేదు. యు.పి. ప్రభుత్వ పరీక్షా విధానాన్ని వ్యతిరేకిస్తూ కనీసం రెండున్నర లక్షలమంది "ఎక్స్" (మునుపు ట్విట్టర్) లో తమ అభ్యర్థన తెలియజేశారు. ప్రభుత్వం మిన్నకుండి పోయింది. విధిలేక అభ్యర్థులు సోమవారం ఉత్తరప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఎదుట నిరసనకు దిగారు. అప్పుడు పోలీసులు ఆందోళన చేస్తున్న అభ్యర్థులను చెదరగొట్టడానికి కరకు లాఠీలు ప్రయోగించారు. పి.సి.ఎస్., ఆర్.ఓ., ఎ.ఆర్.ఓ. పరీక్షలను ఒకే రోజులో ఒకే షిఫ్టులో నిర్వహించకపోతే ప్రశ్నా పత్రాలు విడివిడిగా ఉంటాయని అభ్యర్థులు అంటున్నారు. అలాంటప్పుడు ఒక ప్రశ్న పత్రం కాస్త సులువుగా ఉండొచ్చు. మరో ప్రశ్న పత్రం కఠినంగా ఉండొచ్చు. ఇది కచ్చితంగా అభ్యర్థులకు నష్టం కల్గిస్తుంది. ఈ పరీక్ష నిజానికి గత ఫిబ్రవరిలో జరగాల్సింది. అప్పుడు ప్రశ్నపత్రం పరీక్ష కన్నా ముందే అంగట్లోకి వచ్చిందన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. యోగీ ప్రభుత్వం షరా మామూలుగా ఈ వాదనను ఖండించింది. కానీ మూడు వారాల తరవాత జ్ఞానోదయమై ఆ పరీక్షను రద్దు చేసింది. ప్రశ్న పత్రం లీక్ కాకపోతే పరీక్షను ఎందుకు రద్దు చేసినట్టు? చేయని తప్పుకు యోగీ ప్రభుత్వం లెంపలు ఎందుకు వేసుకున్నట్టు!! ఒకే రోజు పరీక్ష నిర్వహించాలంటే ఎక్కువ పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయాలి. కానీ కేవలం ప్రభుత్వ కళాశాలల్లో మాత్రమే పరీక్ష నిర్వహిస్తామని యోగీ ప్రభుత్వం హఠయోగ ముద్రలోకి వెళ్లిపోయింది. ఆ తరవాత ఈ పరీక్ష మార్చిలో అన్నారు. అప్పుడూ నిర్వహించలేక పోయారు. తరవాత జూన్ లో అన్నారు. అదీ కుదరలేదు. తరవాత అక్టోబర్ లోనూ అదే కథ. ఇప్పుడు డిసెంబర్ 22, 23వ తేదీన నిర్వహిస్తామంటున్నారు. ఇదే ఒకే షిఫ్ట్ ఒకే రోజులో నిర్వహించాలని అభ్యర్థులు కోరుతున్నారు. కుంభమేళాకు విస్తృతమైన ఏర్పాట్లు చేయగలిగిన ప్రభుత్వానికి ఒకే రోజు, ఒకే షిఫ్ట్‌లో పరీక్ష నిర్వహించే శక్తి లేదంటే ఎలా నమ్మగలం! పరీక్ష కన్నా ముందే ప్రశ్న పత్రాలు అంగట్లో అందుబాట్లోకు రావడం ఒక్క ఉత్తరప్రదేశ్ సమస్య మాత్రమే కాదు. రాజస్థాన్, మధ్యప్రదేశ్, బీహార్, గుజరాత్‌లో కూడా ఇదే పరిస్థితి ఎదురైంది. ఇవన్నీ బీజేపీ లేదా దాని మిత్రపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలే. డబులు ఇంజన్ సర్కారు ఉన్నప్పుడు రెండు ఇంజన్లు చెరోవేపు లాగుతాయేమో! ప్రశ్న పత్రాలు లీక్ కావడం ఏ ఒక్క రాష్ట్రానికో పరిమితం కాలేదు. గుజరాత్‌లో అయితే ప్రశ్న పత్రాలు లీక్ చేసిన వారిని అరెస్టు చేశారు. వారి దగ్గర ఏడు లక్షల రూపాయల నగదు కూడా దొరికింది. బీహార్‌లో మొత్తం 48 మందిని ప్రశ్న పత్రాల లీక్ వ్యవహారంలో అరెస్టు చేశారు. సీబీఐ దర్యాప్తుచేసి చార్జ్ షీట్ కూడా దాఖలు చేసింది. అందులో ఈ దురాగతానికి పాల్పడ్డవారు నేరపూరిత కుట్రకు, నేరానికి తోడ్పడం, నేరపూరితంగా విశ్వాసాన్ని వమ్ము చేయడం, దొంగతనం, మోసం, సాక్ష్యాలను మాయం చేయడం, దొంగిలించిన ప్రశ్న పత్రాలను కొనడం లాంటి వాటికి పాల్పడ్డారని తెలియజేసింది. అసలు లీకే కాకపోతే ఈ తతంగం అంతా ఎందుకు జరుగుతుంది?

పరీక్షల నిర్వహణలో అసమర్థత, పరీక్షా పత్రాలు లీక్ కావడం యోగీ ఏలుబడిలో అరుదేమీ కాదు. సాధారణంగా జరుగుతున్న తంతే. ప్రశ్న పత్రాలు లీక్ కాలేదని ఒక్క యోగీ మాత్రమే వాదించడం లేదు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ లీక్ కాలేదని పదే పదే అసత్యమే పలికారు. నీట్ పరీక్ష సమయంలోనూ లీక్ అంశం గగ్గోలు రేపింది. అప్పుడూ ధర్మేంద్ర ప్రధాన్ ఈ వాస్తవాన్ని నిరాకరిస్తూనే ఉన్నారు. విసుగు, విరామం లేకుండా అసత్యమాడడంలో ఆయన ప్రతిభ ఎంతటిదంటే కడకు పార్లమెంటు నిండు సభలోనూ ఇదే అబద్ధం నిర్భయంగా చెప్పేవారు. డబుల్ ఇంజిన్ సర్కారు ఉన్న గుజరాత్ లోని గోధ్రాలో ఓ పరీక్షా కేంద్రంలో అభ్యర్థులు ఒకరి జవాబు పత్రం మరొకరు చూసి నిర్భయంగా రాయడానికి అవకాశం కల్పించారు. ఈ విషయంలోనూ సీబీఐ నెల రోజుల కిందట చార్జ్ షీట్ కూడా దాఖలు చేసింది. అప్పుడైనా ధర్మేంద్ర ప్రధాన్ నిజం అంగీకరించకుండా నిలకడగా అబద్ధమే చెప్పారు. అగ్నివీర్ నియామకాలకోసం పరీక్షలు నిర్వహించినప్పుడు కూడా పరీక్షా పత్రాలు లీక్ అయ్యాయన్న ఆరోపణ వచ్చింది. ఈ ఆరోపణలను ప్రభుత్వాలు అంగీకరించకపోయినా పరీక్షలు రద్దు చేస్తుండడం సిగ్గు చేటు. సమస్య ఏమిటంటే ప్రభుత్వాలు కనీసం పరీక్షలైనా సవ్యంగా నిర్వహించడంలో విఫలమైనప్పుడు దౌర్జన్యానికి దిగుతుంది. అలహాబాద్‌లో సోమవారం జరిగింది ఇదే. దిల్లీ, లక్నోలో కూడా అభ్యర్థులు నిరసన తెలియజేశారు. ఈ పరీక్షల్లో దాపరికాన్ని ఉద్యోగార్థులు ప్రశ్నిస్తున్నారు. ప్రశ్న పత్రాలు ముద్రించే చోటి నుంచే అవి అంగట్లోకి రావడం ప్రభుత్వాల అసమర్థతకు నిదర్శనం. విచిత్రం ఏమిటంటే ఉత్తరప్రదేశ్‌లో ఇంత భారీ ఎత్తున ఆందోళన జరుగుతున్నట్టు నిన్న లాఠీ చార్జీ జరిగే దాకా ఆ విషయం బయటి ప్రపంచానికి తెలియనేలేదు. ఉత్తర ప్రదేశ్‌లో ఉండాలంటే యోగీ, మోదీ అనాల్సిందేనంటారు. కానీ నిరసనకు దిగిన అభ్యర్థుల చేతుల్లో మోదీ బొమ్మలున్న ప్లకార్డులు లేవు. వాటి మీద గాంధీ, నెహ్రూ, పటేల్, సుభాష్ చంద్రబోస్, భగత్ సింగ్ వంటి వారి ఫొటోలు మాత్రం ఉన్నాయి. ఇది దేనికి సంకేతమో ఆలోచించే ఓపిక కూడా యోగీకి లేదు. యోగీ లాంటి వారు తాము భయపడ్డప్పుడు, తమ పీఠం కదులుతోంది అనిపించినప్పుడు నిరసన తెలియజేసే వారిమీద దౌర్జన్యానికి దిగుతారు అని మంగళవారం నాటి లాఠీ చార్జీ నిరూపిస్తోంది. యోగీ దేశమంతా తిరిగి "కటేంగేతో బటేంగే" విడిపోతే పతనం అవుతాం అని నినాదం ఇస్తున్నారు. ఆయన రాష్ట్రంలోని నిరుద్యోగులు "న బటేంగే-న హటేంగే" (విడిపోము, సమస్య పరిష్కారం అయ్యే దాకా కదలం) అని నినదిస్తున్నారు. ఐక్యంగా ఉంటే విజేతలమవుతాం అని కూడా అంటున్నారు. ఈ నినాదాలు జనాన్ని మతపరంగా చీల్చే యోగీకి మొహం పగిలే జవాబే.

విజయంపై దిసన్నాయకే ధీమా

అరుణ్‌కుమార్ శ్రీ వత్సవ

శ్రీలంక పార్లమెంటు ఎన్నికలలో తమ పార్టీ విజయం సాధిస్తుందన్న ధీమాను దేశ అధ్యక్షుడు అనురకుమార దిస్స నాయకే వ్యక్తం చేశారు. శ్రీలంక పార్లమెంటు ఎన్నికలు ఈ నెల 14న జరగనున్నాయి. పార్లమెంటుకు 225 స్థానాలున్నాయి. పీపుల్స్ లిబరేషన్ ఫ్రంట్ లేదా జనతా విముక్తి పరమున (జేవీపీ) నాయకుడు, వామపక్ష నాయకుడైన దిస్స నాయకే ఇటీవల జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో ఘన విజయం సాధించారు. జేవీపీ పార్టీ 21పార్టీలతో కలిసి ప్రభుత్వం నిర్వహిస్తోంది. నేషనల్ పీపుల్స్ పవర్(ఎన్‌పీపీ) 2019లో ఏర్పాటైంది. దిసన్నాయకే అధ్యక్షుడిగా ఎన్నికైన సమయంలో ఎన్‌పీపీకి ముగ్గురు పార్లమెంటు సభ్యులు మాత్రమే ఉన్నారు. అధ్యక్ష ఎన్నికలకు జరిగిన ప్రచారంలో దిస్స నాయకే తాను విజయం సాధిస్తే త్వరలోనే పార్లమెంటుకు ఎన్నికలు జరిపిస్తానని వాగ్దానం చేశారు. వాగ్దానం ప్రకారం, సెప్టెంబరు 24న పార్లమెంటును రద్దు చేశారు. అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత త్వరలోనే ఆయన తన వాగ్దానాన్ని నిలుపుకున్నారు. హిందు మహాసముద్రంలో ఉన్న ఒక దీవి శ్రీలంక. ఈ పార్లమెంటు ఎన్నికల్లో క్షేత్రస్థాయిలో మార్పులను ప్రతిబింబించవచ్చునని అంచనా వేస్తున్నారు. అధ్యక్ష ఎన్నికలు జరిగిన నాటికి, నేటికి ప్రజల్లో పెద్దమార్పులు ఉండబోవని ఎప్పుడో ఏర్పాటుచేసిన పార్టీలను, వాటి నాయకులను తిరస్కరించవచ్చునని భావిస్తున్నారు. పార్లమెంటులో ఉన్న ముగ్గురు ఎంపీటీ సభ్యులను కూడా ఈ ఎన్నికల్లో జనం గెలిపించకపోవచ్చునని అంచనా వేశారు. దేశ అధ్యక్షుడు మరో ముగ్గురిని తమ ప్రభుత్వంలో మంత్రులుగా చేర్చుకున్నారు. తాను అనుసరిస్తున్న విధానాలనే వారు కూడా అనుసరించవచ్చునని విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. తమ పార్టీకి చెందిన మరింత మంది సభ్యులు గెలుపొందుతారని ప్రభుత్వంలోని ఇతర కూటమి పార్టీలు కూడా తమ విధానాలనే పాటిస్తాయని కూడా ఆయన విశ్వసిస్తున్నారు. అధ్యక్ష ఎన్నికల్లో దిస్సనాయకే గెలవగా సమీప ప్రత్యర్థి నాయకుడు సజిత్ ప్రేమదాస సమాజి జన బలవేగయా(ఎస్‌జేబీ) రెండవస్థానంలో నిలిచారు. రాజపక్స కుటుంబానికి చెందిన, రాజకీయంగా మంచి పలుకుబడి కలగిన రణీల్ విక్రమ సింఘే అధ్యక్ష స్థానం నుంచి వైదొలగనున్నారు.

శ్రీలంక రాజకీయాలు కొత్త దనాన్ని సంతరించుకునే అవకాశం ఉంది. తమిళ వేర్పాటువాదుల లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ్ ఈలం(ఎల్‌టీటీఈ) గతంలోనే ప్రముఖస్థానం నుంచి వెళ్లిపోయింది. ప్రభాకరన్ ఈ పార్టీకి నాయకత్వం వహించారు. ఇప్పుడు రాజకీయంగా ఎల్‌టీటీఈని ప్రజలు అంగీకరించడంలేదు. రాజకీయాలలో ఎల్‌టీటీఈకి స్థానం లేకుండాపోయింది. ఎప్పుడో ఏర్పాటుచేసిన పార్టీలు క్రమంగా ప్రజలకు దూరమవుతున్నాయి. కొలంబోలోని ఇండియా హై కమిషన్ మీడియాకు పత్రికాప్రకటన విడుదల చేసింది. శ్రీలంకలో మూడురోజులపాటు ఉండి ఇక్కడి పరిస్థితులను తెలుసుకునేందుకు ఇండియన్ నేవీ సబ్‌మెరైన్ ఎఎన్‌ఎస్ నవంబరు 10న కొలంబోకు వచ్చింది. కొలంబోలోని రష్యన్ రాయబార కార్యాలయం విడుదలచేసిన ఒక పత్రికా ప్రకటనలో బ్రిక్స్‌లో చేరేందుకు శ్రీలంక దరఖాస్తు చేయగా తిరస్కరించినట్లు తెలిపింది. బ్రిక్స్‌లో చేరేందుకు తాను దరఖాస్తు చేసిన విషయాన్ని శ్రీలంక ఎంబసీ ప్రముఖంగా చెబుతోంది. రష్యాకు చెందిన బ్రిక్స్ చైర్మన్ శ్రీలంక ఆసక్తిని హర్షించారు. దరఖాస్తులు చేసిన ఇతర దేశాల విజ్ఞప్తులతోపాటు తగిన సమయంలో శ్రీలంక అంశాన్ని పరిశీలిస్తామని తెలియజేశారు. అయితే స్థానిక మీడియా శ్రీలంక దరఖాస్తును తిరస్కరించడం సరైందికాదని ప్రకటించాయి. టూరిజం విషయంలో శ్రీలంక ప్రముఖస్థానాన్ని వహించింది. అయితే ఇటీవల కాలంలో ఇది గణనీయంగా తగ్గిపోయింది. దిస్సనాయకే విజయం తర్వాత టూరిజం తిరిగి పుంజుకుంటోంది. వండర్‌లస్ట్ రీడర్ ట్రావెల్ అవార్డుల 23వ వార్షికోత్సవంలో శ్రీలంక ప్రపంచంలోనే టూరిజానికి అత్యంత అభిలషనీయమైన యాత్ర దీవిగా ఎంపికైంది. వండర్‌లస్ట్ యాత్ర పత్రిక శ్రీలంక అత్యంత ఆకర్షణీయమైన యాత్రా కేంద్రాలలో 8వస్థానంలో ఉందని తెలియజేసింది. హిందూమహాసముద్రంలో శ్రీలంక ముత్యంలాంటిదని ఈ పత్రిక పేర్కొంది.

2018లో 2.3 మిలియన్ల యాత్రికులు శ్రీలంకను సందర్శించారు. రాజకీయంగా, ఆర్థికంగా అస్థిరతనుంచి నెమ్మదిగా 2024నాటికి టూరిజం పెరుగుతున్నది. ఈ సంవత్సరం తప్పనిసరిగా రెండు మిలియన్ల కంటే ఎక్కువగా యాత్రికులు రానున్నట్లు టూరిజం ప్రమోషన్ బ్యూరో చైర్మన్ బౌద్ధిక హర్వావసమ్ తెలిపారు. పార్లమెంటు ఎన్నికలు అయిన తర్వాత దేశం తిరిగి పురోగమనం బాట పడుతుందని హర్వవసమ్ ప్రకటించారు.

బీజేపీ శ్రీరంగనీతులు

ఎం కోటేశ్వరరావు

చట్టసభల్లో ప్రతిపక్ష పార్టీల సభ్యులు ఎలా ప్రవర్తించాలో బోధలు చేసే బీజేపీ తనదాకా వచ్చే సరికి ఎదుటి వారికి చెప్పేటందుకే నీతులు ఉన్నాయి అన్నట్లు వ్యవహరిస్తున్నది. తాజాగా జమ్మూ-కశ్మీరు అసెంబ్లీలో, అంతకు ముందు అది ప్రతిపక్షంగా ఉన్న చోట్ల తన సుభాషితాలను తానే తుంగలో తొక్కి వ్యవహరించింది. పార్లమెంటు రద్దు చేసిన ఆర్టికల్ 370, ఆర్టికల్ 35ఏను పునరుద్దరించాలని కోరుతూ ఈ నెల 6న జమ్మూ-కశ్మీరు అసెంబ్లీ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. అప్పటి నుంచి బీజేపీ సభ్యులు దాన్ని వ్యతిరేకిస్తూ సభలో అరాచకానికి దిగటంతో మార్షల్స్‌ను రప్పించి వారిని గెంటివేయించాల్సి వచ్చింది. ఆ తీర్మానం చట్టవిరుద్ధం, దేశానికే వ్యతిరేకం, కశ్మీరుకు వ్యతిరేకంగా కుట్ర అంటూ బీజేపీ గుండెలు బాదుకుంటున్నది. దీనిలో ప్రధాని నరేంద్ర మోదీ కూడా భాగస్వామి అయ్యారు. కశ్మీరులో అంబేద్కర్ రాజ్యాంగాన్ని పక్కన పెట్టారంటూ రెచ్చగొట్టారు. భారత రాజ్యాంగం తప్ప అంబేద్కర్ పేరుతో ఎలాంటి రాజ్యాంగం లేదు. ఈ సందర్భంగా ముందుకు వచ్చిన కొన్ని వాదనలు, వాటి బండారాన్ని చూద్దాం.

"ఆర్టికల్ 370ని పునరుద్దరించాలని అసెంబ్లీ ఒక తీర్మానాన్ని ఆమోదించటం చట్టవిరుద్ధం " అయితే పార్లమెంటులో దాన్ని రద్దు చేయటం కూడా అంతే కదా ! ఒక రాష్ట్రానికి ఉన్న ప్రత్యేక హోదాను రద్దు చేసే ముందు ఆ రాష్ట్ర అసెంబ్లీని సంప్రదించాల్సి ఉంది. ఆ రాజ్యాంగ ప్రక్రియను తుంగలో తొక్కి ఏకపక్షంగా పార్లమెంటులో రద్దు చేసినప్పుడు బీజేపీ పెద్దలకు అంబేద్కర్ గుర్తుకు రాలేదు. సదరు ఆర్టికల్ రద్దును వ్యతిరేకిస్తూ దాఖలైన 23 పిటీషన్లను విచారించిన సుప్రీం కోర్టు రద్దు చట్టబద్దమే అని చెప్పింది కదా అని ఎవరైనా అనవచ్చు. పార్లమెంటుకు ఉన్న అధికారాల మేరకు అది తీసుకున్న నిర్ణయం రాజ్యాంగబద్దమే అని కోర్టు చెప్పింది. పార్లమెంటు మాదిరే కశ్మీరు అసెంబ్లీకి కూడా అధికారాలు ఉన్నాయా? లేవా? ఉన్నవి గనుకనే ఆ మేరకు మెజారిటీగా ఉన్న సభ్యులు రద్దు చేసిన దాన్ని పునరుద్దరించాలని ఒక తీర్మానాన్ని ఆమోదించారు. పునరుద్దరణ అంశాన్ని పరిశీలించాలని కేంద్రాన్ని కోరారుతప్ప అదేమీ అమల్లోకి రాలేదు, రద్దు చేసిన పార్లమెంటే దాన్ని పునరుద్దరించాల్సి ఉంటుంది. అసలు తీర్మానం చేయటమే చట్టవిరుద్ధం అని బీజేపీ చెబితే సరిపోతుందా? కావాలంటే ఆ తీర్మానాన్ని సవాల్ చేస్తూ ఆ పార్టీ కూడా కోర్టును ఆశ్రయించవచ్చు. అప్పుడు కోర్టేమి చెబుతుందో దేశానికి కూడా తెలుస్తుంది. ఆ పని చేయకుండా అసెంబ్లీలో అరాచకానికి పాల్పడటం ఏమిటి? ప్రజాస్వామిక వ్యవస్థలో ఉన్నామా మూకస్వామ్యంలోనా ?

తమకు అధికారమిస్తే ఆర్టికల్ 370 రద్దు చేస్తామని బీజేపీ తన ఎన్నికల ప్రణాళికలో పెట్టిందో అలాగే తమకు అధికారమిస్తే రద్దు చేసిన సదరు ఆర్టికల్ పునరుద్దరణకు కృషి చేస్తామని కశ్మీరులో నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్, సీపీఎం భాగస్వాములుగా ఉన్న కూటమి కూడా ఎన్నికల్లో వాగ్దానం చేసింది. ఆ మేరకు అధికారానికి వచ్చిన తరువాత దాన్ని తీర్మానరూపంలో నెరవేర్చింది. అధికారం రాకపోయినా రాష్ట్రంలో తమదే పెద్ద పార్టీ అని బీజేపీ రాష్ట్రనేతలు చెట్టుకింద ప్లీడర్లలా వాదిస్తున్నారు. పెద్ద పార్టీ తప్ప దానికి వచ్చింది నాలుగోవంతు ఓట్లే అన్నది గమనించాలి. లోక్‌సభ ఎన్నికలలో బీజేపీ, దాని మిత్రపక్షాలకు సీట్లు ఎక్కువ వచ్చాయి తప్ప ఓట్లు రాలేదు. దాన్ని వ్యతిరేకించే పార్టీలకే ఎక్కువ ఓట్లు వచ్చాయి. అలాంటప్పుడు ఆర్టికల్ 370ని రద్దు చేయకూడదు కదా, ఎందుకు చేసినట్లు ? 2019 లోక్‌సభ ఎన్నికలలో ఎన్‌డిఏ కూటమికి వచ్చిన ఓట్లు 45.3శాతం కాగా, 2024 ఎన్నికల్లో 42.53శాతానికి పడిపోయాయి. ఇదే సమయంలో యూపీఏ లేదా ఇండియా ఐక్య సంఘటన ఓట్లు 27.5 నుంచి 40.56 శాతానికి పెరిగాయి. అన్నింటికంటే కశ్మీరులో బీజేపీ ఆర్టికల్ 370 రద్దును సమర్థిస్తూ ఓటర్ల ముందుకు వెళ్లి ఇండియా కూటమి మద్దతు కోరాయి. బీజేపీకి వచ్చిన ఓట్లు కేవలం 25.63శాతమే, ఆర్టికల్ 370 రద్దును వ్యతిరేకించే పార్టీలకే మిగిలిన ఓట్లన్నీ వచ్చాయి. బీజేపీ చెప్పే అధిక ఓట్లు నేషనల్ కాన్ఫరెన్సుకు వచ్చిన ఓట్లతో పోల్చుకొని మాత్రమే. ఇండియా కూటమికి 36 శాతం ఓట్లు వచ్చాయి.

ఆర్టికల్ 370ని పునరుద్దరించాలన్న తీర్మానం పెద్ద కుట్ర అంటున్నారు. ఆ తీర్మానం బహిరంగం, టీవీ చిత్రీకరణ మధ్య అసెంబ్లీ ఆమోదించింది, కుట్ర ఎలా అవుతుంది ? మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో నరేంద్రమోదీ చెప్పినట్లు కశ్మీరు మీద కుట్ర అయితే అది బహిరంగ కుట్ర. కావాలంటే కేంద్ర ప్రభుత్వం ఆ రాష్ట్ర ప్రభుత్వం మీద నిరభ్యంతరంగా చర్య తీసుకోవచ్చు, ఒట్టి మాటలెందుకు? చరిత్ర చూసినప్పుడు ఈ ఆర్టికల్‌ను అంబేద్కర్ వంటి వారు వ్యతిరేకిస్తే సమర్ధించిన వారు అత్యధికులు ఉన్నారు. ఎవరికైనా తమ అభిప్రాయం వెల్లడించే హక్కు ఉంది. రాజ్యాంగ రచన కమిటీ అధ్యక్షుడిగా అంబేద్కర్‌కు గౌరవం దక్కింది. అది రాజ్యాంగసభ ఉమ్మడి నిర్ణయం తప్ప వ్యక్తిగతం కాదు. ఆ మాటకు వస్తే అంబేద్కర్ వ్యతిరేకించిన అంశాలు అనేకం ఉన్నాయి. మనుస్మృతిని బహిరంగంగా తగులపెట్టారు. ఆయన జీవిత కాలంలోనే అమల్లోకి వచ్చిన రాజ్యాంగాన్ని, ఆర్టికల్ 370ని తగులబెట్టలేదే ! అంబేద్కర్‌ను పదే పదే ఉటంకించే బీజేపీ ఆయన మాదిరి మనుస్మృతిని తగులబెట్టటం సంగతి అలా ఉంచి కనీసం దాన్ని వ్యతిరేకిస్తున్నట్లు బహిరంగంగా ప్రకటించగలదా ? అంబేద్కర్ బాటలో ఎందుకు నడవటం లేదు ? ఆయన నిరసించిన మనుస్మృతిని రాజ్యాంగంలో చేర్చలేదంటూ నిరసించిన ఆర్‌ఎస్‌ఎస్ గుంపులోని వారే బీజేపీ నేతలు. సదరు సంస్థ మోదీ చెప్పిన అంబేద్కర్ రాజ్యాంగాన్ని వ్యతిరేకించింది. జాతీయ పతాకాన్ని కూడా అది గుర్తించలేదు, గౌరవించలేదు. రాజ్యాంగ సభ 1949 నవంబరు 26న రాజ్యాంగాన్ని ఖరారు చేసింది. తరువాత నాలుగు రోజులకు నవంబరు 30న ఆర్‌ఎస్‌ఎస్ పత్రిక ఆర్గనైజర్ సంపాదకీయంలో ఏమి రాసిందో తెలుసా ! "కానీ మన రాజ్యాంగంలో పురాతన భారత్‌లో అద్వితీయమైన రాజ్యాంగ పరిణామం గురించిన ప్రస్తావన లేదు. మను చట్టాలు స్పార్టా లికర్‌గుస్(గ్రీసు లాయర్, క్రీస్తు పూర్వం 730లో మరణించాడు) లేదా పర్షియా సోలోన్(క్రీస్తు పూర్వం 630-560 మధ్య జీవించిన రాజనీతిజ్ఞుడు) కంటే ఎంతో ముందుగానే రాసినవి. మనుస్మృతిలో రాసిన చట్టాలు నేటికీ ప్రపంచ ప్రశంసలు పొందటం ఉద్వేగాన్ని కలిగిస్తున్నవంటున్నారు. కానీ మన రాజ్యాంగ పండితులకు మాత్రం వాటిలో ఏమీ కనిపించలేదు" అని రాసింది. గురు ఎంఎస్ గోల్వాల్కర్ రాసిన బంచ్ ఆఫ్ థాట్స్ అనే గ్రంధం ఆర్‌ఎస్‌ఎస్ వారికి ఒక పవిత్ర గ్రంధం. దానిలో రాజ్యాంగం హిందూ వ్యతిరేకమైనదని రాశారు. వివిధ దేశాలనుంచి అంశాలను తీసుకొని రాజ్యాంగాన్ని రూపొందించారు తప్ప దానిలో మనది అని చెప్పుకొనేందుకు ఏమీ లేదు అంటూ అంబేద్కర్‌ను అవమానించే విధంగా పేర్కొన్నారు. అలాంటి గోల్వాల్కర్ వారసులు ఇప్పుడు అంబేద్కర్‌ను పొగడటం నిజంగా వంచన తప్ప మరొకటి కాదు. వారికి చిత్తశుద్ధి ఉంటే గోల్వాల్కర్ రచనలు తప్పని బహిరంగంగా ప్రకటించాలి. కశ్మీరు అసెంబ్లీలో ఆర్టికల్ 370 పునరుద్దరణ తీర్మానాన్ని వ్యతిరేకించి సభలో అరాచకాన్ని సృష్టించిన బీజేపీ మరోమారు ఆ అంశాన్ని చర్చకు తెచ్చింది. దాన్ని రద్దు చేసిన ఐదు సంవత్సరాల తరువాత ఎన్నికలు జరిపిన కేంద్ర ప్రభుత్వం(బీజేపీ) ఊహించినదానికి భిన్నంగా అక్కడ తీర్పు వచ్చింది. దాన్ని మింగాకక్కలేక బీజేపీ సభ్యులు ఐదు రోజుల పాటు సభా కార్యక్రమాలను అడ్డుకున్నారు. వాట్సాప్ యూనివర్సిటీ సమాచారం మీద ఆధారపడి వ్యవహరించకూడదని రాష్ట్ర ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా బీజేపీ సభ్యులను తూర్పారబట్టారు. తమ అజెండాను నిర్ణయించేది రాష్ట్ర పౌరులు తప్ప వాట్సాప్ యూనివర్సిటీ, ఫేస్‌బుక్ లేదా ఎక్స్ కాదన్నారు. భారత సమగ్రత, సార్వభౌమత్వాన్ని సవాలు చేసే విధంగా స్పీకర్ సమావేశాలను నిర్వహిస్తే తాము సమాంతరంగా సభ, ప్రభుత్వాన్ని కూడా నిర్వహిస్తామని బీజేపీ నేత సునీల్ శర్మ చెప్పారు. తమ సభ్యులను మార్షల్స్‌తో గెంటివేయించినందున వెలుపల సమాంతరంగా సమావేశం జరిపినట్లు చెప్పుకున్నారు. దీన్ని తేలికగా తీసుకోరాదన్నారు. అదంతా మీడియాలో ప్రచారం కోసం తప్ప మరొకటి కాదు.

> "ఆర్టికల్ 370ని పునరుద్దరించాలని అసెంబ్లీ ఒక తీర్మానాన్ని ఆమోదించటం చట్టవిరుద్ధం " అయితే పార్లమెంటులో దాన్ని రద్దు చేయటం కూడా అంతే కదా ! ఒక రాష్ట్రానికి ఉన్న ప్రత్యేక హోదాను రద్దు చేసే ముందు ఆ రాష్ట్ర అసెంబ్లీని సంప్రదించాల్సి ఉంది. ఆ రాజ్యాంగ ప్రక్రియను తుంగలో తొక్కి ఏకపక్షంగా పార్లమెంటులో రద్దు చేసినప్పుడు బీజేపీ పెద్దలకు అంబేద్కర్ గుర్తుకు రాలేదు.

పార్లమెంటు కార్యకలాపాలను అడ్డుకునే ఎంపీలు ఆత్మశోధన చేసుకోవాలని మోదీ హితవు చెప్పారు. ఈ ఏడాది జనవరిలో తాత్కాలిక బడ్జెట్ సమావేశాల సందర్భంగా గత పది సంవత్సరాల్లో ప్రతిపక్షాలు అడ్డుకొనే ప్రవర్తనతో వ్యవహరించాయని, అదొక అలవాటుగా మారిందని ఆరోపించారు. ఇంకా చాలా సుభాషితాలు చెప్పారు. అధికారంలో ఉన్నప్పుడు ఒక మాట ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరొక మాట మాట్లాడటంలో బీజేపీ ఏ పార్టీకీ తీసిపోలేదు. బీజేపీ నేత అరుణ్ జైట్లీ రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు 2011 జనవరిలో మాట్లాడుతూ " పార్లమెంటు పని చర్చలు నిర్వహించటం. అయితే అనేక సందర్భాలలో ప్రభుత్వం సమస్యలను పట్టించుకోదు అలాంటి సందర్భాలలో పార్లమెంటును అడ్డుకోవటం ప్రజాస్వామ్యానికి అనుకూలంగానే, కనుక పార్లమెంటులో అడ్డుకోవటం అప్రజాస్వామికం కాదు " అని సెలవిచ్చారు. ఇప్పుడు అదే బీజేపీ దానికి విరుద్ధంగా వ్యవహరిస్తోంది. ప్రధాని సభకు రావాలని, కీలక అంశాలపై నోరు విప్పాలని కూడా పార్లమెంటులో ప్రతిపక్షాలు డిమాండ్ చేయాల్సి వస్తోంది. కాంగ్రెస్ నేత ఆనందశర్మ మాట్లాడుతూ ప్రతిపక్షంగా తమ విధి నిర్వహిస్తున్నాం తప్ప పార్లమెంటును అడ్డుకోవటం లేదని, ప్రధాని నరేంద్రమోదీ అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పార్లమెంటు పరిశోధనా సంస్థ పిఆర్‌ఎస్ విశ్లేషించినదాని ప్రకారం 2009 నుంచి 2014వరకు యూపీఏ పాలనా కాలంలో నిర్దేశిత సమయంలో లోక్‌సభలో 61శాతం, రాజ్యసభలో 66శాతం సమయం ప్రతిపక్షం ఆటంకాలతో వృథా అయింది. ఆ సమయంలో బీజేపీ ప్రతిపక్షంగా ఉన్న సంగతి తెలిసిందే. తరువాత మోదీ తొలి ఏలుబడి 2014-19లో 16శాతం సమయం మాత్రమే ఆటంకాలతో వృథా అయింది. ఎవరు అడ్డగోలుగా వ్యవహరించారో, ఇతరులకు నీతులు ఎలా చెబుతున్నారో వంచనకు పాల్పడుతున్నారో ఈ అంకెలు వెల్లడిస్తున్నాయి.

జార్ఖండ్‌లో మహిళా ఓట్ల కోసం పాట్లు

రవీంద్ర నాథ్ సిన్హా

అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న జార్ఖండ్‌లో మహిళల ఓట్లు పొందేందుకు అధికార, ప్రతిపక్ష పార్టీలు నానా తంటాలు పడుతున్నాయి. అధికారంలో ఉన్న జార్ఖండ్ ముక్తి మోర్చా(జెఎంఎం), ప్రతిపక్షంలో ఉన్న బీజేపీ ఎంతో ఉదారంగా నగదు బహుమతులను ఇతర ప్రోత్సహకాలను ఇస్తామని వాగ్దానం చేస్తున్నాయి. మహిళల ఓట్ల కోసమే ఎక్కువగా ప్రచారాన్ని సాగిస్తున్నాయి. నవంబరు 13 బుధవారం మొదటి దశ పోలింగ్ జరుగుతుంది. ఈ దశలో 43 నియోజకవర్గాలలో పోలింగ్ జరుగుతుంది. అసెంబ్లీకి మొత్తం 81స్థానాలున్నాయి. మొదటి దశ పోలింగ్ జరిగే నియోజకవర్గాలలో ఎన్నికల ప్రచారం సోమవారం ముగిసింది. నవంబరు 20వ తేదీన రెండవదశ ఎన్నికలు 38 నియోజకవర్గాలలో జరుగుతాయి. జేఎంఎం నాయకత్వంలోని సంకీర్ణకూటమి , బీజేపీ నాయకత్వంలోని కూటమికి మధ్య హోరా హోరీ పోరాటం జరుగుతోంది. జేఎంఎం కూటమి నుంచి అధికారాన్ని హస్తగతం చేసుకునేందుకు బీజేపీ కూటమి నానా తంటాలు పడుతోంది. పాలక పార్టీ జెఎంఎం ఇండియా ఐక్యసంఘటనలో భాగంగా ఉన్నది. అధికార కూటమిలో కాంగ్రెస్, లాలూప్రసాద్ యాదవ్ నాయకత్వంలోని రాష్ట్రీయ జనతాదళ్, సీపీఐ-మార్క్సిస్టు లెనినిస్టు(లిబరేషన్) పార్టీ ఉన్నాయి. సీపీఐ సొంతంగా పోటీ చేస్తోంది. ప్రతిపక్షంలో బీజేపీ, మాజీ ఉప ముఖ్యమంత్రి సురేష్ మహతో నాయకత్వంలోఆల్ జార్ఖండ్ స్టూడెంట్స్ యూనియన్ పార్టీ, నితీశ్ కుమార్ నాయకత్వంలోని జనతాదళ్ (యు), లోక్‌దళ్ జనశక్తి పార్టీ కూడా ఎన్నికల రంగంలో ఉన్నాయి. రాష్ట్రంలో మొత్తం 2.59 కోట్ల ఓటర్లు ఉండగా, మహిళా ఓటర్లు సంఖ్య 1.28కోట్లు ఉంది. పురుష ఓటర్లసంఖ్య 1.31 కోట్లు ఉంది. వీరిలో మొదటిసారిగా ఓట్లు వేస్తున్న వారి సంఖ్య 11.05 లక్షల మంది ఉన్నారు. వీరు 18-19ఏళ్ల గ్రూపువారు.

క్షేత్రస్థాయిలో వాస్తవ అంశాలను పరిశీలించినట్లయితే మహిళా ఓటర్ల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. కొన్ని సందర్భాలలో పురుష ఓటర్లను మహిళలు నియంత్రించడం కనిపిస్తోంది. పురుష ఓటర్లకంటే మహిళా ఓటర్ల సంఖ్య ఎక్కువగా మనకు కనిపిస్తుంది. ఓట్లు వేసే కేంద్రాల వద్ద కొన్ని నియోజకవర్గాల్లో మహిళలే ఎక్కువగా బారులుతీరి నిలుచుని ఉంటారు. రాష్ట్ర ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్ మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి మైయా సమ్మాన్ యోజన పథకం కింద 18-50ఏళ్ల మధ్య గ్రూపు మహిళలకు షరతుల ప్రకారం నెలకు రూ.1000 నగదు బహుమతిని ప్రకటించారు. సార్వత్రిక పెన్షన్ స్కీం కింద నెలకు రూ.1000 50ఏళ్లు ఆపైన వయసుగల మహిళలకు పంపిణీ చేస్తున్నారు. సోరేన్ మంత్రివర్గం అక్టోబరు 14న మహిళలకు నెలకు ఇస్తున్న పెన్షన్‌ను రూ.1000 నుండి రూ.2500కు పెంచారు. డిసెంబరు నుంచి రూ.2500 పెన్షన్‌ను అమలుచేస్తారు. ఈ నేపథ్యంలో మహిళా ఓటర్లు అత్యధికంగా ఇండియా ఐక్యసంఘటనవైపే ఉండనున్నారని అంచనా. ఎన్నికల కమిషన్ షెడ్యూలు ప్రశ్నించకముందే జార్ఖండ్‌లో అధికార, ప్రతిపక్ష పార్టీలు వివిధ స్కీంల కింద ఇవ్వనున్న నగదును ప్రకటిస్తున్నాయి. బీజేపీ నాయకత్వం ఈ సారి ముందుగానే తాము గెలిస్తే నగదు సహాయాన్ని నెలకు రూ.2100 లు ఇస్తామని ప్రకటించింది. అధికారపార్టీ తాను పంపిణీచేస్తున్న రూ.1000లను రూ.2500కు పెంచడం వల్ల ముఖ్యంగా మహిళా ఓటర్లు పాలకులకు అనుకూలంగా ఉన్నారని వార్తలు వచ్చాయి.

ఎన్నికల ప్రణాళిలను చదివినట్లయితే మూడురకాల అంశాలున్నాయి. వీటిలో బీజేపీ సంకల్ప పాత్ర, ఇండియా ఐక్య సంఘటన న్యాయపాత్రను ప్రకటించాయి. ముఖ్యమంత్రి సోరేన్ ఇతర నాయకులు ప్రత్యేక ప్రణాళికను ప్రకటించారు. ప్రత్యేకించి మహిళలను దృష్టిలో ఉంచుకుని ఇండియా ఐక్యసంఘటన పేద కుటుంబాలకు గ్యాస్ సిలిండర్లను రూ.450కే సరఫరా చేస్తామని ప్రకటించింది. బీజేపీ ఇదే సమయంలో విద్యార్థులకు కిండర్‌గార్డెన్ నుంచి పోస్టు గ్రాడ్యుయేట్ వరకు ఉచితంగా చదువు చెప్పిస్తామని ప్రకటించింది. గర్భిణీలకు ఆరు న్యూట్రిషన్ కిట్లను, రూ.21వేల నగదును ఇస్తామని బీజేపీ ప్రకటించింది. ఇండ్లకు రెండు గ్యాస్ సిలిండర్ల చొప్పున ఒక సంవత్సరంపాటు ఉచితంగా ఇస్తామని పాలకపార్టీ ఎన్నికల ప్రణాళిక ప్రకటించింది. ఏడాది తర్వాత సిలిండర్ రూ.500కు ఇస్తామని ప్రకటించారు.

పాలించడానికే పుట్టిందన్న మనస్తత్వం

కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ

చిమూర్ (మహారాష్ట్ర): దేశాన్ని పాలించడానికే పుట్టిందన్నది కాంగ్రెస్ షాహీ పరివార్ మనస్తత్వం ఎప్పటి నుంచో ఉందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మంగళవారం అన్నారు. నవంబరు 20న జరగనున్న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముందు మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లాలోని చిమూర్‌లో జరిగిన ర్యాలీని ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ, స్వాతంత్ర్యానంతరం కాంగ్రెస్ దళితులు, వెనుకబడిన తరగతులు, ఆదివాసీలను పురోగమించకపోవడానికి కారణం ఇదేనని తెలిపారు. 'రిజర్వేషన్లపై కాంగ్రెస్ చిరాకు పడుతోంది. 1980లలో రాజీవ్ గాంధీ పార్టీకి నాయకత్వం వహించినప్పుడు దళితులు, వెనుకబడిన తరగతులు, ఆదివాసీలు అనుభవిస్తున్న ప్రత్యేక హక్కులపై ప్రశ్నలను లేవనెత్తుతూ ఒక ప్రకటనను ప్రచురించారు' అని మోదీ చెప్పారు. ఈ పాత ప్రకటనను సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఆ పార్టీ రిజర్వేషన్ వ్యతిరేక వైఖరిని ప్రతిబింబిస్తోందని మోదీ పేర్కొంటూ, మహారాష్ట్రలో బీజేపీ నేతృత్వంలోని మహాయుతి భారీ మెజారిటీతో అధికారాన్ని నిలుపుకుంటుందని అన్నారు. బీజేపీ సంకల్ప్ పాత్ర ఎన్నికల మేనిఫెస్టో మహారాష్ట్ర అభివృద్ధికి హామీ ఇస్తుందని మోదీ అన్నారు. కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దుపై మోదీ మాట్లాడుతూ దేశానికి ఒకే రాజ్యాంగం చేయడానికి ఏడు దశాబ్దాలు పట్టిందని తెలిపారు. కశ్మీర్‌లో ఆర్టికల్ 370ని తిరిగి తీసుకురావడానికి మీరు కాంగ్రెస్, దాని మిత్రపక్షాలను అనుమతిస్తారా అని ఆయన ప్రశ్నించారు. సోయాబీన్ రైతులకు బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తుందని మోదీ హామీ ఇచ్చారు.

మోదీ సభలు పెట్టిన స్థానాల్లో బీజేపీ ఓడింది: శరద్‌పవార్

జల్గావ్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ సభలు నిర్వహించిన చోటల్లా అక్కడ బీజేపీ ఘోరంగా ఓడిపోవడం ఖాయమని ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ ఎద్దేవా చేశారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా మహారాష్ట్రలో మోదీ ప్రచారసభలు నిర్వహించిన 10-12 స్థానాలను బీజేపీ కోల్పోయిందని తెలిపారు. చంద్రాపూర్ జిల్లాలోని చిమూర్, షోలాపూర్, పూణేలలో మోదీ మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న క్రమంలో పవార్ ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ... 'ఎన్నికల సభల్లో ప్రసంగించడం ప్రధానమంత్రి హక్కు. దానిపై పెద్దగా దృష్టి పెట్టాల్సిన అవసరం లేదు. అయితే ఒక విషయం గుర్తుంచుకోండి, లోక్‌సభ ఎన్నికల సమయంలో ప్రధాని 16 సభల్లో ప్రసంగించారు. బీజేపీ 10-12 స్థానాల్లో ఓడిపోయింది. కాబట్టి ఆయన్ను రానివ్వండి' అని ఒక ప్రశ్నకు సమాధానంగా పవార్ స్పందించారు. ఈ ఏడాది ప్రారంభంలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలో బీజేపీ సీట్ల సంఖ్య 2019లో సాధించిన 23 సీట్ల నుంచి 9కి పడిపోయింది.కుల ఆధారిత రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారంటూ మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) చీఫ్ రాజ్ థాక్రే చేసిన ఆరోపణలను పవార్ తోసిపుచ్చారు. 'అతను (థాక్రే) ఎన్నికలకు కొన్ని నెలల ముందు నోరు విప్పుతారు. కాబట్టి, నేను అతనిని సీరియస్‌గా తీసుకోను' అని పవార్ అన్నారు. మహారాష్ట్రలో నవంబర్ 20న జరగ నున్న అసెంబ్లీ ఎన్నికల్లో శివసేన-బీజేపీ- ఎన్సీపీతో కూడిన అధికార మహాయుతి కూటమి- ఎన్సీపీ (ఎస్పీ)-శివసేన (యూబీటీ), కాంగ్రెస్ లతో కూడిన విపక్ష కూటమి మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) మధ్య తీవ్ర పోటీ నెలకొంది.

జార్ఖండ్, బెంగాల్‌లో ఈడీ సోదాలు

రాంచీ: బంగ్లాదేశ్ పౌరుల అక్రమ చొరబాట్లకు సంబంధించిన మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మంగళవారం పశ్చిమ బెంగాల్‌తో పాటు జార్ఖండ్‌లోని వివిధ ప్రాంతాల్లో దాడులు నిర్వహించింది.

జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల మొదటి దశ పోలింగ్‌కు ఒక రోజు ముందు ఈడీ పెద్ద ఎత్తున సోదాలు చేపట్టడం చర్చనీయాంశమైంది. రెండు పొరుగు రాష్ట్రాల్లో మొత్తం 17 ప్రదేశాల్లో ఈడీ ప్రత్యేక బృందాలు ఏకకాలంలో తనిఖీలు చేపట్టాయి. రాంచీలోని బరియాతు రోడ్‌లో ఉన్న హోటల్, నగరంలోని ఒక రిసార్ట్‌లో ఈడీ బృందాలు నిర్వహణ డాక్యుమెంట్లు, లెడ్జర్‌ఎంట్రీలు, ఆర్థిక రికార్డుల కోసం సోదాలు చేపట్టిన సందర్భంగా పెద్ద ఎత్తున సీఆర్‌పీఎఫ్ బలగాలను మోహరించారు. కాగా నకిలీ ఆధార్ కార్డులు, నకిలీ పాస్‌పోర్ట్‌లు, అక్రమ ఆయుధాలు, స్థిరాస్తి పత్రాలు, నగదు, ఆభరణాలు, ప్రింటింగ్ పేపర్, మెషీన్‌లు ఉపయోగించిన ఖాళీ ప్రొఫార్మాలు వంటి వాటిని స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ మధ్యాహ్నం 3 గంటలకు 'ఎక్స్' ద్వారా ప్రకటించింది. జార్ఖండ్‌లోకి బంగ్లాదేశ్ మహిళల అక్రమ చొరబాటు, రవాణాకు సంబంధించిన ఆరోపణలకు సంబంధించి ఈడీ మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద సెప్టెంబరులో కేసు నమోదు చేసింది. ఇటీవలి ఎన్నికల ప్రచారంలో సంతాల్ పరగణా, కొల్హాన్ ప్రాంతాలలో గిరిజనుల ప్రాబల్యం ఉన్న ప్రాంతాల జనాభా స్వరూపాన్ని మార్చడానికి రాష్ట్ర ప్రభుత్వం అటువంటి చొరబాట్లకు సహాయం చేస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ సహా ఇతర బీజేపీ నాయకులు ఆరోపించారు. జార్ఖండ్‌ను రోహింగ్యాలు, బంగ్లాదేశ్ చొరబాటుదారులకు 'ధర్మశాల'గా మార్చిందని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సోమవారం అధికార జేఎంఎం-కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వంపై ఆరోపణలు గుప్పించారు. జార్ఖండ్‌లో బీజేపీని గెలిపిస్తే... రాష్ట్రంలోని చొరబాటుదారులను గుర్తించి, వారి నుంచి భూములు స్వాధీనం చేసుకుని తరిమికొట్టడానికి ఒక కమిటీని ఏర్పాటు చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోమవారం సెరైకెలాలో జరిగిన ఎన్నికల సభలో ప్రకటించారు.

ఎన్నికల వేళ బీజేపీకి సహాయపడేందుకే దాడులు: జేఎంఎం

తొలి దశ ఎన్నికలు జరగడానికి 24గంటల ముందు ఈడీ దాడులకు పాల్పడటం కుట్రపూరితమని అధికార జేఎంఎం పేర్కొంది. బంగ్లాదేశ్ నుంచి చొరబాట్లు జరుగుతున్నాయంటూ బీజేపీ నాయకులు చేస్తున్న ప్రచారానికి ఊతమిచ్చేందుకే సరిగ్గా పోలింగ్ జరగడానికి కొన్ని గంటల ముందు కేంద్రంలోని మోదీ సర్కారు ఈడీని ఉసిగొల్పిందని జేఎంఎం అధికార ప్రతినిధి మనోజ్‌పాండే పేర్కొన్నారు. "జార్ఖండ్‌లో పోలింగ్‌కు కేవలం ఒక రోజు ముందు ఈడీ చర్య తప్పుడు కథనాన్ని సృష్టించి... ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం తప్ప మరొకటి కాదు. ఎన్నికల్లో బంగ్లాదేశ్ చొరబాటు కథనాన్ని ప్రచారం చేయడంలో కాషాయ పార్టీకి సహాయపడే ప్రయత్నం ఇది' పాండే అన్నారు. జార్ఖండ్‌లోని 81 అసెంబ్లీ స్థానాలకు గానూ నలభై మూడు అసెంబ్లీ స్థానాలకు బుధవారం తొలి దశలో పోలింగ్ జరగనున్న సంగతి విదితమే. ఇక జార్ఖండ్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి రాకేష్ సిన్హా ఈడీ దాడులపై స్పందిస్తూ... ఈడీ దాడులు బంగ్లాదేశ్ చొరబాటుదారుల కోసం కాదని... రాష్ట్రంలో బీజేపీ రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి చేస్తున్న చివరి ప్రయత్నమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు ఈ కుట్రలన్నింటినీ అర్థం చేసుకున్నారని, ఎన్నికల్లో బీజేపీకి తగిన సమాధానం చెబుతారని ఆయన పేర్కొన్నారు. జార్ఖండ్ బంగ్లాదేశ్‌తో సరిహద్దును పంచుకోదని ఆయన చెప్పారు. "బీజేపీ పాలిత అసోం బంగ్లాదేశ్‌తో సరిహద్దును పంచుకుంటుంది. కాబట్టి వారు జార్ఖండ్‌కు బదులుగా మొదట అసోంలో దాడి చేయాలని నేను భావిస్తున్నాను" అని కాంగ్రెస్ అధికార ప్రతినిధి అన్నారు. అసోం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మను బీజేపీ జార్ఖండ్‌కు పంపి... ఓట్లు పొందాలని చూసినప్పటికీ అది విజయవంతం కాలేదని తెలిపారు. జార్ఖండ్ ఎన్నికలకు బీజేపీ కో-ఇన్‌ఛార్జ్‌గా ఉన్న శర్మ, బీజేపీ అభ్యర్థుల కోసం ప్రచారం చేస్తున్నారు.

మహారాష్ట్ర, షిర్పూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో మహా వికాస్ అగాధీ (ఎంవీయే) మద్దతుతో సీపీఐ తరపున బుద్ధ మాల పవ్రా బరిలో నిలిచారు. నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారాన్ని సాగిస్తున్నారు. బుద్ధ మాల పవ్రా మంగళవారం భారీ రోడ్‌షో, బహిరంగ సభ నిర్వహించగా షిర్పూర్ ప్రజల నుంచి విశేష ఆదరణ లభించింది. ఈనెల 20న పోలింగ్ జరగనున్న విషయం విదితమే.

దహనులో సీపీఎం విస్తృత ప్రచారం

పాల్ఘర్: నవంబరు 20న జరగనున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో తన ఏకైక కంచుకోట అయిన దహను (ఎస్‌టీ) స్థానాన్ని నిలుపుకునేందుకు సీపీఎం అనేక ర్యాలీలు, మహిళా కేంద్రీయ కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా విస్తృత ప్రచారం చేపట్టింది. ఈ ర్యాలీల్లో మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) నాయకులతో పాటు బృందా కారత్, ఇతర నేతలు ప్రసంగించనున్నారు. పాల్ఘర్ జిల్లాలోని గిరిజనులు అధికంగా ఉండే దహను నియోజకవర్గం నుంచి పార్టీ ఎమ్మెల్యే వినోద్ నికోల్ పేరును సీపీఎం తిరిగి ప్రతిపాదించింది. నవంబరు 10 నుంచి 17 వరకు దహనులో 21 బహిరంగ సభలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ పేర్కొంది. సీపీఎం చారిత్రాత్మకంగా దహను (గతంలో జవహర్) స్థానంలో ఆధిపత్యం చెలాయించింది. 1978 నుంచి ఐదు వేర్వేరు సీపీఎం అభ్యర్థులతో పదికి తొమ్మిది సార్లు విజయం సాధించింది. వార్లీ ఆదివాసీ తిరుగుబాటు (1945-1948) కేంద్రంగా ఈ ప్రాంత చరిత్రలో ఈ వారసత్వం పాతుకుపోయింది. ఇది స్థానిక జనాభాకు స్ఫూర్తినిస్తుందని సీపీఎం ఒక ప్రకటనలో పేర్కొంది. సీపీఎం ప్రచారంలో తలసరి, దహను తహసీల్‌లలో 14 బహిరంగ సభలు ఉన్నాయి. అదనంగా, దహను నియోజకవర్గం అంతటా గ్రామ సమావేశాలు కూడా ఏర్పాటు చేశారు. ప్రచారంలో పాల్గొనే వారిలో ఆల్ ఇండియా కిసాన్ సభ (ఏఐకేఎస్) అధ్యక్షుడు అశోక్ ధావలే, పార్టీ ఇతర సీనియర్ నాయకులు, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ సహా వామపక్ష సంస్థలు కూడా ఉన్నాయి. రాబోయే ఎన్నికల్లో మహారాష్ట్ర వ్యాప్తంగా సీపీఎం మూడు స్థానాల్లో... దహను, కల్వాన్ (రెండూ ఎస్టీ అభ్యర్థులకు రిజర్వు), షోలాపూర్ సిటీ సెంట్రల్‌లో పోటీ చేస్తుంది.

ప్రధానికి నియమాలు వర్తించవా: రౌత్

ముంబై: ఎన్నికల కమిషన్ తీరుపై శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ మండిపడ్డారు. కొందరు నేతల పట్ల ఈసీ పక్షపాతం చూపిస్తోందని ఆరోపించారు. మహారాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో ప్రచారాల్లో పాల్గొంటున్న సమయాల్లో నిర్వహించే తనిఖీ విధానాల్లో ఈసీ పక్షపాత ధోరణి ప్రదర్శిస్తోందని, ఇకనైనా పక్షపాత రహితంగా సోదాలు నిర్వహించాలని హితవు పలికారు. ఎన్నికల సందర్భంగా శివసేన యూబీటీ నేతల ఇళ్లు, బ్యాగులు, హోటళ్లు, హెలికాప్టర్లను మాత్రమే ఎన్నికల సంఘం అధికారులు తనిఖీ చేస్తున్నారని, అధికార కూటమికి చెందిన ప్రముఖ నాయకులకు సంబంధించిన విమానాల్లో సోదాలు చేయట్లేదని మండిపడ్డారు. ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్ షా తదితర నేతల హెలికాప్టర్లు ఎప్పుడైనా తనిఖీ చేశారా అని ఎన్నికల కమిషన్‌ను రౌత్ ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో ఇదే తరహాలో వారు 20-25 బ్యాగుల్లో నగదు ఉంచి హెలికాప్టర్లలో తరలించారని ఆరోపించారు. ఒడిశాలో ప్రధాని హెలికాప్టర్‌ను తనిఖీ చేసిన వ్యక్తిని సస్పెండ్ చేశారని, ఎన్నికల సంఘం పాటించే నిష్పాక్షిక న్యాయం ఇదేనా అని నిలదీశారు. అధికార పార్టీ నేతలు ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్, దేవేంద్ర ఫడ్నవీస్‌కు చెందిన హెలికాప్టర్లను ఈసీ తనిఖీ చేయట్లేదని దుయ్యబట్టారు. వారు పోటీ చేసే నియోజకవర్గాలకు ఇప్పటికే రూ.20-25 కోట్లు చేరిపోయాయని ఆరోపించారు. రాష్ట్రంలో జరుగుతున్న డబ్బు పంపిణీ ఈసీ అధికారులకు కనిపించట్లేదా అని సంజయ్ రౌత్ నిలదీశారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ థాక్రే బ్యాగును ఎన్నికల అధికారులు తనిఖీ చేయడంతో ఆగ్రహించిన థాక్రే సోదాలు చేస్తున్న అధికారులు నిజమైన వారో కాదో తెలుసుకోవడానికి ప్రజలు వారి జేబులు, గుర్తింపు కార్డులు తనిఖీ చేయాలని అన్నారు.

అగ్రనేతల బ్యాగులూ

తనిఖీ చేస్తాం: ఈసీ

న్యూఢిల్లీ: శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ థాక్రే బ్యాగు తనిఖీ విషయంపై కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాజీవ్ కుమార్ మంగళవారం స్పందించారు. దేశంలోని అగ్ర రాజకీయ నేతలకు సంబంధించిన హెలికాప్టర్లలో కూడా సోదాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారంగానే థాక్రే బ్యాగును పరిశీలించామన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలోనూ బీహార్‌లో కొందరు నేతలు ఇదే విధమైన ఆరోపణలు చేశారని, కానీ ఆ సమయంలో బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు సంబంధించిన విమానాలు, హెలికాప్టర్లు తనిఖీ చేశామని ఎన్నికల అధికారులు వెల్లడించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎటువంటి పక్షపాతం లేకుండా అందరు రాజకీయ నాయకుల హెలికాప్టర్‌లు తనిఖీ చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలకు ఆదేశాలు ఇచ్చామన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారం కోసం యవత్మాల్‌కు వచ్చినప్పుడు ఎన్నికల అధికారులు తన బ్యాగ్‌ని తనిఖీ చేశారని ఉద్ధవ్ థాక్రే సోమవారం పేర్కొన్నారు. శివసేన (యూబీటీ) నేతల ఇళ్లు, బ్యాగులు, హోటళ్లు, హెలికాప్టర్లను మాత్రమే ఎన్నికల సంఘం అధికారులు తనిఖీ చేస్తున్నారని, అధికార కూటమికి చెందిన ప్రముఖ నాయకుల విషయంలో ఈ నిబంధనలు పాటించట్లేదని ఆరోపించారు. అధికారుల చర్యలను శివసేన (యూబీటీ), ఇతర ప్రతిపక్ష నేతలు ఖండించారు.

జార్ఖండ్ మహిళలకు రూ.2,500 గౌరవ వేతనం: రాహుల్

న్యూఢిల్లీ: ఇండియా ఐక్యసంఘటన మహిళలకు, రైతులకు బీజేపీ తన బిలియనీయర్ స్నేహితులకు ఇచ్చినదాని కంటే అధికంగా చెల్లిస్తుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. జార్ఖండ్‌లోని కూటమి ప్రభుత్వం మహిళలకు ఇచ్చే గౌరవ వేతనం రూ.2,500కు పెంచాలని నిర్ణయించిందని...ఇది వారి అవసరాలను తీరుస్తుందని రాహుల్ పేర్కొన్నారు. జార్ఖండ్‌లో బుధవారం తొలిదశ పోలింగ్ జరగనున్న క్రమంలో ఎన్నికలకు ఒకరోజు ముందు మంగళవారం రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదిక మహిళలకు ఇచ్చిన హామీని పునరుద్ఘాటించారు. 'నిన్న మైయియా సమ్మాన్ యోజనకు సంబంధించి నాల్గవ విడత సొమ్ము జార్ఖండ్‌లోని తల్లులు, సోదరీమణుల ఖాతాలకు జమ చేయబడింది. ఈ పథకం ముఖ్యంగా మహిళలు ద్రవ్యోల్బణంతో పోరాడటానికి, ఆత్మగౌరవంతో జీవించడానికి సహాయపడుతుంది. అందుకే మేము ఈ పథకం కింద ఇచ్చే మొత్తాన్ని మరింత పెంచాలని నిర్ణయించుకున్నాము' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. డిసెంబర్ 2024 నుండి ఈ పథకం కింద జార్ఖండ్‌లోని 53 లక్షల మంది మహిళలకు రూ.2,500 గౌరవ వేతనం ఇవ్వనున్నట్లు రాహుల్ స్పష్టం చేశారు. "నేను ఇంతకు ముందే చెప్పాను . మళ్లీ ఇప్పుడు చెబుతున్నాను. ఇండియా కూటమి మహిళలు, యువత, రైతులు, పేదలకు వారి అవసరాలను తీర్చడానికి బీజేపీ తన బిలియనీర్ స్నేహితులకు ఇచ్చిన దానికంటే ఎక్కువ డబ్బు ఇస్తుంది" అని రాహుల్ చెప్పారు. 81 మంది సభ్యులున్న జార్ఖండ్ అసెంబ్లీకి నవంబర్ 13, నవంబర్ 20 తేదీల్లో రెండు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. కాంగ్రెస్-జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) కూటమి అధికారాన్ని నిలబెట్టుకోవాలని ప్రయత్నిస్తుండగా...ఎన్నికల్లో అధికార కూటమిని గద్దె దించాలని బీజేపీ ప్రయత్నిస్తోంది.

బీజేపీని కుక్కలతో పోల్చే సమయం ఆసన్నం

మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు పటోలే

ముంబై: ఓబీసీలంటే బీజేపీకి ఏమాత్రం గౌరవం లేదని, ఆ పార్టీ నేతలు ఓబీసీలను కుక్కలతో పోల్చుతున్నారని మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు నానా పటోలే ఆరోపించారు. ఇప్పుడు బీజేపీని కుక్కతో పోల్చే సమయం ఆసన్నమైందని వ్యాఖ్యానించారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా అకోలాలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. బీజేపీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. మహారాష్ట్రలోని మహావికాస్ అఘాడీ ప్రభుత్వాన్ని బీజేపీ నేతలు కుట్ర పన్ని కూలగొట్టారని ఆరోపించారు. బీజేపీ నేత, ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ తనను తాను దేవుడుగా భ్రమపడుతున్నారని విమర్శించారు. ఓబీసీ కమ్యూనిటీపై బీజేపీకి ఏమాత్రం గౌరవం లేదన్న ఆయన... మిమ్మల్ని కుక్కలు అంటున్న బీజేపీకి ఓటేస్తారా అని ఓబీసీ ఓటర్లను ప్రశ్నించారు. మహారాష్ట్ర నుంచి బీజేపీని పారదోలే సమయం ఆసన్నమైందని చెప్పారు. అబద్ధాలతో బీజేపీ అధికారంలోకి వచ్చిందని, ఇపుడు దాని స్థానమేంటో చెప్పే సమయం దగ్గరపడిందని పేర్కొన్నారు. బీజేపీ నేతలు తమను తాము దేవుళ్లుగా, విశ్వగురువులుగా అనుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

కుదిరితే బాబా సిద్ధిఖీ... లేకుంటే జిషాన్ సిద్ధిఖీ

బిష్ణోయ్ ఆదేశించినట్లు నిందితుడి వెల్లడి

ముంబై: మాజీ మంత్రి, ఎన్సీపీ సీనియర్ నేత బాబా సిద్ధిఖీ హత్య కేసుకు సంబంధించి ప్రధాన నిందితుడు శివకుమార్ పోలీసులకు అనేక విషయాలు వెల్లడించారు. కుదిరితే బాబా సిద్ధిఖీని... లేకుంటే ఆయన కుమారుడు జిషాన్ సిద్ధిఖీని చంపేయాలని గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ సోదరుడు అన్మోల్ బిష్ణోయ్ తనను ఆదేశించినట్లు నిందితుడు పోలీసులకు చెప్పినట్లు తెలుస్తోంది. పోలీసు వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం... 'ఎవర్ని ముందు చూస్తే వారిని కాల్చేయండి' అని అన్మోల్ బిష్ణోయ్ తనను ఆదేశించినట్లు నిందితుడు శివకుమార్ పేర్కొన్నాడు. దేవుడు, సమాజం కోసమే తాను ఇదంతా చేస్తున్నట్లు అన్మోల్ చెప్పినట్లు నిందితుడు వెల్లడించాడు. హత్యానంతరం నిందితుడు చొక్కా మార్చుకొని ఆటోలో థానే లోకల్ రైలు ఎక్కి పూణే పారిపోయాడు. ఆ తర్వాత ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీ, లక్నో, బహ్రాయిచ్‌లలో తలదాచుకున్నాడు. దేశం విడిచి కూడా వెళ్లిపోవాలనుకున్నాడు. అంతకుముందు ఉజ్జయిని, వైష్ణోదేవీ ఆలయాలను సందర్శించాలని భావించినట్లు విచారణలో వెల్లడైంది. షూటర్‌తో పాటు అరెస్టయిన ఓ వ్యక్తి సెల్‌ఫోన్‌లో జిషాన్ సిద్ధిఖీ ఫొటో కనిపించింది. అక్టోబరు 12న బాబా సిద్ధిఖీ ముంబైలోని తన కుమారుడి కార్యాలయంలో ఉండగా... కొందరు దుండగులు ఆయనపై కాల్పులకు పాల్పడిన విషయం తెలిసిందే.

'మత' బీజేపీని ప్రజలు తిరస్కరించారు

- విద్యార్థుల ఆగ్రహంతో ఇళ్లల్లో దాక్కున్న కాషాయ నేతలు
- యూపీపీఎస్సీ వివాదం నడుమ అఖిలేశ్ యాదవ్

లక్నో: మతతత్వ రాజకీయాలను కొనసాగిస్తున్న బీజేపీని తిరస్కరిస్తూ ప్రజలు రోడ్డెక్కారని సమాజ్‌వాది పార్టీ (ఎస్‌పీ) అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ మంగళవారం అన్నారు. బీజేపీని గద్దె దించినప్పుడే ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. రివ్యూ ఆఫీసర్ (ఆర్‌వో), అసిస్టెంట్ రివ్యూ ఆఫీసర్ (ఏఆర్‌వో) ప్రొవిన్షియల్ సివిల్ సర్వీస్ (పీసీఎస్) ప్రిలిమినరీ పరీక్షలను వేర్వేరు తేదీల్లో నిర్వహించాలని ఉత్తర ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీపీఎస్సీ) తీసుకున్న నిర్ణయంపై ప్రయాగ్‌రాజ్‌లో ఆశావహుల నిరసనల మధ్య అఖిలేశ్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'అన్యాయమనే బుల్‌డోజర్‌ను నడుపుతున్న బీజేపీ అదే తీవ్రతతో పరిపాలించి ఉంటే, నేడు ఆ కాషాయ పార్టీ నాయకులు విద్యార్థుల ఆగ్రహానికి భయపడి తమ ఇళ్లలో దాక్కోవాల్సిన అవసరం ఉండేది కాదు' అని ఆయన అన్నారు. 'సంవత్సరాలుగా ఖాళీలను వెల్లడించలేదు. పరీక్ష ప్రక్రియ ఆలస్యం అవుతుంది. బీజేపీ విద్యార్థులను వారి చదువుల నుంచి మరల్చింది. వీధుల్లో నిరసన తెలపడానికి వారిని బలవంతం చేసింది' అని ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి 'ఎక్స్' లో ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు. సోమవారం ప్రయాగ్‌రాజ్‌లోని యూపీపీఎస్సీ ప్రధాన కార్యాలయాన్ని ఆశావహులు ముట్టడించారు. పెద్ద సంఖ్యలో పోలీసు సిబ్బంది వారిని చెదరగొట్టడానికి ప్రయత్నించారు. కార్యాలయం, చుట్టుపక్కల మోహరించిన పోలీసులు విద్యార్థులను గేట్ నంబర్-2కు చేరుకోకుండా ఆపడానికి ప్రయత్నించారు. అయితే పెద్ద సంఖ్యలో ప్రజలు యూపీపీఎస్సీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 'వారు లాఠీఛార్జ్ చేశారు. ఉద్యోగాలు ఇప్పటికీ వారి అజెండాలో లేవు. మాకు పనికిరాని ప్రభుత్వం వద్దు' అని అఖిలేశ్ అన్నారు. విద్యావంతులు, ఉపాధి కలిగిన మధ్యతరగతి ప్రజలు ఇకపై 'బీజేపీ భావోద్వేగానికి' ఊగిపోరు' అని తెలిపారు. ఒకప్పుడు వాట్సాప్ గ్రూపుల్లో బీజేపీ తప్పుడు ప్రచారానికి బలైన తల్లిదండ్రులు కూడా తమ అధికారాన్ని పొందేందుకు, నిలబెట్టుకునేందుకు తమను మానసికంగా ఎలా ఉపయోగించుకుందో ఇప్పుడు గ్రహించారని ఆయన పోస్ట్‌లో పేర్కొన్నారు. 'ఇప్పుడు ఈ ప్రజలు కూడా బీజేపీ విభజన, మత రాజకీయాలను తిరస్కరించారు. 'కలిసే సానుకూల రాజకీయాలను' స్వీకరిస్తున్నారు. ఇకపై బీజేపీకి మానసిక బానిసలుగా ఉండేందుకు ఎవరూ సిద్ధంగా లేరన్నారు. కాగా, యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం 'బుల్డోజర్ రాజకీయాలను' ఇండియా ఐక్య సంఘటనతో పొత్తు పెట్టుకున్న అఖిలేశ్ యాదవ్ నిలదీశారు. ఐక్య సంఘటనతో బీజేపీ నాయకులు భయభ్రాంతులకు గురయ్యారని అన్నారు. దీంతో బీజేపీ సభ్యుల ఇళ్లు, దుకాణాలు, సంస్థలు, వాహనాల నుంచి బీజేపీ జెండాలు తొలగించారని తెలిపారు. బీజేపీ ప్రతికూల రాజకీయాలకు, తప్పుడు కథనాలకు కాలం చెల్లిందని ఆయన అన్నారు.

విద్యార్థుల ఆందోళన తీవ్రమైనదే: బీజేపీ

ఇదిలాఉండగా, విద్యార్థుల ఆందోళనలు 'తీవ్రమైనవి, ముఖ్యమైనవి' అని యూపీ ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య అన్నారు. సమర్థులైన అధికారులందరూ విద్యార్థుల డిమాండ్లను సున్నితంగా ఆలకించి సత్వర పరిష్కారం చూపాలని 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు.

ఒకేసారి పరీక్షలు నిర్వహించలేని స్థితా

రాష్ట్ర ప్రభుత్వం ఇంత కష్టపడి ఒకే తేదీన పరీక్షలు నిర్వహించలేని పరిస్థితిలో ఉందా అని బహుజన్ సమాజ్ పార్టీ అధినేత్రి మాయావతి ప్రశ్నించారు. పేపర్ లీక్‌లను ఆపడం, పరీక్షల విశ్వసనీయత ముఖ్యమైన అంశాలని, దీని కోసం ఒకేసారి పరీక్షలను నిర్వహించడం అవసరమని, ప్రభుత్వం దీనిపై దృష్టి సారించాలని ఆమె 'ఎక్స్'లో తెలిపారు. పేదరికం, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి సమస్యలతో సతమతమవుతున్న విద్యార్థుల పట్ల ప్రభుత్వ వైఖరిపై దళిత నాయకురాలు మండిపడ్డారు. 'ప్రభుత్వం అన్ని బ్యాక్‌లాగ్‌ల ఖాళీల కోసం నియామక ప్రక్రియను ఎంత త్వరగా పూర్తి చేస్తే అంత మంచిది. ప్రజలకు ఉపాధి చాలా అవసరం' అని మాయావతి అన్నారు.

రోజుకో బెదిరింపు... వణుకుతున్న దిల్లీ వ్యాపారులు

న్యూదిల్లీ: రోజుకో బెదిరింపు కాల్ వస్తుండడంతో దిల్లీ వ్యాపారులు వణికిపోతున్నారు. బడా వ్యాపారులు లక్ష్యంగా విదేశాల్లోని గ్యాంగ్‌స్టర్లు, వారి అనుచరులు బెదిరింపులకు పాల్పడుతున్నారని పోలీసులు పేర్కొన్నారు. బిల్డర్లు, స్థిరాస్తి వ్యాపారులు, నగలు, మిఠాయి దుకాణాలు, కార్ల షోరూం యజమానులకు ఎక్కువగా బెదిరింపులు వస్తున్నాయన్నారు. ఈ ఏడాది అక్టోబర్ నాటికే ఇలాంటి కాల్స్ 160 వరకు వచ్చినట్లు వెల్లడించారు. కొందరు వ్యాపారుల కార్యాలయాలు, ఇళ్లపైనా దుండగులు కాల్పులకు పాల్పడుతుండటంతో వారు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారని పోలీసులు తెలిపారు. ఇటీవల రోహిణి ప్రాంతంలోని ఓ వ్యాపారికి చెందిన షోరూమ్‌లోకి ముగ్గురు వ్యక్తులు చొరబడి గాల్లో కాల్పులు జరిపారని, యోగేశ్ దహియా, ఫజ్జే భాయ్‌కు రూ.10 కోట్లు ఇవ్వాలని రాసి ఉన్న నోట్‌ను అక్కడ వదిలివెళ్లారని అన్నారు. మరో కేసులో నంగ్లోయ్‌లోని జిమ్ యజమాని నుంచి రూ.7 కోట్లు డిమాండ్ చేస్తూ అంతర్జాతీయ నంబర్ నుంచి కాల్ వచ్చిందని, దీనిని లారెన్స్ బిష్ణోయ్ సహచరుడు, గ్యాంగ్‌స్టర్ దీపక్ బాక్సర్ అనుచరులుగా దుండగులు తమని తాము పేర్కొన్నారని పోలీసులు తెలిపారు. బెదిరింపులకు పాల్పడేవారిని పట్టుకునేందుకు ప్రత్యేక విభాగం, క్రైమ్ బ్రాంచ్‌లు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసినట్లు పేర్కొన్నారు. కొంతకాలంగా దేశ రాజధానిలోని వ్యాపారులను బెదిరిస్తూ, హత్యలకు పాల్పడుతున్న 11 ముఠాలను గుర్తించామన్నారు. వీటిలో లారెన్స్ బిష్ణోయ్-గోల్డీ బ్రార్, హిమాన్షు భౌ, కపిల్ సాంగ్వాన్ అలియాస్ నందు, జితేందర్ గోగి-సంపత్ నెహ్రా, హషీమ్ బాబా, సునీల్ టిల్లు, కౌశల్ చౌదరి, నీరజ్ ఫరీద్‌పురియా వంటి గ్యాంగ్‌లు ఉన్నాయని తెలిపారు.

విశాలాంధ్ర హైదరాబాద్

జలమండలి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు నరేందర్ రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న జలమండలి ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు నరేందర్ రెడ్డి అన్నారు. ఐ.ఎన్.టి.యు.సి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు, జలమండలి కాంగార్ యూనియన్ అధ్యక్షులు మొగుళ్ళ రాజి రెడ్డి నేతృత్వంలో యూనియన్ అసోసియేట్ ప్రెసిడెంట్ బి.భూమయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ కె. రామ రాజు, ప్రధాన కార్యదర్శి సి.హెచ్. సురేష్ బాబు, చీఫ్ వైస్ ప్రెసిడెంట్ ఆర్. సీత్యా, కోశాధికారి టీ.సురేష్, నాయకులు రగునాథ్, ఎన్.నరేందర్, జంగారెడ్డి, గణేష్‌రావు, సంజీవ, బాలరాజు, సరేందర్ తదితరులు మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు వెం.నరేందర్‌రెడ్డిను కలసి వినతిపత్రం అందజేశారు. జలమండలి ఉద్యోగులకు ప్రభుత్వ ఫ్రీ హెల్త్ కార్డులు మంజూరు, ఖాళీగా ఉన్న దాదాపు 3000 పోస్టుల భర్తీ, జెటీఓ (క్యూఏటీ) నుండి ఏటీఓ (క్యూఏటీ), అప్ గ్రేడేషన్, ఎన్.మ్.ఆర్, హెచ్.ఆర్ మహిళా ఉద్యోగుల పర్మనెంట్ మరియు ఔటసోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్దీకరణ వంటి సమస్యలను వెం.నరేందర్ రెడ్డికు వివరించి, ఈ సమస్యలను ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరలో పరిష్కరించాలని మొగుళ్ళ రాజి రెడ్డి కోరారు. ప్రభుత్వంతో చేర్చించి జలమండలి ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరి స్తానని ఈ సందర్భంగా వారికి వెం.నరేందర్ రెడ్డి హామీ ఇచ్చారు. అనం తరం మొగుళ్ళ రాజి రెడ్డి మీడియాతో మాట్లాడుతూ గత 11 సంవత్సరాలుగా జలమండలి కాంగార్ యూనియన్ అనేక పోరాటాలు చేసిన పెండింగ్‌లో ఉన్న జలమండలి ఉద్యోగుల ఏఒక్క సమస్య పరిస్కారం కాలేదని విమర్శించారు. జలమండలి ఉద్యోగుల అనేక సమస్యల పరిస్కారంతోపాటు వేలమంది తాత్కాలిక ఉద్యోగులను పర్మనెంట్ చేసిన ఘనత గత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని గుర్తు చేసారు. మానవతా దృక్పథంతో ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి వెంటనే జలమండలి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని అయన విజ్ఞప్తి చేసారు.

జర్నలిస్టులకు వెంటనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించే ప్రక్రియను ప్రారంభించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈమేరకు ఆసంఘం రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలు, కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చిన ప్రకారం జేఎన్‌జే సొసైటీకి ఇండ్లస్థలాలకు సంబంధించిన ఉత్తర్వులు ఇచ్చినందుకు దన్యవాదాలు తెలియజేశారు. కాగా దాదాపు 40 ఏండ్లుగా జర్నలిస్టులు ఇండ్లస్థలాల కోసం ఎదురుచూస్తున్నారని సీఎం రేవంత్రెడ్డికి గుర్తుచేశారు. హైదరాబాద్ తోపాటు ఆయా జిల్లాలు, మండలాల్లో ఇంకా వేలాది మంది జర్నలిస్టులకు ఇండస్థలాలు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కొందరికి హౌసింగ్ సొసైటీల్లో సభ్యత్వం ఉందనీ, మరికొందరికి లేదన్నారు. వీరందరి కోసం ప్రభుత్వం ప్రత్యేక విధానం ద్వారా ఇండ్లస్థలాలు కేటాయించాలని సూచించారు. జర్నలిస్టులు ఇప్పటికే ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటూ సామాజిక బాధ్యతలు (సోషల్ రెస్పాన్సిబులిటీ) నిర్వహిస్తున్నారని చెప్పారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో జర్నలిస్టులు కీలకపాత్ర పోషిస్తున్నారని వివరించారు. ఈనేపథ్యంలో మ్యానిఫెస్టో ప్రకారం ఇండ్లస్థలాలు ఇవ్వాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు. రెండోసారి గెలిచాక ఇస్తామనం న్యాయం కాదని తెలిపారు. వెంటనే ఫ్యూచర్ సీటీలో స్థలాల గుర్తింపు ప్రక్రియ చేపట్టాలని కోరారు.

దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

డీజీపీని కోరిన తెలంగాణ ఉద్యోగుల జేఏసీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : అధికారులపై భౌతికంగా దాడి చేసి గాయపర్చినప్పుడు నోరు మెదపని వారు.. దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేస్తే ఖండించడం ఎంత వరకు సరైనదని తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి ప్రశ్నించారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం పని చేసే ఉద్యోగులపై దాడులు చేస్తే సరైన పద్ధతి కాదన్నారు. వికారాబాద్ జిల్లాలో అధికారులు, ఉద్యోగులపై సోమవారం జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్టుగా తెలిపారు. తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు మంగళవారం రాష్ట్ర డీజీపీ జితేందర్‌ను కలిసి వికారాబాద్ జిల్లా, దుద్యాల మండలం, లగచర్ల గ్రామంలో అధికారులపై జరిగిన దాడిపై సమగ్ర దర్యాప్తు జరిపించి దాడికి పాల్పడిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రాన్ని అందచేశారు. గ్రామంలో ఫార్మా కంపెనీ విషయమై ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, కడా ప్రత్యేకాధికారి, తహశీల్దార్, ఇతర అధికారులపై కొందరు రైతుల ముసుగులో పథకం ప్రకారమే దాడి చేసినట్టుగా కనిపిస్తుందన్నారు. దాడి చేసిన వారిని, దాడి వెనుకాల ఉన్న వారిని గుర్తించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరారు. దీనిపై డీజీపీ సానుకూలంగా స్పందించారన్నారు. దాడికి పాల్పడిన వారు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తిలేదని పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్టుగా డీజీపీ చెప్పారని జేఏసీ నాయకులు తెలిపారు. అనంతరం రాష్ట్ర సచివాలయంలోని మీడియా సెంటర్‌లో విలేకరులతో ఛైర్మన్ లచ్చిరెడ్డి, ఇతర నాయకులు మాట్లాడారు. అధికారులపై భౌతిక దాడులు చేసే సంస్కృతిని ఎవరూ కూడా సహించరన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు కె.రామకృష్ణ, ఎస్.రాములు, రమేష్ పాక, సెక్రటరీ జనరల్ ఫూల్‌సింగ్ చౌహాన్, రాధ, తెలంగాణ నిర్మల, చంద్రశేఖర్‌గౌడ్, రాబర్ట్ బ్రూస్, పుష్పలత, తిరుపతి, విజయ్‌కుమార్, హరీందర్‌సింగ్ పాల్గొన్నారు.

ఘనంగా సదర్ మహోత్సవం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలో అఖిలభారత యాదవ్ సంగం, పోతర్ల అంబయ్య యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా సదర్ మహోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్య యాదవ్, పరిగి కంటెస్టెడ్ ఎమ్మెల్యే బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు భేరి రామచందర్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సదర్ పండుగ ఐక్యమత్యానికి చిహ్నమన్నారు. సీనియర్ బిజెపి నాయకులు కటారి జంగయ్య యాదవ్, యాదవ్ సంఘం అధ్యక్షులు బొజ్జం చంద్రయ్య యాదవ్, కర్రోళ్ల చంద్రయ్య ముదిరాజ్, కాకి కుమార్ యాదవ్, దుద్దు కృష్ణ యాదవ్, జిల్లా నాగేష్ యాదవ్, మేకల శ్రీనివాస్ యాదవ్, మేకల సందీప్ యాదవ్, చేతారం పర్వతాలు యాదవ్, తెజ్జీరి శ్రీశైలం యాదవ్ తెజ్జీరి లక్ష్మయ్య యాదవ్, జోగోరి మల్లేష్ యాదవ్, గోవర్ధన్ యాదవ్, శ్రీశైలం యాదవ్, పర్వతాలు యాదవ్, మిద్దేటి యాదయ్య యాదవ్, ఆశన్న మల్లేష్ యాదవ్ బాలయ్య యాదవ్, పోల్కం బాలయ్య యాదవ్, పాండు యాదవ్, మల్లేష్ యాదవ్, జోగోరి పర్వతాలు యాదవ్, యాదవ్ సంగం పెద్దలు యోజన నాయకులు సంఘం సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని మోస కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

పెండింగ్ బిల్లుల విడుదలకు అంగీకారం

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) గౌరవాధ్యక్షురాలు డి.కమలా రెడ్డి, అధ్యక్షురాలు పి.ప్రేంపావని, ఉపాధ్యాయ సంఘం నేత సదానంద గౌడ్ ప్రతినిధివర్గం నేడు రాష్ట్ర ఉన్నత పాఠశాల విద్యాశాఖ కమీషనర్ ఇ.వి.నర్సింహ్మా రెడ్డి ఐఎఎస్‌ని కలిసి వంట కార్మికుల సమస్యలపై వినతి పత్రం సమర్పించటం జరిగింది. ప్రధానంగా గత ఫిబ్రవరి పెండిరగ్‌లో ఉన్న 9,10 తరగతుల విద్యార్థులకు ఇచ్చే కోడిగుడ్ల బిల్లులను సత్వరం విడుదల చేయాలని కమీషనర్‌ని కోరటం జరిగింది. ఈ సమస్యపై కమీషనర్ సానుకూలంగా స్పందిస్తూ 9,10 తరగతుల కోడిగుడ్ల పెండిరగ్ బిల్లుల చెల్లింపునకు పై అధికారులకు సిఫారసు చేసినట్లు తెలిపారు. త్వరలోనే బిల్లులు విడుదలవుతాయని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం మ్యానిఫెస్టోలో వంట కార్మికులకు 10వేల వేతనం ఇస్తామన్న విషయమై ప్రస్తావించగా ప్రభుత్వ పరిధిలో నిర్ణయం చేయాల్సి వుంటుందని తెలిపారు. మొత్తం పెండిరగ్ బిల్లుల కోసం 54 కోట్ల రూపాయలను విడుదల చేశామని, సెప్టెంబర్ వరకు బిల్లులు క్లియర్ చేయటం జరిగిందని అన్నారు. అదే విధంగా అల్పాహారం గత జూన్ నెల నుండి ప్రభుత్వం నిలిపివేసిందని ఎక్కడ్కైనా అధికారులు అల్పాహారం కోసం ఒత్తిడి చేస్తే తమ దృష్టికి తేవాలన్నారు. ఇతర సమస్యలను పరిశీలిస్తామన్నారు.

కల్వర్ట్ పనులు పూర్తి చెయ్యాలి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ లోగల లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వరద ముంపు సమస్య శాశ్వత పరిష్కారం దిశగా యుద్ధప్రతిపాదకన చేపడుతున్న బాక్స్ కల్వర్ట్ వరద నీటి కాల్వ నిర్మాణం పనులలో భాగంగా జిహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు ఈఈ దుర్గా ప్రసాద్, డీఈ ఆనంద్, ఏఈ భాస్కర్‌లతో కలిసి శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ కల్వర్ట్ పనులను పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ లింగంపల్లి అండర్ బ్రిడ్జి వరద నీటితో నిండి పోవడం వలన పరిసర ప్రాంత వాహనదారులకు, ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అండర్ బ్రిడ్జి నుండి వరద నీటి కాల్వ, బాక్స్ కల్వర్ట్ నిర్మాణం పనులు చేపడుతున్నామన్నారు. పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చి ముంపు సమస్య పునరావృతం కాకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. కొయ్యాడ లక్ష్మణ్ యాదవ్, గోపాల్ యాదవ్, సురేష్ రాథోడ్, శ్రీనివాస్, వెంకటేష్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు చెల్లించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ వేతనాల జీవో నెంబర్ 60 ప్రకారం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, బాలనగర్ సిహెచ్ సిలలో చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషంట్ కేర్ సూపర్వైజర్ కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం జడ్చర్ల ఏరియా ఆసుపత్రిలో జిల్లా వైద్య సమన్వయ అధికారిని డాక్టర్ చంద్రకళకి, ఆసుపత్రి ఆర్ఎం ఓ డాక్టర్ ఎస్ హరినాథ్‌కి డిమాండ్ నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ మాట్లాడుతూ తెలంగాణ వైద్య విధాన పరిషత్‌కి సంబంధించిన జడ్చర్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, బాల్ నగర్ ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో సంబంధిత పారిశుద్ధ్య భద్రత పేషంట్ సంరక్షణ నిర్వహణ చూసే వెంకటయ్య సెక్యూరిటీ సర్వీసెస్ ఏజెన్సీ, శాంతి ఏజెన్సీ కాంట్రాక్టర్లు కార్మికులకు వైద్య విధాన పరిషత్ కమిషనర్ ఆదేశాలను, జీవో నెంబర్ 60ని బేఖాతర చేస్తూ అసంబద్ధ పద్దతిలో వేతనాలు చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జడ్చర్లలో 10,500 చెల్లిస్తున్నారని వాస్తవంగా జీవో నెంబర్ 60 ప్రకారం కమిషనర్ ఆదేశాలనుసారం 12093 రూపాయలు కార్మికులకు వేతనం కింద చెల్లించాలని, 26 రోజుల పని దినాలకు కార్మికుని యజమాని వాటలు కలిపి పిఎఫ్ 25శాతం మేరకు రూ. 3023, 489 రూపాయల ఈఎస్ఐ జమ చేయాలని కానీ అమలు కావడం లేదని వాపోయారు. కనుక కార్మికులు వేతనాల ఆర్థిక దోపిడిని భరించలేక విధి లేని పరిస్థితుల్లో సమ్మె నోటీసులు అందజేస్తున్నామని తెలిపారు. అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరింపజేసి సమ్మెను విరమించేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నేత బాగి కృష్ణ యాదవ్,ఆస్పత్రి బ్రాంచ్ మెడికల్ ఏఐటియుసి యూనియన్ నాయకులు, కార్మికులు నరసింహ, శేఖర్, రాజేష్ , వినయ్,పేర్మల, విజయలక్ష్మి, మన్నెమ్మ, శివ లీల, పద్మ, అలివేల, స్వాతి, భార్గవి, రజినీ, నరసమ్మ, సుక్కమ్మ, అలివేల,యాదమ్మ, సత్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళ అంటే అబల కాదు సబల :ఎమ్మెల్యే

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహిళ అంటే అబల కాదు సబల అని నిరూపించాలని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మహబూబ్ నగర్ ఫస్ట్‌లో కంప్యూటర్, టైలరింగ్ మరియు బ్యూటీషన్ కోర్సులకు 240 మంది విద్యార్థులతో శిక్షణా తరగతులను ప్రారంభిస్తున్న సందర్భంగా ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఎమ్మెల్యేని అభినందించారు. అనంతరం చిన్నారెడ్డి మాట్లాడుతూ యెన్నం శ్రీనివాస్ రెడ్డి మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, ఒక మంచి ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ మహబూబ్ నగర్ ఫస్ట్ ఎందరో జీవితాల్లో వెలుగులు నింపాలని అన్నారు. జనాభాలో సగభాగం ఉన్న మహిళలకు మంచి భవిష్యత్తు కోసం ఎమ్మెల్యే పడుతున్న తపన చాలా సంతోషాన్ని కలిగించిందని, ఇక్కడ శిక్షణ పొందేందుకు వచ్చే ప్రతి ఒక్కరూ అభివృద్ధి లోకి రావాలని ఆయన ఆకాంక్షించారు. అంతకు ముందు మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సెట్విన్ సంస్థ సహకారంతో ఈ రోజు మూడు ట్రేడ్ లలో మొత్తం 240 మందికి. మూడు నెలల పాటు స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ తరగతులను ఇవ్వడం జరుగుతుందన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

మత్స్యకారుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం నాడు కోడూరు చెరువు లో ప్రత్యేక పూజలు నిర్వహించి, చేపలు విడిచారు. అనంతరం మత్స్యకారులకు చేపలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం మంచి వర్షాలు కురిశాయని, చెరువులన్నీ కూడా నిండుకుండలా ఉన్నాయని ఈరోజు విడిచే చేపలు మంచి రాబడి ఇవ్వాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎన్.పి.వెంకటేష్ , జిల్లా మత్సకారుల సంఘం అధ్యక్షులు గంజి ఆంజనేయులు, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, రామచంద్రయ్య, పి నర్సింలు, విజయ్ కుమార్, నాగన్న, లక్ష్మయ్య, చెన్నయ్య రామాంజనేయులు, శ్రీనివాస్ యాదవ్, ధర్మాపూర్ నర్సింహారెడ్డి, పోతన్ పల్లి మోహన్ రెడ్డి, జె.గోపాల్, గోవింద్ యాదవ్, తెలుగు గూడెం ఆంజనేయులు, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ కుట్టుమిషన్ శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్స్ అందజేత

విశాలాంధ్ర - హైదరాబాద్ : శారదా నికేతన్ మహిళా మండలి ఆధ్వర్యంలో కంప్యూటర్ కుట్టుమిషన్ సెంటర్లో శిక్షణ పొందిన విద్యార్థినీలకు సర్టిఫికెట్ అందజేత కార్యక్రమంలో మహిళా నాయకులు పశ్య కన్నమ్మ, జూలకంటి అరుణ, పశ్యపద్మ, తెలంగాణ రాష్ట్ర మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పుస్తెల సృజన, జిల్లా నాయకురాలు దేవర మల్లీశ్వరి, ఉమా, దొంతి రెడ్డి ప్రమీల, లలిత వర్మ తదితరులు పాల్గొన్నారు. అరుణ అసఫ్ అలీ భవన్‌లో శారదా నికేతన్ మహిళా మండలి ఆధ్వర్యంలో హుజూర్ నగర్ పట్టణంలో అనేక సంవత్సరాలుగా కంప్యూటర్ కుట్టుమిషన్ సెంటర్, మగ్గం సెంటర్లు రామానంద తీర్థ సంస్థ సహాయంతో నిర్వహించబడుతున్నాయి. రామానంద తీర్థ డైరెక్టర్ సాయి లక్ష్మి హరికృష్ణ, కిషోర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సాయి లక్ష్మీ శిక్షణ పొందిన విద్యార్థినిలకు భవిష్యత్తులో వారి ఉపాధి కోసం తీసుకోవలసిన అనేక విషయాలను వివరించారు. కంప్యూటర్ కుట్టు మిషన్ సెంటర్‌తో పాటు మగ్గం వర్క్ కు సంబంధించిన సెంటర్ ని రెండవసారి కూడా పెట్టాలని, ప్రొడక్షన్ సెంటర్ ప్రారంభించడంలో సహాయ పడాలని పశ్యపద్మ రామానంద తీర్థ సంస్థ అధికారులను కోరారు. ప్రొడక్షన్ యూనిట్ ని ప్రారంభించడానికి సహాయపడతామని హామీ ఇచ్చారు. వక్తలు మాట్లాడుతూ మహిళా మండలి ప్రారంభించటం సుదీర్ఘకాలంగా మహిళలకు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దటంలో పశ్య కన్నమ్మ శ్రమను కొని యాడారు. శిక్షణ పొందుతున్న విద్యార్థులతో కూడిన 31 మందితో కమిటీని నూతనంగా ఏర్పాటు చేసుకోవడం జరిగింది. భవిష్యత్తులో మహిళా మండలి కార్యక్రమాలను ముందుకు కొనసాగించటానికి ఈ కమిటీ కృషి చేస్తుంది.

ప్రమాదానికి గురైన రిపోర్టర్ లక్ష్మారెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మర్రి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అరుంధతి హాస్పటల్ సోమవారం గాయపడిన ఆంధ్రజ్యోతి రిపోర్టర్‌కు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారు. స్వయంగా ఎమ్మెల్యే వెళ్లి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాక్షించారు. ఆసుపత్రి సిబ్బందిని అప్రమత్తం చేసి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అదే విధంగా ప్రజలు ఈ వైద్య సేవలను ఉపయోగించు కోవాలని కోరారు. ఈ సందర్భంగా మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ తన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అరుంధతి హాస్పటల్ లో ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నామని ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలి కోరారు.

ఆరు గ్యారెంటీలపై శ్వేత పత్రం విడుదల చేయాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్ : తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనపై ప్రజా విజయోత్సవాల కంటే ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీ లను తక్షణమే అమలు చేయాలని తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ అధ్యక్షులు జిలుకర రవికుమార్ అన్నారు.మంగళ వారం బషీర్ బాగ్ లో విలేకరులతో అయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలలో ఉచిత బస్సు తప్ప మిగతా 5 హామీలు నామమాత్రం కూడా అమలు కావడం లేదని ఆరోపించారు. ప్రజా పాలన పేరుతో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు దూరమైతుందని అన్నారు. ఇప్పటికైనా రేవంత్ సర్కార్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుకు చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ప్రజా ఆగ్రహానికి గురవుతారని సూచించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలికి వచ్చి సంవత్సరం పూర్తయిన ఇప్పటివరకు పూర్తి క్యాబినెట్ లేకపోవడం శోచనీయం అని అన్నారు. శాంతి భద్రతలు పరిరక్షణకు హోం మంత్రి లేకపోవడం విడ్డూరం అన్నారు. కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్లలో జరిగిన ఘటన రాష్ట్రంలోని శాంతిభద్రతల పరిస్థితిని తెలియజేస్తుందన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కొత్త పథకాలను అమలు చేయకపోవడమే కాకుండా గత పథకాలకు సైతం రకరకాల సాగులు చూపెడుతూ కోదవిధిస్తుందని దుయ్యబట్టారు. వికలాంగులు, వితంతువులకు పెంచుతామని చెప్పిన పెన్షన్లను తక్షణమే పెంచుతూ నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. పత్తి, వరి కనుగోలు కేంద్రాలు పెంచి తక్షణమే రైతులను ఆదుకోవాలని అన్నారు. గతంలో కేసీఆర్ చేసిన మాదిరిగా సర్వే కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పటిష్టంగా ఈ సమగ్ర సర్వే చేయాలని అన్నారు.

ప్రభుత్వ భూముల కబ్జాలపై ప్రేక్షక పాత్ర అధికారులు : సీపీఐ

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్ : ప్రభుత్వ భూముల కబ్జాలపై అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాల బిందెల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం బాచుపల్లి మండల పరిధిలో జరుగుతున్న కబ్జాలపై తాసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసిల్దార్ ప్రభుదాస్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ నిజాంపేట్ సర్వే నెంబర్ 109 లో ప్రభుత్వ భూమిని 7 ఎకరాల 36 గుంటలు స్థలం కబ్జా చేసి జరుపుతున్న అక్రమ నిర్మాణాల పై బాచుపల్లి మండలం డిప్యూటీ తహసీల్దార్ ప్రభుదాస్ కి వివరించారు.బాచుపల్లి మండల పరిధిలో అనేక చోట్ల ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ప్రయివేట్ పత్రాలతో కబ్జా చేయడం ఇక్కడున్న పలువురు బడా బాబులకు, కేటుగాళ్ళకు అలవాటుగా మారిందని, అలాగే నిజాంపేట్ సర్వే నెంబర్ 109లో చాలా వరకు కబ్జా జరిగిందని అన్నారు. దీని పై పలుమార్లు కలెక్టర్ కి, మండల తహసీల్దార్ కి, కమిషనర్ కి పిర్యాదు చేయడం జరిగిందని,చర్యలపై చేతులెత్తెస్తూ తుతుమంత్రంగా కులాగోట్టడం జరిగిందని గుర్తుచేశారు. అట్టి సర్కారు భూముల ఆక్రమణలు వెంటనే తొలగించి ప్రభుత్వ భూమిని గుర్తించి తమ అధీనంలోకి తీసుకోవాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఆశీ. యాదయ్య, వాసు, ఢిల్లేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల వెరిఫికేషన్ మిషన్ మోడ్‌లో పూర్తి చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర, హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీఎం విశ్వకర్మ పథకానికి దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుల వెరిఫికేషన్ వేగవంతంగా పూర్తిచేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంపై అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ జిల్లాలో ఇప్పటివరకు 19206 మంది దరఖాస్తు చేసుకోగా కేవలం 236 మందికి మాత్రమే రుణాలు అందించిన పట్ల అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను క్షేత్రస్థాయిలో యుద్ధ ప్రాతిపాదికన వెరిఫికేషన్ చేసి నివేదిక సమర్పించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.19206 దరఖాస్తులలో ఇంకా మిగిలి ఉన్న 10491 స్టేజ్ వన్ స్థాయిలో పరిశీలించి 15 రోజుల్లోగా జిల్లా స్థాయికి పంపాలని జిహెచ్‌ఎంసి 10% ర్యాండం చెక్ చేసి జిఎండి ఐసి పంపాలని అన్నారు.15 రోజుల్లోగా దరఖాస్తుల వెరిఫికేషన్ పూర్తి కావాలన్నారు. 15 రోజుల తర్వాత సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి అధికారులు చేపట్టిన చర్యలపై సమీక్షించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జిఎండిఏసి ప్రవీణ్, డిస్ట్రిక్ బిసి వెల్ఫేర్ ఆఫీసర్ ఆశన్న, ఎల్‌డిఎం, పీఎం సుబ్రహ్మణ్యం, ఎం శ్రీనివాసరావు ఎమ్మెస్ ఎంఈ డైరెక్టర్, వినోద్ యాదవ్, ఉషేకల పాండు, జమలాపూర్ శేఖర్, వి ప్రశాంత్, భాను ప్రకాష్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం

విశాలాంధ్ర - మేడిపల్లి: ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం అని మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. మంగళవారం ఉదయం మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని వివిధ మండలాలకు చెందిన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన చెక్కులను అందచేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మూడు చింతలపల్లి మండల్ అధ్యక్షుడు బొమ్మలపల్లి నరసింహ యాదవ్, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, ఘట్కేసర్ మున్సిపాలిటీ చైర్పర్సన్ పావని జంగయ్య యాదవ్, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు పోగుల నర్సింహా రెడ్డి, గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ అధ్యక్షుడు సాయిపేట శ్రీనివాస్, దమ్మెగూడ కౌన్సిలర్ వెంకటేష్, బొక్క ప్రభాకర్ రెడ్డి, విశ్వం, బొమ్మకు శ్రీనివాస్, రాధా కృష్ణ, జై. నరసింహులు, బొక్క సంజీవ రెడ్డి, వెంకటేష్, భూపాల్ రెడ్డి పాల్గొన్నారు. సాయి కుమార్ ఘట్కేసర్ మున్సిపాలిటీ నగర్ 6లక్షలు, రాజేందర్ రెడ్డి ఘట్కేసర్ మున్సిపాలిటీ బాలాజీ నగర్, 6 లక్షలు, రాజేశ్వరి గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ 6 లక్షలు, సమద్ బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ బృందావన్ కాలనీ 6 లక్షలు, అమూల్య దమ్మెగూడ మున్సిపాలిటీ 6 లక్షలు, బి మల్లేష్ మూడు చింతలపల్లి మూడు చింతలపల్లి గ్రామం 6లక్షలు, కీర్తిశేషులు రాఘవరెడ్డి మూడు చింతలపల్లి మండల్ కొల్తూరు గ్రామం 6లక్షలు చెక్కులను మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ చేతుల మీదుగా అందజేశారు.

గ్రూప్-III పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు : కలెక్టర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఈనెల 17, 18 తేదీల్లో జరిగే గ్రూప్-III పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశం మందిరంలో పోలీస్, నోడల్ అధికారులు, శాఖ అధికారులతో గ్రూప్-III పరీక్ష నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 17న రెండు పేపర్లు ఉంటాయని, ఉదయం 10 గంటల నుండి 12:30 గంటల వరకు మొదటి పేపర్ ఉంటుందని మధ్యాహ్నం 3.00 గంటల నుండి సాయంత్రం 5:30 గంటల వరకు రెండో పేపర్ నిర్వహించడం జరుగుతుందని 18వ తేదీన ఉదయం III పేపర్ ఉంటుందని తెలిపారు. అభ్యర్థులను పరీక్షకు ఉదయం 8.30 గంటల నుండి 9:30 గంటల వరకు పరీక్ష కేంద్రాల్లో అనుమతిస్తారని, 9.30 గంటల తర్వాత గేట్లు మూసి వేయబడుతాయని, ఆలస్యంగా వస్తే అభ్యర్థులను అనుమతించరని తెలియజేస్తారు. నోడల్ అధికారులు రామారావు, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ అధికారి, ఇతర నోడల్ అధికారులు, డిపార్ట్మెంట్ అధికారులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉంటా : కూన

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి చెందిన పలువురు నాయకులు, పలు కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, ప్రజలు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్‌ని షాపూర్ నగర్‌లోని తన నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలిసి, పలు కాలనీలలో సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ సమస్యల వాటి పరిష్కారం, కాలనీల అభివృద్ధి కొరకై సత్వర చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అదే విధంగా పలువురు వివిధ శుభ కార్యాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలు అందజేశారు. అనంతరం కార్తీక పౌర్ణమి సందర్భంగా శ్రీ నల్లగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారి దేవాలయ ఆలయ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌ని ముఖ్యఅతిథిగా హాజరు కాగలరని ఆహ్వానించారు. లక్ష్మీనరసింహస్వామి కమిటీ వారు ఇంద్రసేన గుప్తా శ్రీరాములు, యాదగిరి, నరసింహారెడ్డి, సురేష్, వీఎంఆర్ కాపు సేవ సమితి సభ్యులు లింగం రవి, మల్లికార్జునరావు, పిఎస్ఎన్ మూర్తి, కనక వెంకట్, కిషోర్ పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - కొత్తూరు : కొత్తూరు మండలం, సిద్ధాపూర్ పంచాయతీ, చింతగట్టు తాండాలో మంగళవారం షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నూతనంగ నిర్మించనున్న బీటీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రూ.92 లక్షలతో చింతగట్టు తండా నుండి పొల్కోనిగుట్ట తండా వరకు ఈ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న రోడ్ల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. గత పాలకుల చేతుల్లో అభివృద్ధికి నోచుకోని గ్రామాలను అన్ని విధాలుగా ప్రజాపాలనలో విడతల వారీగా అభివృద్ధి చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు. ఉమ్మడి మండలాల మాజీ ఎంపీపీ ఎం శివశంకర్ గౌడ్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు గొంగోళ్ల హరినాథ్ రెడ్డి, సీనియర్ నాయకులు ఎల్లారం శేఖర్ రెడ్డి, ఎస్ కె ఖాజా, అంబటి ప్రభాకర్, జంగయ్య, కొమ్ము కృష్ణ, లింగారం సురేష్ గౌడ్, రాంచందర్ నాయక్, గోపాల్ నాయక్, రెడ్యా నాయక్, హర్యానాయక్ పాల్గొన్నారు.

మొదటి ఫ్లాగ్‌షిప్ స్టోర్‌ను ప్రారంభించిన జిష్టా

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : హైదరాబాద్ హస్తకళతో కూడిన సాంప్రదాయ వంటసామగ్రి, డైనింగ్ వేర్ గృహాలంకరణ బ్రాండ్ జిష్టా హైదరాబాద్ లో అధికారికంగా తన మొదటి ఫ్లాగ్‌షిప్ స్టోర్‌ను ప్రారంభించింది. బంజారా హిల్స్‌లో ఉన్న ఈ రెండు అంతస్తుల భవనంలో, పూర్తి స్థాయి రిటైల్ అనుభవంతో కూడిన భారతదేశపు నలుమూలల నుండి సేకరించిన సాంప్రదాయ హస్తకళను పునరుద్ధరించడానికి, సంరక్షించడానికి జిష్టా మిషన్‌లో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుంది. వెంగ్రావ్ పార్క్ ఎదురుగా ఉన్న ఈ కొత్త స్టోర్ మిడ్‌టౌన్ బిల్డింగ్, షాప్ నెం. 8, రోడ్ నెం. 1, బంజారా హిల్స్ లో ఉందన్నారు. చెన్నై బెంగళూరులో విజయవంతమైన వెంచర్‌ల తర్వాత జిష్టా తన మూడవ స్టోర్‌ను ప్రారంభించినందున ఇది ఉత్తేజకరమైన కొత్త అధ్యాయాన్ని సూచిస్తుందన్నారు. హైదరాబాద్ స్టోర్ 1,690 చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్రత్యేకమైన రిటైల్ స్థలం, ప్రత్యేకంగా జిష్టా విస్తృతమైన ఉత్పత్తి శ్రేణిని ప్రదర్శించడానికి రూపొందించబడిందన్నారు. హైదరాబాద్ వినియోగదారులకు అపూర్వమైన హెరిటేజ్ వంటసామాను ఉపకరణా లను అందిస్తోందన్నారు. ఇందులో రాగి, తగరం, ఇత్తడి, కాంస్య, పోత ఇనుము, మట్టి, రాయి వంటి సాంప్రదాయ లోహాలతో తయారు చేయబడిన వంటసామాను ఉన్నాయి. అద్వితీయమైన సమ్మేళనం జిష్టా తత్వాన్ని నిర్వచించే లోతైన సాంస్కృతిక ప్రశంసలను ప్రతిబింబిస్తుందని జిష్టా వ్యవస్థాపకుడు డైరెక్టర్ మీరా రామకృష్ణన్ అన్నారు.

ఒరిజినల్ ఐడీలతో పరీక్ష కేంద్రంకు రావాలి

విశాలాంధ్ర- హైదరాబాద్ : టీజీపీఎస్సీ గ్రూప్ -3 పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా పగడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. ముకుంద రెడ్డి, డిఆర్ఓ ఈ వెంకటాచారి అధికారులకు సూచించారు. మంగళవారం టిజీపీఎస్సీ గ్రూప్-3 పరీక్షల నిర్వహణపై రీజినల్ కోఆర్డినేటర్స్,స్ట్రాంగ్ రూమ్, జాయింట్ కస్టోడియన్స్, పోలీస్ నోడల్ ఆఫీసర్స్, చీఫ్ సూపరింటెండెంట్స్, డిఓ, ఫ్లైయింగ్ స్క్వాడ్స్, జాయింట్ రూట్ ఆఫీసర్స్‌తో నిర్వహించిన ట్రైనింగ్ కమ్ కోఆర్డినేషన్ మీటింగ్‌లో వారు పాల్గొన్నారు. టిజిపిఎస్సి గ్రూప్ -3 పరీక్షలు సజావుగా, ప్రశాంతంగా జరిగేలా పగడ్బందీగా చర్యలు చేపట్టాలని సూచించారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు ఉదయం 8:30 గంటల వరకు సాయంత్రం పరీక్ష కోసం 1.30 గంటలకు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. నిర్దేశించిన సమయం తర్వాత అభ్యర్థులెవరిని పరీక్షా కేంద్రంలోకి అనుమతించబడరు అని తెలిపారు. అభ్యర్థులు నలుపు/నీలం బాల్ పాయింట్ పెన్నులు, పెన్సిల్, ఎరేజం, హాల్ టికెట్‌ను దానిపై అతికించిన ఫోటో ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా చెల్లుబాటు అయ్యే ఒరిజినల్ ఫోటో కార్డ్‌ని మాత్రమే పరీక్ష హాల్‌లోకి తీసుకెళ్లాలన్నారు.

13న భారతీయ జనౌషధి కేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నవంబర్ 13న రిమోట్ వీడియో లింక్ ద్వారా కాచిగూడ రైల్వేస్టేషన్‌తో సహ దేశవ్యాప్తంగా 18 ప్రదేశాలలో ప్రధాన్ మంత్రి భారతీయ జనౌషధి కేంద్రాలను ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా కాచిగూడ రైల్వేస్టేషన్‌లో కూడా కార్యక్రమం నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమానికి గౌరవ కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి ఇతర ప్రముఖులు విచ్చేయనున్నారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్, హైదరాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేష్ విష్ణోయ్ ఇతర అధికారులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. ప్రధాన మంత్రి భారతీయ జనౌషధి యోజన అనేది పి.ఎమ్.బి.జే.కె అని పిలువబడే ప్రత్యేక కేంద్రాల ద్వారా ప్రజలకు సరసమైన ధరలకు నాణ్యమైన మందులను అందించడానికి భారత ప్రభుత్వం ప్రారంభించిన ప్రజా సంక్షేమ పథకం. సమాజంలోని అన్ని వర్గాలకు ముఖ్యంగా వెనుకబడిన వారికి నాణ్యమైన మందులు అందుబాటులో ఉండేలా చూడటం ఈ పథకం ముఖ్య ఉద్దేశం. నాణ్యత అనేది అధిక ధరకు మాత్రమే పర్యాయపదం అనే భావనను ప్రజలలో తొలగించడానికి ప్రచారం ద్వారా జనరిక్ ఔషధాల గురించి అవగాహన కల్పించడం కూడా ఈ పథకం లక్ష్యం. లక్షలాది మంది రోజువారీ సందర్శకులు ప్రయాణీకుల అవసరాలను తీర్చడానికి దక్షిణ మధ్య రైల్వే ముఖ్యమైన రైల్వే స్టేషన్లలో సౌకర్యాలు సదుపాయాలను స్థిరంగా పునరాభివృద్ధి చేస్తోంది. తదనుగుణంగా కాచిగూడ రైల్వే స్టేషన్‌లోని జనౌషధి కేంద్రం ముఖ్యంగా ప్రథమ చికిత్సకు సంబంధించిన ఔషధాలు ఇతర అత్యవసర మందులు త్వరగా పొందగలిగేలా అన్ని వర్గాల ప్రయాణీకులకు, ప్రజలకు సహాయకారిగా ఉంటుంది. నాణ్యమైన మందులు వినియోగ వస్తువులు (జనౌషధి ఉత్పత్తులు) అందరికీ అందుబాటు ధరలో అందుబాటులో ఉంచాలనే భారత ప్రభుత్వ లక్ష్యాన్ని ప్రచారం చేయడం రైల్వే స్టేషన్లలో ప్రయాణీకులు, సందర్శకులు జనౌషధి ఉత్పత్తులను సులభంగా అందుబాటు చేయడానికి వీలు కల్పించడం, సరసమైన ధరలకు మందులను అందించడం ద్వారా సమాజంలోని అన్ని వర్గాలలో ఆరోగ్యం సంక్షేమాన్ని పెంపొందించడం, ఉపాధి అవకాశాలను సృష్టించడం పి.ఎమ్.బి.జె.కె. లను తెరవడానికి వ్యవస్థాపకులకు మార్గాలను రూపొందించడం జరుగుతుందన్నారు.

తెలుగు విశ్వవిద్యాలయం సాహితీ పురస్కారాల ప్రదానం

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో ఉత్తమ గ్రంథాలను అందించిన పది మంది తెలుగు రచయితలకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం రూ. 20,116 ల నగదు, శాలువా, ప్రశంసా పత్రంతో సాహితీ పురస్కారాలను అందజేసింది. మంగళవారం వర్సిటీలోని ఎన్టీఆర్ కళామందిరంలో ఏర్పాటు చేసిన పురస్కారాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహా దారులు డా. కె.వి. రమణా చారి విచ్చేసి సాహితీ మూర్తులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు విశ్వవిద్యాలయం తెలుగు భాషా, సాహిత్యం, లలిత కళలులో విశేష కృషి చేసిన ప్రముఖులకు పురస్కారాల ప్రదానం చేయడమే కాకుండా తెలుగు జాతి గర్వించదగ్గ లలిత కళల్లో విద్యార్థులను నిష్ణాతులను చేసి జాతికి అందిస్తుందని తెలుపుతూ అదే విధంగా కళాకారుల జీవితాలు స్థిరీకరణ పొందడానికి ప్రణాళికలను రూపొందించాలన్నారు. కార్యక్రమానికి సభాధ్యక్షత వహించిన ఉపాధ్యక్షులు ఆచార్య వెలుదండ నిత్యానందరావు మాట్లాడుతూ తెలుగు విశ్వవిద్యాలయం తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి వికాస తోడ్పాటుకై నూతన సంస్కరణలు తేవాలని సంకల్పంతో విశ్వవిద్యాలయ అభివృద్ధికై వధాన్యుల సహకారంతో మూలనిధిని ఏర్పాటు చేయసంకల్పించినట్లు ప్రకటించారు. ఆ నిధికి తొలుత తనవంతుగా రూ.50,000 లు చెక్కు రూపంలో రిజిస్ట్రార్‌కు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చేసిన తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షులు ఆచార్య తంగెడ కిషన్‌రావు మాట్లాడుతూ తన హయాంలో 2022 సంవత్సరానికి గాను ఎంపిక కాబడిన సాహిత్య పురస్కార గ్రహీతలను, వారి సాహిత్య సేవలను సభకు పరిచయం చేశారు. తెలుగు విశ్వవిద్యాలయం ఇన్ ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య వై.రెడ్డి శ్యామల అతిథులను వేదికపై ఆహ్వానించి స్వాగతం పలికారు. కార్యక్రమానికి ముందు జానపద కళల శాఖ, నృత్యశాఖ, సంగీత శాఖ విద్యార్థిని విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. సమన్వయ కర్తగా విస్తరణ సేవా విభాగం సహాయ సంచాలకులు రింగు రాంమూర్తి వ్యవహరించారు.

మత్స్యకారుల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధవహించాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: మత్స్యకారుల అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధవహించాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద పేర్కొన్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 125 - గాజుల రామారం డివిజన్ చింతల చెరువు వద్ద నిర్వహించిన చేప పిల్లల విడుదల కార్యక్రమానికి ఎమ్మెల్యే కెపి వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై చింతల చెరువులో చేప పిల్లలను ఆయన చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధి కోసం గత ప్రభుత్వ హయాంలో చెరువులలో మురుగునీరు కలవకుండా ఎస్టిపిలను నిర్మించడం జరిగిందని, తద్వారా మంచి చేపలు చెరువులలో లభ్యమవ్వడంతో పాటు పరిసరాలు మురుగుమయం కాకుండా ఆహ్లాదభరిత వాతావరణం ఏర్పడుతుందన్నారు. అదేవిధంగా ముదిరాజులను బిసి-డి నుంచి బీసీ- ఏ లోకి మార్చాలనే డిమాండ్ ను ఇప్పటికే అసెంబ్లీలో చర్చించడం జరిగిందని, మత్స్యకారుల జీవన ప్రమాణాల పెంపు, అభివృద్ధిలో నా తోడ్పాటు ఎప్పుడూ ఉంటుందన్నారు. మత్స్యకారుల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధవహించాలన్నారు. అనంతరం చెరువు వద్ద గల కోటగుట్ట పెద్దమ్మ తల్లి దేవాలయంలో ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో-ఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, డైరెక్టర్లు కె.రాము, సత్యవతి, లక్ష్మణ్, జిల్లా మత్స్యశాఖ అధికారి కీర్తి, గాజులరామారం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు యాదగిరి, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు దుర్గయ్య, పాక్స్ డైరెక్టర్ పరిశే శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ రాంరెడ్డి, సీనియర్ నాయకులు అడ్వకేట్ కమలాకర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కేటీఆర్ ప్రోద్బలంతోనే అధికారులపై దాడులు

విశాలాంధ్ర-బషీర్ బాగ్: వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్లలో విధి నిర్వహణలో ఉన్న వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఇతర అధికారులపై కెటిఆర్ ప్రోద్బలంతోనే బిఆర్ఎస్ నాయకులు దాడి చేశారని, దాడి చేసిన బిఆర్ఎస్ నాయకులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని బిసి పొలిటికల్ జెఏసి చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాచాల మాట్లాడుతూ అధికారులపై జరిగిన దాడి ముందస్తు పథకం ప్రకారమే చేసిన దాడిగా చూడాలని, రాజకీయాలకు అతీతంగా విధులు నిర్వర్తిస్తున్న అధికారులపై దాడి చేయడం అంటే ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడిచేయడంగానే పరిగణించి దోషులతో పాటు వారి వెనక ఉన్న పార్టీ పెద్దలను శిక్షించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డ్రగ్స్ విషయంలో కఠినంగా వ్యవహరిస్తూ హైదరాబాదును డ్రగ్స్ రహిత నగరంగా చేయాలని సంకల్పించడంతో హైదరాబాదులో డ్రగ్స్ దొరకటం లేదని, దీంతో కేటీఆర్ పిచ్చిపట్టినట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి నియోజకవర్గం కావడంతో ఉద్యోగులను అడ్డంపెట్టుకొని రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ అనిశ్చితి సృష్టించి లబ్ది పొందాలని బిఆర్ఎస్ పార్టీ కుట్రచేయడం సిగ్గుమాలిన చర్య అని అన్నారు. దాడికి పాల్పడిన వ్యక్తి సురేష్ ఫోన్ నుంచి పట్నం నరేందర్ రెడ్డికి కేటీఆర్‌కి అనేకసార్లు ఫోన్ కాల్స్ వెళ్లడం అనేక అనుమానాలకు దారి తీస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బిసి పొలిటికల్ జెఎసి రాష్ట్ర కార్యదర్శి వివి గౌడ్, నాయకులు సాయిబాబా, రాఘవేందర్, నగేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ అవినీతిపై రాష్ట్రమంతటా పాదయాత్ర : నరాల సత్యనారాయణ

విశాలాంధ్ర - బషీర్ బాగ్ : తెలంగాణ ప్రాంతాన్ని ప్రజలను మోసం చేసి వేలకోట్ల విధ్వంసానికి కారణమైన కెసిఆర్ అవినీతిపై రాష్ట్రమంతటా పాదయాత, పల్లెనిద్ర చేసి ప్రజలకు తెలియజేస్తామని తెలంగాణ రక్షణ సమితి డెమోక్రటిడ్ (టిఆర్ఎస్) పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నరాల సత్యనారాయణ తెలిపారు. మంగళవారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేంలో అయన మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టులో, చత్తీస్గఢ్ విద్యుత్తు ఒప్పందంలో, భధలాయింపులో వేలకోట్ల అవినీతి జరిగిందని తెలిపారు. తెలంగాణ వస్తే లక్ష ఉద్యోగాలు అని చెప్పి, నిరుద్యోగులను ఉద్యమకారులను నట్టేటా మోసం చేశారని మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్‌తో రాష్ట్ర ప్రతిష్టను దిగజార్చారని, ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి రాజ్యమేలిందని పేర్కొన్నారు. సమావేశంలో టిఆర్ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు మైల సురేఖ, నేతలు కంచర్ల ముజూష, కొత్తపల్లి శారద, రేఖ, మంద లావణ్య, లక్ష్మీ, శ్రీలత పాల్గొన్నారు.

కృతిమ మేధస్సుపై పట్టు సాధించాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-దుండిగల్: కృత్రిమ మేధస్సుపై విద్యార్థులు పట్టు సాధించాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద పేర్కొన్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 127 - రంగారెడ్డి నగర్ డివిజన్ గాంధీ నగర్‌లోని ఠాగూర్ హై స్కూల్ నందు నూతనంగా ఏర్పాటుచేసిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బేస్డ్ కంప్యూటర్ ల్యాబ్ ను ఎమ్మెల్యే కెపి వివేకానంద్ ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ కృత్రిమ మేదస్సుతో విద్యార్థులలో దాగివున్న ప్రతిభను వెలికి తీయవచ్చని రానున్న రోజుల్లో ప్రతి రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ తప్పనిసరి కానుందన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే పుస్తకాలతో పాటు కంప్యూటర్, శాస్త్ర సాంకేతిక రంగాలను పునికి పుచ్చుకొని అభివృద్ధి చెందాలని, కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ సహాయంతో విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు నాంది పలికిన ఠాగూర్ స్కూల్ యాజమాన్యానికి ఆయన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఎన్టీయూ ప్రొఫెసర్ డాక్టర్ ఇందిరా రాణి, ఐటిఐ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఐటిఐ గెజిటెడ్ ఆఫీసర్స్ అధ్యక్షులు శ్రీనివాస్, ఆగర్ సైబర్ ఎక్స్ సంస్థ ఐటీ డైరెక్టర్ సుమన్, బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు ఎర్వ శంకరయ్య, సీనియర్ నాయకులు అబ్దుల్ ఖాదర్, జల్దా లక్ష్మీనాథ్, రహీం, కార్తీక్ గౌడ్, ఎర్వ సాయి, సతీష్ గట్టోజి, బాలు నేత, రమ్మీ గౌడ్, అల్లావుద్దీన్, ఠాగూర్ హై స్కూల్ కరస్పాండెంట్ బందారు సాయికుమార్, వెలుగు ఎడ్యుకేషన్ ట్రస్ట్ నారాయణరావు, నేహా బందారి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శంకర్ నివాసంలో సర్వే చేసిన సిబ్బంది

విశాలాంధ్ర - షాద్‌నగర్, రూరల్: రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గృహంలో ప్రభుత్వ సిబ్బంది కులగణన సర్వే చేశారు. పట్టణంలోని 9వ వార్డులో ఉన్న ఎమ్మెల్యే శంకర్ గృహాన్ని కుల గణనలో భాగంగా మున్సిపల్ కమిషనర్ వెంకన్న తదితర సిబ్బంది సందర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ వివరాలను సేకరించారు. సర్వే సందర్భంగా సిబ్బంది ఎమ్మెల్యేను అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. తన కుటుంబాన్ని సంబంచిన పూర్తి వివరాలు సిబ్బంది అధికారిక సహకరించి చెప్పడంతో వారు ధన్యవాదాలు తెలిపారు.

కబ్జాకు గురవుతున్న చెరువులను హైడ్రా పరిరక్షించాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వీఎస్ బోస్

విశాలాంధ్ర - కాప్రా : ఉప్పల్ నియోజకవర్గంలో కబ్జాలకు గురవుతున్న కాప్రా, రామంతపూర్, నాచారం ఎర్రకుంట, ఉప్పల్ చెరువులను హైడ్రా పరిరక్షించాలని, అన్యాక్రాంతాలకు గురైన స్థలాలను కబ్జాదారుల నుండి రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్. బోస్ డిమాండ్ చేశారు. ఈ సీఐఎల్‌లోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బోస్ మాట్లాడారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్. బోస్ మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గంలో అనేక చెరువులు కబ్జాలకు గురయ్యాయని, ప్రభుత్వ స్థలాలు కూడా అన్యాక్రాంతాలకు గురయ్యాయని వారు విమర్శించారు. ప్రభుత్వం ఆస్తులను కాపాడాల్సిన అధికార యంత్రాంగం నిర్లక్ష్యం చేస్తోందని ఆయన విమర్శించారు. ఆక్రమణలకు గురైన చెరువులను కాపాడి ఆ చెరువులను సుందరీకరణ చేయాలని, వాకింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేయాలని, చెరువుల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని తద్వారా కబ్జాలకు తావు ఉండదని వారు అన్నారు. కబ్జాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆయా స్థలాలను స్వాధీన పరుచుకోవాలని వారు డిమాండ్ చేశారు. చెరువులు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కోసం సీపీఐ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి జీ.దామోదర్ రెడ్డి, సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.శంకర్‌రావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి టి.సత్య ప్రసాద్, సీపీఐ కాప్రా పట్టణ కార్యదర్శి జీ.లక్ష్మీ నారాయణ, సీపీఐ కార్యవర్గ సభ్యులు నారా నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

కళాశాల భవన నిర్మాణానికి రూ.1.11లక్షల విరాళం

విశాలాంధ్ర - షాద్ నగర్,రూరల్: రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణానికి కృషి చేస్తున్న షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపుతో పలువురు దాతలు స్పందిస్తున్నారు. ఈ నేపథ్యంలో షాద్ నగర్ నియోజకవర్గం కేశంపేట మండలం సంగెం గ్రామానికి చెందిన వినయ్ రెడ్డి నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి రూ. లక్ష 11 వేల రూపాయలు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతుల మీదుగా అందించడం జరిగింది. ఈ సందర్భంగా వినయ్ రెడ్డిని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీం, రఘునాయక్, తిరుపతి రెడ్డి, బాలరాజు, చల్ల శ్రీకాంత్ రెడ్డి, ముబారక్,ఎండి.ఇబ్రహీం, సుదర్శన్, సత్యం రెడ్డి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: మాదాపూర్ డివిజన్ పరిధిలోని సాయినగర్‌కి చెందిన మోహన్ నాయక్‌కి వైద్య చికిత్స నిమిత్తం ముఖ్య మంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకొనగా సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.6 వేల ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కును బాధిత కుటుంబానికి ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరం అని ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుంద న్నారు. అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదని, అనారోగ్యంకు గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు, అభాగ్యులకు అండగా సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా నిస్తుందని తెలిపారు. పేద మధ్య తరగతి ప్రజలకు ఆసుపత్రిలో బిల్లులు కట్టలేని పరిస్థితిలో ఉన్న వారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తూ ఆర్థిక సాయంని అందిస్తుందని దీనిలో భాగంగానే నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటివరకు ఎన్నో వందలాది కుటుంబాలను సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆదుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలింగ్ గౌతమ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సత్తయ్య

విశాలాంధ్ర - తుర్కయంజాల్ : ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని కోహెడ గ్రామంలో డిస్ట్రిక్ట్ కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య మంగళవారం పాలకవర్గంతో కలసి ప్రారంభించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుపై రైతుల సందేహాలకు వివరణ ఇచ్చారు. ప్రతి గింజ ప్రభుత్వం కొంటుందని, అలాగే ధాన్యం బస్తాలు ఉచితంగా కొనుగోలు కేంద్రం వద్ద ఇస్తారని రైతులకు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణ రెడ్డి, తుర్కయంజాల్ పిఎసిఎస్ వైస్ చైర్మన్ కొత్తరాంరెడ్డి, డైరెక్టర్లు వంగేటి లక్ష్మారెడ్డి, సామ సంజీవరెడ్డి కృష్ణారెడ్డి, సత్యనారాయణ రెడ్డి అసిస్టెంట్ రిజిస్టర్ రవి కుమార్, మండల అగ్రికల్చర్ ఆఫీసర్, మానిటరింగ్ ఆఫీసర్ గోపినాథ్ రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

విశాలాంధ్ర - తుర్కయంజాల్ : తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ భూనీళా సమేత అది వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభించారు. ఈనెల 12 నుండి 21వ తేదీ వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్ట్ నోముల శైలజా రాణి, నోముల అశోక్ కుమార్ పేర్కొన్నారు. 18న సోమవారం స్వామి వారి కల్యాణోత్సవం జరగనుందని కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ప్రజాస్వామ్యానికి ప్రమాదకారులు

మోదీ, అమిత్‌షాపై నారాయణ విమర్శ

మహారాష్ట్ర, జార్ఖండ్‌లో గెలిస్తే జమిలికే మొగ్గుచూపుతారని వ్యాఖ్య

విశాలాంధ్ర- హైదరాబాద్: మహారాష్ట్ర, జార్ఖండ్ శాసనసభ ఎన్నికల్లో బీజేపీ గెలిస్తే... ప్రధాని మోదీ జమిలి ఎన్నికలకు సిద్ధమవుతారని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. జమిలి ఎన్నికలు సమాఖ్య స్ఫూర్తికి వ్యతిరేకమని స్పష్టంచేశారు. లౌకిక ప్రజాస్వామ్య వ్యవస్థకు భంగం కలిగించే రీతిలో ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజకీయాలు చేస్తున్నారని, వారిద్దరు ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదకరంగా మారారని విమర్శించారు. అమిత్ షా కేంద్రమంత్రి అయిన తర్వాత నేరపూరిత రాజకీయాలకు ప్రత్యక్షంగా ఆజ్యం పోస్తున్నారని నారాయణ అన్నారు. కులగణన మంచి కార్యక్రమమని, అనవసరమైన ప్రశ్నలతో దీనిని వివాదాస్పదం చేసుకోద్దని తెలంగాణ ప్రభుత్వానికి సూచించారు. హైదరాబాద్‌లోని మగ్ధూం భవనలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుతో కలిసి నారాయణ మాట్లాడారు. కులగణనలోని ప్రశ్నలు సరళతరంగా ఉండాలని, దీనికి సంబంధించి ఒక యాప్ ఏర్పాటు చేస్తే... ప్రజలు అందులో తమ వివరాలు పొందుపరుస్తారని నారాయణ సూచించారు. ఆర్థిక, రాజకీయ సమానత్వం కలిగేలా కులగణన ఉండాలని తెలిపారు. కులాలు, మతాలపై అభిమానం ఉండాలని, కానీ, కులతత్వం, మతతత్వం మంచిదికాదని ఆయన పేర్కొన్నారు. వికారాబాద్ కలెక్టర్‌పై దాడి చేయడం సరికాదని, అదే సమయంలో రైతుల బాధను, వారి ఆవేదనను ప్రభుత్వం అర్థం చేసుకోవాలని సూచించారు. దాడి చేశారనే నెపంతో ఒక రాజకీయ పార్టీ ముద్ర వేసి చర్యలు తీసుకోవద్దన్నారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఇంటికి ప్రధాని మోదీ వెళ్లడం, ఆయనను ప్రధాన న్యాయమూర్తి ఆహ్వానించడం రెండూ తప్పేనని, రాజకీయాల్లో ఇది దుష్టసంప్రదాయమని నారాయణ చెప్పారు. న్యాయవ్యవస్థ లక్ష్మణ రేఖ దాటకూడదని సూచించారు. దేశంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలను మోదీ తన గుప్పిట్లో పెట్టుకున్నారని, ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, వైసీపీ మోదీకి భజన చేస్తున్నాయని విమర్శించారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుతో మోదీది విషకౌగిలి అన్నారు. ఈ నెల 17న కొల్లేరు సరస్సును సందర్శించనున్నట్టు నారాయణ వివరించారు.

వరుస ఘటనలపై సమగ్ర విచారణ: కూనంనేని

బీఆర్ఎస్ రాజకీయ కుట్రకు పాల్పడుతున్నట్లు కనిపిస్తున్నదని, పేదల భూజాలపై తుపాకులు పెట్టి రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కాల్చేందుకు ప్రయత్నిస్తున్నదని కూనంనేని సాంబశివరావు అన్నారు. విగ్రహ ధ్వంసం, మసీదు వివాదం వంటి వరుస ఘటనలపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కేటీఆర్‌కు ప్రస్తుతం రక్షణ కవచం అవసరమని, అందుకే ఆయనకు కమ్యూనిస్టులు గుర్తుకొస్తున్నారని, కానీ తాము ప్రజలకు మాత్రమే కవచంగా ఉంటామని కూనంనేని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలని కూనంనేని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న వరుస ఘటనల వెనుక ఉన్నది ఒక శక్తా...ఒక వ్యక్తా... లేక రాజకీయ పార్టీనా తేలాలని ఆయన అన్నారు. త్వరలోనే తెలంగాణ ముఖ్యమంత్రి మారుతున్నారని బీజేపీ శాసనసభాపక్ష నేత మహేశ్వరరెడ్డి చెబితే... రేవంత్‌రెడ్డి నియోజకవర్గంలో శాంతిభద్రతల సమస్యలు ఉన్నాయని కేటీఆర్ అంటున్నారని, ఈ రెండు వ్యాఖ్యల మధ్య ఏదో బంధం కనిపిస్తోందన్నారు. వికారాబాద్ జిల్లాలో అధికారులపై దాడిని ఆయన ఖండించారు. వికారాబాద్ ఘటనకు సంబంధించి రైతుల సమస్యను, దాడి జరిగిన కోణాన్ని వేర్వేరుగా చూడాలని సూచించారు. దాడి పేరుతో పేదల, రైతులపై ఎటువంటి కేసులు నమోదు చేయవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కులగణనకు సంబంధించి రెండు, మూడు అంశాలు అభ్యంతరకరంగా ఉన్నాయని, ఆధార్ ఐచ్ఛికమని పెట్టినప్పటికీ దరఖాస్తుదారులను ఒప్పించాలని సూచించారని, ఆస్తులు, ఆదాయం, అప్పులు లాంటి సమాచారం ఎందుకు అడుగుతున్నారని కూనంనేని ప్రశ్నించారు. ఇటువంటి ప్రశ్నల ద్వారా ప్రజలలో భయందోళన కలుగుతుందని కూనంనేని చెప్పారు.మూసీ, హైడ్రా విషయంలో ఈనెల 14న మేధావులతో రౌండ్ సమావేశం నిర్వహిస్తున్నామని, ఇందులో అన్ని అంశాలను చర్చించి సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాయనున్నట్టు కూనంనేని సాంబశివరావు తెలిపారు.

ఇళ్ల స్థలాల సాధనకు పోరాటం

రామకృష్ణ పిలుపు

విశాలాంధ్ర-విజయవాడ: పేదలకు ఇళ్ల స్థలాల సాధన కోసం తాము చేపట్టిన పోరాట కార్యక్రమానికి లబ్ధిదారులు సహకరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపు ఇచ్చారు. సీపీఐ విజయవాడ నగర కార్యవర్గ సమావేశం మంగళవారం స్థానిక హనుమాన్ పేట దాసరి భవన్‌లో జరిగింది. రామకృష్ణ మాట్లాడుతూ ఇళ్ల స్థలాల లబ్ధిదారుల్లో 90 శాతం దళితులు, గిరిజనులు, మైనార్టీలు, వెనుకబడిన తరగతుల వారే ఉన్నారని చెప్పారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఒక్కో కుటుంబానికి ఒక్క సెంటు స్థలం కేటాయించి... ఇంటి నిర్మాణానికి లక్షా ఎనభైవేలు మాత్రమే ఇచ్చిందన్నారు. చాలాచోట్ల ఇళ్ల స్థలాల లేఅవుట్లు అసంపూర్తిగా ఉన్నాయని, కొన్ని ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణం మధ్యలోనే ఆగిపోయిందన్నారు. ఇళ్లు లేక పేదలు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇసుక, ఇటుక, ఇనుము, కంకర ధరలు పెరిగిన కారణంగా ప్రతి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు నివేశన స్థలాలు కేటాయించాలని కోరారు. పేదలకు ఇళ్ల స్థలాల సాధన కోసం సీపీఐ బృహత్తర కార్యక్రమం చేపట్టిందన్నారు. ఈ నెల 18న లబ్ధిదారులతో సచివాలయాల్లో అర్జీలు సమర్పించేలా రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ శ్రేణులు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ఇంటింటి సర్వే నిర్వహించి అర్హులైన పేదల జాబితా రూపొందించాలని సూచించారు. లబ్ధిదారులను పెద్దఎత్తున సమీకరించి... సచివాలయాల్లో అర్జీలు అందజేయడానికి సీపీఐ నాయకత్వం బాధ్యత తీసుకోవాలన్నారు. అర్జీలు రాయటం, వాటిని సచివాలయాల్లో సమర్పించేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందించే బాధ్యత పార్టీ పట్టణ, నగర నాయకత్వాలు తీసుకోవాలన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లకు సంబంధించి వైసీపీ ప్రభుత్వం కాంట్రాక్టర్లకు డబ్బులు చెల్లించని కారణంగా ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించలేదన్నారు. గ్రామాల్లో కంటే పట్టణాల్లో ఇళ్లులేని పేదలు అధిక సంఖ్యలో ఉన్నారని చెప్పారు. సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు పాల్గొనగా కార్యవర్గ సభ్యులు లింగాబత్తిన శివకుమార్ సమావేశానికి అధ్యక్షత వహించారు.

వయనాడ్‌కు ప్రత్యేక ప్యాకేజి ఇవ్వండి

ఇప్పటికైనా బాధితుల్ని ఆదుకోండి

ప్రధాని మోదీకి సీపీఐ ఎంపీ సంతోశ్ కుమార్ లేఖ

న్యూఢిల్లీ: వయనాడ్ కొండచరియలు విరిగిపడిన ఘటన బాధితులకు పునరావాసం కల్పించే విషయంలో ప్రధాని మోదీ తక్షణమే జోక్యం చేసుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఎంపీ సంతోశ్ కుమార్ కోరారు. బాధితులకు సాయం, పునరావాసం కోసం తక్షణమే ప్రత్యేక ప్యాకేజి ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తన వంతు సాయం చేస్తున్నాగానీ కేంద్రం నుంచి పటిష్ఠ చర్యలు లేక మోసపోయినట్లుగా బాధితులు భావిస్తున్నారంటూ ప్రధానికి ఓ లేఖ రాశారు. కొండచరియలు విరిగిపడి తన తండ్రి, తోబుట్టువులను కోల్పోయిన చిన్నారి నైసా చిత్రాన్నీ తన లేఖకు జతపరిచారు. ప్రధాని వయనాడ్‌లో పర్యటించినప్పుడు నైసాను ఎత్తుకున్న ఫొటో వైరల్ అయింది. ఇటీవల నైసా ఇంటికి వెళ్లానని, రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన అద్దె ఇంట్లో అమ్మ, అవ్వతో ఆమె ఉంటోందని ప్రధాని దృష్టికి సంతోశ్ కుమార్ తీసుకెళ్లారు. రోజువారీ అవసరాల కోసం రూ.300 చొప్పున రాష్ట్ర ప్రభుత్వం ఆ కుటుంబానికి ఇస్తోందన్నారు. 'నైసా మోల్‌తో మీ ఫొటో వైరల్ అయింది. అప్పట్లో వయనాడ్ బాధితులకు మీరు ఇచ్చిన హామీలను గుర్తుచేసేందుకు ఆమె ఫొటోను నా లేఖకు జతపరిచాను. మీరు పర్యటించనప్పుడు... తమను ఆదుకుంటారని బాధితులు ఆశించారు కానీ వాస్తవ పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. చూరల్‌మాల ప్రజలు ఇంకా కేంద్ర సాయం కోసం ఎదురు చూస్తున్నారు. ఈ విపత్తు సాధారణమైనది కాదని మీరు చేసిన ప్రకటన వేలాది మంది బాధితుల్లో సాయం అందుతుందన్న ఆశ కలిగించింది' అని సంతోశ్ కుమార్ పేర్కొన్నారు. పౌర సమాజ సంఘాలు, స్వచ్ఛంధ సంస్థలతో కలిసి కేరళ ప్రభుత్వం చేయగలిగినదంతా చేస్తోంది కానీ కేంద్రం నుంచి ఎలాంటి సాయం అందక చిన్నారి నైసాతో పాటు వేలాది బాధిత కుటుంబాలు మోసపోయినట్లు భావిస్తున్నాయని వెల్లడించారు. నైసా కుటుంబానికి ప్రధానమంత్రి సహాయ నిధి తరఫున రెండు దఫాలుగా రూ.లక్ష చొప్పున అందగా, కేరళ ప్రభుత్వం రూ.6లక్షలు ఇచ్చిందని సంతోశ్ కుమార్ తెలిపారు. ఇప్పటికైనా వయనాడ్‌కు సాయం అందించడానికి ప్రాధాన్యత ఇస్తారని, తక్షణమే చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నట్లు లేఖలో సంతోశ్ కుమార్ పేర్కొన్నారు.

అసెంబ్లీకి వెళ్లననడం జగన్ అహంకారమే

వైసీపీ ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలి

ఇది కేటాయింపులులేని బడ్జెట్ : షర్మిల

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వైసీపీ సోషల్ మీడియా ఒక సైతాన్ సైన్యంలా మారిందని, అసెంబ్లీకి వెళ్లననడం వైసీపీ అధినేత జగన్ అహంకారానికి నిదర్శనమని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల మండిపడ్డారు. చంద్రబాబు ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు స్పష్టత లేదని, ఇది కేటాయింపులులేని బడ్జెట్ అని అన్నారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో మంగళవారం ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సూపర్ సిక్స్ అమలు చేయాలంటే ప్రతి ఏడాది రూ.లక్షా 20 వేల కోట్లు కావాలని, చంద్రబాబు ఈ బడ్జెట్‌లో కనీసం పావు వంతు కూడా కేటాయింపులు చేపట్టలేదని తెలిపారు. మహిళా శక్తి కింద ప్రతి నెల రూ.15 వందలు ఇస్తామని హామీ ఇచ్చారని, కోటి మంది మహిళలకు వచ్చే 5 నెలల్లో రూ.7,500 కోట్లు ఇవ్వాల్సి ఉందని, ఈ పథకానికి రూపాయి నిధులూ కేటాయించలేదని దుయ్యబట్టారు. తల్లికి వందనం కింద రూ.15 వేలు ప్రతి బిడ్డకు ఇస్తాం అన్నారని, 80 లక్షల మంది అర్హులుంటే, అరకొరే నిధులు కేటాయించారని చెప్పారు. ఉచిత బస్సు పథకానికీ ఒక్క రూపాయి ఇవ్వలేదని, అన్నదాత సుఖీభవ కింద ప్రతి రైతుకు ఏడాదికి రూ.20 వేలు ఇవ్వాల్సి ఉండగా, అరకొరే కేటాయింపులే చేశారని తెలిపారు. నిరుద్యోగ భృతి ప్రస్తావనే లేదని, గ్యాస్ సిలిండర్ల కింద కేటాయింపులు కేవలం రూ.800 కోట్లే ఇచ్చారని వివరించారు. అంటే సగం మందికి సిలిండర్ల కింద కోత పెడతారా?... సీఎం చంద్రబాబు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వైసీపీని ప్రజలు గెలిపించినప్పటికీ బాధ్యత లేకుండా మాట్లాడుతున్నారని, ఒకప్పుడు 151 సీట్లు ఇచ్చిన ప్రజలు 11 సీట్లు ఇప్పుడు ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. మీ అక్రమాలను, అవినీతిని ప్రజలు గమనించినందునే 11 సీట్లకు పరిమితం చేశారన్నారు. అసెంబ్లీ వెళ్లననడంపై జగన్ సమాధానం చెప్పాలన్నారు. ప్రజలతో ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళ్లకపోతే వెన్నుపోటు పొడిచినట్లు కాదా? అని ప్రశ్నించారు. బడ్జెట్ ప్రవేశ పెడుతుంటే సర్కార్‌ను ప్రశ్నించేది ఎవరని అన్నారు. అసెంబ్లీకి వెళ్లకుంటే రాజీనామాలు చేయాలని వైసీపీ ఎమ్మెల్యేలకు లేఖలు రాస్తున్నామని చెప్పారు. సోషల్ మీడియాలో నేను ఒక బాధితురాలినని, నాతో పాటు సునీతను, అమ్మపై విమర్శించారన్నారు. మహిళలు రాజకీయాల్లో ఉండాలంటే భయపడే పరిస్థితికి తెచ్చారని షర్మిల మండిపడ్డారు.

రేపటి నుంచి విశాలాంధ్ర పుస్తక మహోత్సవం

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: విశాలాంధ్ర 24వ పుస్తక మహోత్సవం ఈనెల 14వ తేదీ నుంచి జరగనుంది. బుక్ హౌస్ అధ్వర్యంలో గుంటూరు లాడ్జి సెంటర్ ఏఎల్‌బీఈడీ కళాశాల ఆవరణలో పుస్తక ప్రదర్శనకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అభ్యుదయ రచయితల సంఘం(అరసం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్, విశాలాంధ్ర బుక్ హౌస్ గుంటూరు బ్రాంచ్ మేనేజర్ బి.శ్రీనివాస్ తెలిపారు. పుస్తక మహోత్సవాన్ని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ ప్రారంభిస్తారని, ముఖ్య అతిథిగా నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు హాజరవుతారన్నారు. అనంతరం విశాలాంధ్ర విజ్ఞాన సమితి అధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగే ప్రారంభ సభకు విశాలాంధ్ర విజ్ఞాన సమితి జనరల్ మేనేజర్ పుట్టా హరనాథరెడ్డి, డిప్యూటీ జనరల్ మేనేజర్ టి.మనోహర్ నాయుడు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, అరసం జాతీయ కార్యదర్శి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ, వల్లూరు శివ ప్రసాద్, ఏఎల్‌బీఈడీ కళాశాల ప్రిన్సిపల్ డా.ఎం.ఎస్తేరుతో పాటు ప్రముఖ రచయితలు హాజరవుతారన్నారు. 40 రకాల ప్రచురణ సంస్థలు ముద్రించిన అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. అరసం అధ్వర్యంలో డిసెంబర్ 1 నుంచి రోజూ సాయంత్రం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, పుస్తకావిష్కరణలు, పాఠశాలల విద్యార్థులకు పోటీలు జరుగుతాయని తెలిపారు. పుస్తక మహోత్సవ ప్రాంగణానికి విశాలాంధ్ర శతాధిక నాటక రచయిత కొడాలి గోపాలరావు పేరును, సాహిత్య వేదికకు అభ్యుదయ సాహితీవేత్త, కవి ఆలూరి బైరాగి శత జయంతి వేదికగా పేరు పెట్టామన్నారు.

అయ్యో... పాపం లహరి

మురుగు కాలువలో పడి విద్యార్థిని మృతి

విశాలాంధ్ర-తొట్టంబేడు: పాపం... లహరి. 'భవిత'లో చేరిన మరునాడే మురుగు కాలువలో పడి మృత్యువాత పడింది. తల్లిదండ్రులకు గర్భశోకం మిగిల్చింది. ఈ విషాదకర ఘటన తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాళహస్తి పట్టణ శివారులోని అప్పలాయగుంట(ఈదులగుంట)లో నివాసం ఉన్న మధు, కల్పన దంపతులకు పెద్ది లహరి (6) అనే చిన్నారి ఉంది. మధు వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు. ఆయన నింద్ర మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంటుగా పని చేస్తున్నాడు. లహరి మానసిక, శారీరక వికలాంగురాలు. ఈ చిన్నారికి తల్లిదండ్రులు చాలాకాలంగా థెరపీ చేయిస్తున్నారు. ఆ చిన్నారి మానసికంగా అభివృద్ధి చెందాలన్న ఆకాంక్షతో ఈ నెల 11వ తేదీ సోమవారం తొట్టంబేడు మండల పరిధిలోని బసవయ్యపాళెంలో గల భవిత పాఠశాలలో చేర్చారు. మంగళవారం ఆ చిన్నారిని భవిత పాఠశాలలో దించారు. లహరి తండ్రి మధు యథావిధిగా విధులకు వెళ్లాడు. భవిత పాఠశాలలో ఉన్న తన ముద్దుల కుమార్తె క్షేమంగా ఉంటుందనుకున్నాడు. అయితే భవిత పాఠశాలలో ఉన్న విద్యార్థులను పగలు మూత్ర విసర్జనకు వదిలారు. ఆ సమయంలో లహరి కూడా మిగతా వారితో కలసి వెళ్లింది. పాఠశాల పక్కనే పెద్ద మురుగు (చెంబేడు) కాలువ వెళుతోంది. మానసిక, శారీరక వైకల్యం గల లహరి ఈ కాలువలో పడిపోయింది. మూత్ర విసర్జనకు వెళ్లిన లహరి తిరిగి రాక పోవడంతో భవిత సిబ్బంది చుట్టు పక్కల వెతికారు. అయినా ఫలితం లేకపోయింది. దీంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెంటనే భవిత పాఠశాల వద్దకు వెళ్లి చుట్టు పక్కల వెతకగా... లహరి కాలువలో పడి ఉన్నట్లు గుర్తించారు. ఆ చిన్నారిని బయటకు తీసి శ్రీకాళహస్తి ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించగా... అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. దీంతో పోలీసులు ఈ సమాచారాన్ని లహరి తల్లిదండ్రులకు చేరవేశారు. వారు ఆస్పత్రి వద్దకు వచ్చి కన్నీరు మున్నీరయ్యారు. మానసిక, శారీరక వికలాంగురాలైన లహరి మురుగు కాలువలో పడి మృతి చెందడం శ్రీకాళహస్తిలో విషాదం నింపింది. భవిత పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యం వలనే ఈ ఘటన చోటు చేసుకుందనే విమర్శ వస్తోంది. పెద్ద మురుగు కాలువ పక్కనే భవిత పాఠశాల ఏర్పాటు చేయడం కూడా విమర్శలకు తావిస్తోంది.

అక్టోబర్‌లో పెరిగిన రిటైల్ ద్రవ్యోల్బణం

న్యూఢిల్లీ: దేశంలో మరోసారి రిటైల్ ద్రవ్యోల్బణం పెరిగింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లక్షిత స్థాయిని దాటేసి అక్టోబర్‌లో వినియోగదారు ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం 6.21 శాతంగా నమోదైంది. సెప్టెంబర్‌లో 5.49 శాతంగా ఉండగా... గతేడాది అక్టోబర్‌లో 4.87 శాతంగా ఉంది. రిటైల్ ద్రవ్యోల్బణం పెరుగుదలలో ఆహార పదార్థాల ధరల పెరుగుదల కారణమైంది. ఈ మేరకు కేంద్ర గణాంక కార్యాలయం మంగళవారం అధికారిక డేటా వెలువరించింది. ఎన్ఎస్ఓ డేటా ప్రకారం... ఆహార పదార్థాల ధరలు సెప్టెంబర్‌లో 9.24 శాతం ఉండగా అక్టోబర్‌లో 10.87 శాతానికి పెరిగాయి. గతేడాది ఇదే సమయంలో ఆహార పదార్థాల ధరల పెరుగుదల 6.61 శాతంగా ఉంది. ద్రవ్యోల్బణాన్ని 2-6 శాతం మధ్య ఉంచాలన్న లక్ష్యాన్ని కేంద్రం ఆర్‌బీఐకి అప్పగించింది. దీంతో కీలక వడ్డీ రేట్లను గరిష్ఠ స్థాయికి చేర్చింది.

ముస్లింలకు టికెట్ ఇవ్వని బీజేపీ

- మొత్తంగా 150 స్థానాల్లో అభ్యర్థిత్వం శూన్యం
- మహారాష్ట్ర బరిలో మొత్తం 420 మంది
- వీరిలో 218 మంది స్వతంత్రులు
- కాంగ్రెస్ నుంచి తొమ్మిది మంది, అజిత్-ఎన్‌సీపీ నుంచి ఐదుగురు మాత్రమే

నాగపూర్: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సమయం సమీపిస్తోంది. ఈనెల 20న పోలింగ్ జరగనుంది. పార్టీలు తమ అభ్యర్థులను ఇప్పటికే ప్రకటించాయి. 288 నియోజకవర్గాల నుంచి 4,136 మంది పోటీ చేస్తున్నారు. వీరిలో ముస్లింలు అభ్యర్థులు 10శాతం మంది మాత్రమేనని రాష్ట్ర ఎన్నికల విభాగపు డేటా చెబుతోంది. మొత్తం 420 మంది ముస్లింలు పోటీ చేస్తుండగా, వీరిలో దాదాపు సగం మందికిపైగా స్వతంత్ర అభ్యర్థులేనని తెలిపింది. మొత్తం 288కుగాను 150 అసెంబ్లీ నియోజవర్గాల్లో ఒక్క ముస్లిం అభ్యర్థి లేకపోగా, దాదాపు 50 స్థానాల్లో ఒక్కక్కరు ఉన్నారు. ఐదు నియోజకవర్గాల్లో మాత్రం ఏడుగురు చొప్పున పోటీ చేస్తున్నారు. ప్రధాన పార్టీలు కూడా ముస్లింలకు పెద్దగా టికెట్లు ఇవ్వలేదు. అధికార కూటమిలోని బీజేపీ అసలు ఒక్క ముస్లిం అభ్యర్థినీ నిలబెట్టలేదు. ఈ పార్టీ తరఫున పోటీ చేసే వారిలో ఒక్క ముస్లిం కూడా అభ్యర్థి లేరు. దీంతో ఈ పార్టీ ముస్లింలకు టికెట్లు ఇవ్వదు కానీ వారి పేరిట రాజకీయం చేయడంలో దిట్ట... ఇది ముస్లిం వ్యతిరేక పార్టీ అన్న విమర్శలున్నాయి. హిందూ పార్టీగా చెప్పుకుంటే ముస్లింలను కాషాయ పార్టీ దూరం ఉంచుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు ప్రతిపక్ష ఎంవీఏ కూటమిలోని కాంగ్రెస్ పార్టీ తొమ్మిది మంది ముస్లింలకు టికెట్లు ఇచ్చింది. బీజేపీకి మిత్రపక్షమైన అజిత్ పవర్ నేతృత్వ ఎన్‌సీపీ తరఫున ఐదుగురు ముస్లింలు పోటీలో ఉన్నారు. అత్యధికంగా 16 మందిని ఏఐఎంఐఎం నిలబెట్టింది. చిన్న పార్టీల నుంచి మొత్తం 150 మంది బరిలో నిలిచారు. అయితే 420 మంది ముస్లిం అభ్యర్థుల్లో 218 మంది స్వతంత్రంగా పోటీ చేస్తున్నారు.

మాలేగావ్ సెంట్రల్ అభ్యర్థులంతా ముస్లింలే

మాలేగావ్ సెంట్రల్ నుంచి పోటీ చేసే 13 మంది అభ్యర్థులంతా ముస్లింలే కావడంతో ఈ స్థానం ప్రత్యేకంగా నిలిచింది. ఔరంగాబాద్ ఈస్ట్ నుంచి పోటీ చేసే 29 మందిలో నుంచి 17 మంది ముస్లింలు ఉన్నారు. అయితే వీరిలో ముగ్గురు మహిళలు ఉన్నారు.

ముస్లిం మహిళా అభ్యర్థులు 22 మందే

వాస్తవానికి ముస్లిం మహిళలకు రాష్ట్ర రాజకీయాల్లో అవకాశాలు అరుదు. మొత్తం అభ్యర్థుల్లో ఐదు శాతం అంటే 22 మంది ముస్లిం మహిళా అభ్యర్థులు ఉన్నారు. 288కుగాను 270 నియోజవకార్గల్లో అదృష్టాన్నీ పరీక్షించుకుంటున్న వారిలో ముస్లిం మహిళలు ఒక్కరూ లేరు. ఏ పార్టీ తరఫున గానీ స్వతంత్రంగానీ వీరు పోటీ చేయడం లేదు. ముస్లిం మహిళలకు పోటీకి వెనుకాడటానికి ఎన్నికల ఖర్చే ప్రధాన కారణమని రాష్ట్ర కేబినెట్ మాజీ మంత్రి అనీస్ అహ్మద్ అన్నారు. మధ్యతరగతి అభ్యర్థులు ముఖ్యంగా మైనారిటీలకు చెందిన వారు ఎన్నికల ఖర్చుకు భయపడి పోటీకి దూరంగా ఉంటున్నారని చెప్పారు. ముస్లిం మహిళలు రాజకీయాల్లోకి వచ్చేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్న ఆయన ఎన్నికల ఖర్చు ఎక్కువ కాబట్టే వారు వెనకడుగు వేస్తున్నారన్నారు.

ఆదాయం వైపు ఏపీ అడుగులు: విజయకుమార్

విశాలాంధ్ర-విజయవాడ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆంధ్ర ప్రదేశ్ ఆదాయం వైపు అడుగులు వేస్తోందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయకుమార్ అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో విజయకుమార్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి ఇప్పుడు సిగ్గు లేకుండా బడ్జెట్‌పై పిచ్చి ప్రేలాపనలు పేలుతున్నారని మాజీ సీఎం జగన్, ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిపై మండిపడ్డారు. రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు. అనేక పరిశ్రమలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు వస్తున్నాయన్నారు. రాష్ట్రాభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని స్పష్టం చేశారు.

ప్రజల నమ్మకాన్ని వమ్ము చేస్తున్న వైసీపీ : ఆనం వెంకట రమణారెడ్డి

అసెంబ్లీకి వెళ్లకుండా ఓట్లు వేసిన 1.32 కోట్ల మంది ప్రజల నమ్మకాన్ని వైసీపీ నాయకులు వమ్ము చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణా రెడ్డి అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన మరో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో 39.37 శాతం ఓట్లు వైసీపీ నాయకులకు వచ్చాయని, 1,32,89,134 మంది వైసీపీకి ఓట్లు వేస్తే అసెంబ్లీకి ఎందుకు వెళ్లడం లేదో, ఆ మర్మమేమిటో ప్రజలకు తెలియాలని అన్నారు. ప్రభుత్వం ఏమైనా తప్పులు చేస్తే వాటిని నిలదీయాల్సిన, సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన అవసరం వైసీపీ నేతలకు, జగన్‌కు ఉందని తెలిపారు. వైసీపీ ఎమ్మెల్యేలు, జగన్ నిజంగా నీతి, నిజాయితీ గలవారైతే తమకు జీతాలు, గన్ మ్యాన్లు, ఇతర సదుపాయాలు ఏమీ వద్దని స్పీకర్‌కు లేఖ రాసి వారి నిజాయితీని నిరూపించుకోవాలన్నారు. వర్రా రవీంద్రారెడ్డి వైఎస్ భారతీరెడ్డి పీఏ కాకపోతే ఇప్పటికైనా భారతి స్పందించాలని కోరారు. జగన్ అడ్డగోలుగా సంపాదించిన ఆస్తుల గురించి రోడ్డెక్కి కుటుంబం పరువు తీసుకుంటున్నారని అన్నారు.

జగన్‌ను కలిసిన రవికిరణ్ భార్య

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త ఇంటూరి రవికిరణ్ భార్య ఇంటూరి సుజన ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్‌ను మంగళవారం కలిసింది. ఆమెతో పాటు వైసీపీ నేతలు సజ్జల రామకృష్ణారెడ్డి, మాజీ అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్ రెడ్డి తదితరులు ఉన్నారు. తన భర్త ఇంటూరి రవికిరణ్‌ను గత నెల 21 నుంచి పోలీసులు వేధిస్తూనే ఉన్నారని, గుడివాడలో రెండు కేసులు, అరండల్‌పేటలో ఒకటి, విశాఖలో రెండు ఇలా మొత్తం 9 కేసులు పెట్టారని ఆమె చెప్పారు. గుడివాడ, గుంటూరు పోలీసులు పీఎస్‌ల చుట్టూ తిప్పిన తర్వాత దువ్వాడ పోలీసులు వచ్చి సంతకం పెట్టాలని తీసుకెళ్లి పీఎస్‌లో దారుణంగా ప్రవర్తించారని జగన్ దృష్టికి ఆమె తీసుకెళ్లారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ మా కుటుంబానికి అండగా ఉంటామని జగన్ భరోసా ఇచ్చారని చెప్పారు.

తూర్పు కాపుల అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తూర్పు కాపుల అభివృద్ధి సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఏపీ తూర్పు కాపు వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా శ్రీకాకుళం జిల్లా జనసేనకు చెందిన పాలవలస యశ్వసి ఎంపికైన విషయం తెలిసిందే. మంగళవారం తాడేపల్లిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి సవితను యశ్వసి మర్యాదపూర్వకంగా కలిశారు. తనపై నమ్మకం ఉంచి తూర్పు కాపు కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా అవకాశమిచ్చినందుకు మంత్రి సవితకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సవిత... యశ్వసికి అభినందనలు తెలిపారు. కూటమి లక్ష్య సాధనలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, అర్హులందరికీ పథకాలు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.